29-09Pg1exHMNWJQEKV final 1 ONG_29-09Pg1exHMNWJQEKV final.qxd 9/29/2025 1:25 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 239 పేజీలు: 12 వెల: 6.50

నటి సంజనకు సుప్రీంకోర్టు నోటీసులు 9లో

ఆధార్ అప్‌డేట్‌కు ఇక రుసుముల బాదుడు




## గరుడసేవకు పోటెత్తిన భక్తులు

### తిరుమల మొత్తం జనసంద్రం

3 లక్షల మంది పైగా రాక

సౌకర్యాలు భేష్.. అయినా తప్పని తిప్పలు

**తిరుమల, సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడవాహనసేవకు అత్యంత విశిష్టత ఉంది. గరుడునిపై ఏడు కొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే ముక్తికలుగుతుందని పురాణాల ఐతిహ్యం. అంతటి మహిమాన్వితమైన గరుడసేవ ఆదివారం రాత్రి తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఉదయంనుండే కలియుగవైకుంఠం తిరుమలభక్తజనసంద్రంగా మారింది. >>2

# జయహో భారత్

## ఆసియా కప్ మనదే

ఫైనల్లో పాక్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు

146 పరుగులకు పాక్ ఆలౌట్

చివరి నిముషందాకా నరాలు తెగే ఉత్కంఠ

సంబరాల్లో మునిగితేలిన క్రికెట్ అభిమానులు

9వ సారి ఆసియాకప్ గెలిచిన టీమిండియా

పాక్ : 146 ఆలౌట్ - భారత్ : 150/5



**దుబాయ్, సెప్టెంబర్ 28:** ఆసియా కప్‌ను మరోసారి టీమిండియా ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టి పాకిస్తాన్‌ను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో సఫలీకృతుడయ్యాడు. అనంతరం టీమిండియా 5 వికెట్ల కోల్పోయి ఇంకా రెండు బంతులు మిగిలి ఉండగానే, 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ గెలవడంతోపాటు ఆసియా కప్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. తొమ్మిదోసారి చాంపియన్‌గా నిలిచి భారత జట్టు చరిత్ర సృష్టించింది.
ఇక మ్యాచ్ విషయానికొస్తే, టాస్‌గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకోగా, పాక్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సహిబ్జాద పర్హాన్(57), ఫఖర్ జమాన్ (46) రాణించగా, మిగతా బ్యాటర్లు >>2



## ప్రకాశం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం బ్యారేజి వరద ఉధృతి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇక్కడ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 6.05 లక్షల క్యూసెక్కులుగా ఉంది. దీంతో 69 గేట్లు ఎత్తినీటిని విడుదల చేస్తున్నారు. లంక గ్రామాల ప్రజలను జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణానదికి భారీగా వరద వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కృష్ణానదికి వరదల దృష్ట్యా మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. కొల్లూరు మండల కంట్రోల్ రూం నంబర్ 7794894544,భట్టిప్రోలు మండలం కంట్రోల్ రూం నెంబరు 8179886399గా గమనించి పరిస్థితులు వివరించి రక్షణ పొందవచ్చునని అధికారులు వివరించారు.దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.ప్రకాశం బ్యారేజీ దిగువ సెల్ఫీ దిగడం.ఘాట్ దాటి రావడం సరికాదని, ప్రాణాంతకమని అధికారులు హెచ్చరిస్తున్నారు.కృష్ణా నదిలో బోట్లు విహారాన్ని నిషేదించారు.

## అరకు కాఫీకి అంతర్జాతీయ అవార్డు

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** అరకు కాఫీకి 'ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది.ఇది అంతర్జాతీయ స్థాయిలో ఇచ్చే అవార్డు, అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు పట్ల సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. అరకు వ్యాలీ కాఫీ మరో ఘనత సాధించిందని పేర్కొన్నారు. 'ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించడం శుభపరిణామం అని చెప్పారు. ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో ఇది దక్కిందని పేర్కొన్నారు. గిరిజన రైతుల కృషితో బలమైన సామాజిక స్థానం సాధ్యమైందన్నారు.అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు అవిశ్రాంతంగా, అంకితభావంతో కృషి చేశారని ప్రశంసించారు. అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు స్థిరమైన ఆదాయాలను పొందుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి గుర్తింపును సాధించారని కొనియాడారు.



## అక్టోబర్ 2న ఖాదీయే ధరించండి

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** నిస్వార్థ సేవా స్ఫూర్తి, క్రమశిక్షణలే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నిజమైన బలాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఆర్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతీపనిలోనూ 'నేషన్ ఫస్ట్‌కే' ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. 100వ వ్యవస్థాపక దినోత్సవాలను ఆర్ఎస్ఎస్ ఘనంగా నిర్వహించుకుంటున్న వేళఆదివారంరోజు 126వ 'మన్ కీ బాత్'లో మోడీ ఈ వ్యాఖ్యలుచేశారు. విజయదశమి రోజునే ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం ఇంకొన్ని రోజుల్లో మనం విజయ దశమిని జరుపుకో బోతున్నాం. ఓ >>2


## విద్యుత్ కొనుగోళ్లపై వెయ్యి కోట్లు ఆదా

గత ప్రభుత్వ అసమర్ధ విధానాల వల్లే ప్రజలపై భారం

జిఎస్టీ సంస్కరణపై ప్రచారం జరపండి

రోగులు వాడే మందులపై జిఎస్టీ తొలగింపు శుభసూచికం

వైఎస్సార్సీ ఎమ్మెల్యేలు సభకు రారు, ఎమ్మెల్సీలు వస్తారు.. ఇదో చోద్యం : సిఎం చంద్రబాబు



**విజయవాడ,సెప్టెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి పార్టీలు జిఎస్టీ సంస్కరణల ఉత్సవ్‌పై ప్రచారం చేపట్టాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ .. వైఎస్సార్సీ హయాంలో అవలంభించిన అసమర్థ విధానాలతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడిందని విమర్శించారు. తక్కువ ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టామని, దీంతో రూ.వెయ్యి కోట్లు ఆదా అయినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలపై రూ.వెయ్యి కోట్ల భారాన్ని తగ్గిస్తున్నామన్నారు. జిఎస్టీ సంస్కరణలను ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. కూటమి పార్టీలు జిఎస్టీ సంస్కరణల ఉత్సవ్ ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 60 వేల సమావేశాలు పెట్టి ప్రజలకు వివరించాలని కోరారు. 11 మంది వైఎస్సార్సీ ఎమ్మెల్యేలు శాసనసభకు రావడం లేదనీ, ఆ పార్టీ ఎమ్మెల్సీలు మాత్రం సభకు వస్తున్నారని .. ఇదేం ద్వంద్వ వైఖరి? అని చంద్రబాబు ప్రశ్నించారు. జిఎస్టీ సంస్కరణలతో ఎన్డీఎ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించి చెప్పాలనిసూచించారు. జిఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా జిఎస్టీ సంస్కరణలను వివరిద్దామని మార్గనిర్దేశం చేశారు. పారిశ్రామిక, ఆటో మొబైల్, ఫార్మా, వంటి కంపెనీలకు జిఎస్టీ సంస్కరణలో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. టూ వీలర్, ఏసీలు, కార్లు, వంటింటి వస్తువుల ధరలు తగ్గుతాయని వివరించారు. ప్రజలు నిత్యం ఉపయోగించే వస్తువులకు కూడా జిఎస్టీతగ్గిందని... రోగులు వాడే మందులపై జిఎస్టీ లేదని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ.. ఎపి అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని గుర్తుచేశారు. జిఎస్టీ సంస్కరణలతో ప్రజలకు రూ. 8 వేల కోట్లమేర లబ్ధి జరుగుతోందని వెల్లడించారు. గత జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను సంక్షోభంలోకి నెట్టేసిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీ ప్రభుత్వం అసమర్థ విధానాలతో ప్రజలపై విద్యుత్ ఛార్జీలరూపంలో భారంపడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి >>2

## చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులను ఏరివేయడమే లక్ష్యంగా కాంకేర్‌గారియాబంద్ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రతాదళాల రాకను గుర్తించిన నక్సలైట్లు వారిపై ఎదురుకాల్పులకు దిగడంతో అప్రమత్తమైన భద్రతా దళాలువెంటనే కాల్పులు ప్రారంభించారు.ఇద్దరి మధ్య గంటలపాటు ఎదురు కాల్పులు కొనసాగగా.. ముగ్గురు మావోయిస్టుల మృతిచెందారు. మృతి చెందిన వారిలో ముగ్గురిపై రూ.14 లక్షల రివార్డు ఉన్నట్టు భద్రతా దళాలు గుర్తించారు.మృతుల్లో మహిళ ఉంది. ఘటనా స్థలంలో వారినుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందినవారు సర్వాన్ మడ్కంసా రూ.8లక్షల రివార్డు, రాజేష్ అలియాస్ రాకేష్ హేమ్లాపై రూ.5లక్షల రివార్డు, బసంతి కుంజమ్‌పై రూ.1లక్ష >>2

## కొత్తగా మున్సిపాలిటీలు నగర పంచాయతీలు

### పట్టణీకరణకు సర్కార్ ప్రాధాన్యం

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో పట్టణ ప్రాంతాన్ని విస్తృతంగా పెంచే దిశలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.ఆదాయం వృద్ధిపాటు,ఆధునీకరణ తదితరంశాలను ఈ క్రమంలో చేపట్టాలని చూస్తోంది.దీంతో ఎపిలో మరిన్ని నగర పంచాయతీలు,వివిధ గ్రేడుల మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు పెరిగే అవకాశం ఉంది. జిఎస్టిడిపి మెరుగుపరచుకునేందుకు పట్టణీకరణకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ కూడా సిద్ధం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభిస్తోంది. దీని కోసం పరిశ్రమల స్థాపన, పంచాయితీల విలీనం, పంచాయితీల స్థాయి పెంపు వంటి అంశాలను పరిశీలిస్తోంది. దీనికోసం అవసరమైన కసరత్తు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు కూడా సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 36 శాతం పట్టణ ప్రాంతం ఉంది. 2047 నాటికి దీనిని 60శాతానికి పెంచేందుకు లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ప్రణాళికశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనేక కోణాల్లో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రధానంగా పంచాయితీలను నగర పంచాయితీలుగా మార్చడం, >>2

## 238 ఆసుపత్రుల్లో 'గోల్డెన్ అవర్' చికిత్స

మరో 3,402 మందికి రూ. 7 కోట్ల విలువైన చికిత్స

పేద గుండెల ఉచిత చికిత్స వ్యయం రూ. 100 కోట్లు: మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ, సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్య సంరక్షణ గురించి వైద్య సేవలను కూటమి మందికి గుండె సంబంధిన ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తూందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యమార్ యాదవ్ తెలిపారు.మరోపక్క ఆసుపత్రుల్లో వైద్య సేవలు, మౌలిక వసతులు మెరుగుపరుస్తోందన్నారు. పపంచ హృద్రోగ దినోత్సవం సందర్భంగా మంత్రి సత్యకుమార్ ఆదివారం ఓ ప్రకటన జారీచేశారు.
ఈ ప్రకటనలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి సెప్టెంబరు 26వ తేదీ వరకు 1.41 లక్షల మందికి రూ.996 కోట్ల విలువైన వైద్యాన్ని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా ఉచితంగా అందినట్లు తెలిపారు గుండెపోటుకు గురైన వారికి మండలాల స్థాయిలో తొలిగంట (గోల్డెన్ అవర్)లో అందించిన రూ.7 కోట్ల విలువైన వైద్యంతో 3,402 మందికి ప్రాణాయ పరిస్థితులు తప్పినట్లు చెప్పారు. ఈ నెల 29 (సోమవారం) గుండె చికిత్సకు అయిన వ్యయమే అత్యధికం అన్నారు.ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా గత యేడాది జూన్‌నుంచి ఇప్పటివరకు చికిత్స పొందినవారు 19,61,257 మంది ఉండగా వీరికి అందించిన చికిత్సల వ్యయం >>2

## నిర్లక్ష్యమా! కుట్రకోణమా?



కరూర్ ర్యాలీ తొక్కిసలాటలో 40కి పెరిగిన మృతులు

హైకోర్టును ఆశ్రయించిన విజయ్ టివికె పార్టీ

ఘటనా స్థలాన్ని సందర్శించిన ఏకసభ్య కమిషన్

మృతుల కుటుంబాలకు విజయ్ రూ. 20 లక్షల సాయం

**చెన్నై, సెప్టెంబరు 28:** నటుడు టివికె విజయ్ కరూర్ ర్యాలీకి సంబంధించి ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని చట్టప్రకారం వెళతామని డిఎంకె ప్రభుత్వం ప్రకటిస్తే ఈ ర్యాలీలో కుట్రకోణం ఉందని, రాళ్లు రువ్వడంవల్లనే జరిగిందని విజయ్‌పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. మరోపక్క కేంద్ర హోంశాఖ కూడా ఈ దుర్ఘటనను తీవ్రంగా పరిగణిస్తోంది. సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. ర్యాలీలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మృతుల సంఖ్య 40కి పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరొకరు ప్రాణాలు వదిలారని అధికారులు ప్రకటించారు.
ఇప్పటివరకూ 30 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షతగాత్రుల్లో 26 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 67 మంది వేరువేరు ఆసుపత్రుల్లో చికిత్సపొందుతుండగా ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్యమంత్రి సెంథిల్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టివికె విజయ్ నిర్వహించిన ర్యాలీసంఘటన ఇపుడు రాజకీయ పార్టీలను రగిలిస్తోంది. విజయ్ ర్యాలీకి ఏడుగంటలు ఆలస్యంగా రావడంవల్లనే తొక్కిసలాట జరిగిందని తమిళనాడు డిజిపి స్వయంగా ప్రకటించడం మరింత రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ విషాదానికి కారణంగా నటుడు విజయ్ చేసిన సోషల్‌మీడియా ట్వీటేనని డిజిపి శంకర్ జివాల్ వెల్లడించడంతో మరింత అసహనం పెరిగిందని వెల్లడించారు. ఎక్కువసేపు ప్రజలు వేచి ఉండటంవల్లనే జనమరింతపెరిగి తొక్కిసలాటకు కారణం అయిందన్నారు. ఇదిలా >>2

## బీహార్‌లో నితీశ్‌కు ఎదురుగాలి! 5లో

ఈ సారి మహాఘట బంధన్‌కు అవకాశం!



ఆదివారం బల్‌రామ్‌పూర్ జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి ఓ స్టాల్‌ను పరిశీలిస్తున్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# శాసనసభ రికార్డుల నుంచి కామినేని, బాలకృష్ణల వ్యాఖ్యల తొలగింపు

**విజయవాడ,సెప్టెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభలో ఈ నెల 25న శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ దానికి ప్రతిస్పందనగా హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలిగించారు. అసెంబ్లీ కార్యాలయ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఈ వ్యాఖ్యలు తొలగించాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలని కామినేని శాసనసభలో స్పీకర్ స్థానంలో కూర్చున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజును కోరారు. 'గురువారం సభలో తాను ప్రస్తావించిన కొన్ని విషయాలు అపార్థాలకు దారితీశాయనే అభిప్రాయం కల్గింది. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నా' అని ఆయన విజ్ఞప్తి చేశారు. కామినేని అభ్యర్థనను స్పీకర్‌కు విన్నవించి, తదుపరి చర్యలుతీసుకుంటామని, ఆయన అభిప్రాయాన్ని గౌరవిస్తామని రఘురామ కృష్ణరాజు పేర్కొన్నారు. కామినేని అభ్యర్థన మేరకు ఆయన వ్యాఖ్యలతో పాటు, వాటికి అనుబంధంగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు శాసనసభ వర్గాలు తెలిపాయి. 'కామినేని వ్యాఖ్యలు తొలగించినప్పుడు, దానికి ప్రతిస్పందనగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలూ నిరర్థకమవుతాయి. కాబట్టి మొత్తం ఆవ్యాఖ్యలన్నీ రికార్డులనుంచి తొలగించాలని నిర్ణయించారు' అని వెల్లడించాయి.



ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు

# డి.సిఎం పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ

**విజయవాడ,సెప్టెంబరు 28, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను సిఎం చంద్రబాబు నేడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి చంద్రబాబు చేరుకున్నారు. ఆయనతో మాట్లాడి.. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. పవన్‌కు చంద్రబాబు ధైర్యం చెప్పారు. ఐదు రోజులుగా పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. రాజకీయ పరిణామాలపై వీరిమధ్య చర్చ జరుగుతున్నట్లు సమాచారం. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ జ్వరంతోనే ఇటీవల అసెంబ్లీకి, తన శాఖలపై సమీక్షలు చేశారు. అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు వైద్యం అందించారు. వైద్యులకు చూపించిన జ్వరం తగ్గక పోవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ చూపించుకున్నట్లు సమాచారం. ఇంకా జ్వరంతోనే ఆయన బాధపడుతున్నారు. ఈ క్రమంలో పవన్‌ని పరామర్శించడానికి సిఎం చంద్రబాబు ఆయన నివాసానికి చేరుకున్నారు. ప్రస్తుతం జ్వరం తీవ్రత లేదని, దగ్గు ఎడతెరిపి లేకుండా వస్తోందని పవన్‌తెలిపారు. పరీక్షలు చేసి క్రానిక్ బ్రాంకైటిస్ మూలంగా దగ్గు ఎక్కువగా వస్తోందని, ఫలితంగానే గొంతు దగ్గర నొప్పి కూడా ఉందని వైద్యులు చెప్పినట్లు వివరించారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని ప్రస్తావించారు. అక్టోబర్ 4వ తేదీన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంపై చర్చించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని విజయవంతంగా అమలు చేయగలిగామని, తద్వారా మహిళలకు ఆర్థికపరమైన వెసులుబాటు కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

# వెయ్యి కోట్లు ఆదా

>> వచ్చిన 15 నెలల్లో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టామని నొక్కి చెప్పారు. నేడు తక్కువ ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో విద్యుత్ కొనుగోళ్లల్లో సుమారు రూ.1000 కోట్లు ఆదా చేశామని వివరించారు. ఆ మేరకు రానున్న కాలంలో ప్రజలపై రూ.1000 కోట్ల భారాన్ని తగ్గిస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలను నెరవేర్చామని ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కార్య కర్తలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జిఎస్టీ సంస్కరణలతో మేడిన్ ఇండియా మరింత బలోపేతం అవుతోందని సిఎం బలమైన, సమతుల్యమైన సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. జిఎస్టీ సంస్కరణలతో ఏపీ ప్రజ లకు రూ.8వేల కోట్ల లాభం కలుగుతుందని తెలిపారు. దేశీయఉత్పత్తులుకొనాలని.. దేశాభి వృద్ధిలో భాగస్వాములుకావాలని దిశానిర్దేశం చేశారు. దసరా నుంచి దీపావళి వరకు జిఎస్టీ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. జిఎస్టీపై ఓ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. జిఎస్టీ ఫలితాలు పేదలు, అన్నివర్గాల స్టేక్ హోల్డర్లకు చేర్చాలి. దీనికి 30 రోజులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. దీని అమలుకు ఒక కమిటీ వేశాం. హెచ్‌ఆర్డీ మంత్రి లోకేష్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, టూరిజం మంత్రి కందుల దుర్గేష్‌లతో ఈ కమిటీ వేశాం. భారతీయ ఉత్పత్తులను కొంటే అది కేవలం ఒక లావాదేవి మాత్రమే కాదు.. అది మన సమాజ అభివృద్ధికి హామీ అని సిఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

ఇంటింటికీ జిఎస్టీ కరపత్రాలు తీసుకెళ్లి అగ్రికల్చర్, ఇతర అంశాల్లో ఎలా లబ్ధి కలుగుతుందో వివరిస్తాం. జిఎస్టీ సవరణలతో డిజిటల్ ఇండియా, డిజిటల్ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. చాలా వరకూ 15వేల గ్రామ సచివాలయాల్లో మీటింగ్‌లు పెట్టి అందరినీ ఇన్వాల్వ్ చేస్తాం. 10వేల రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాం.

అక్టోబర్ 7, 8 తేదీల్లో విద్యాసంస్థల్లో జిఎస్టీ గురించి వివరిస్తాం. అక్టోబర్ 9న విలేజ్ హెల్త్ సెంటర్‌లు, వెల్ నెస్ సెంటర్లలో కార్యక్రమం నిర్వహిస్తాం. బిల్డింగ్ వర్కర్లతో అక్టోబర్ 11న 850 సెంటర్లలో కార్యక్రమం నిర్వహిస్తాం. విలేజ్ సెక్రటేరియట్, రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడికక్కడ ఒక్కొక్కరినీ ఏర్పాటు చేసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. మీడియా, హోర్డింగ్స్, ఇంటర్వ్యూలు ఇవ్వడం, పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలు, సెలబ్రెటీలతో మాట్లాడించి అన్ని చేస్తాం. ఎమ్మెల్యేలు ఇచ్చే అంశాలను కూడా మంత్రి వర్గ ఉపసంఘం ఇంక్లూడ్ చేస్తుంది. ఈ సంవత్సరం బ్రహ్మాండంగా ఆనందంగా పండుగలను ప్రజలు చేసుకోవాలి అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# భారీ ఎన్‌కౌంటర్

>> రివార్డు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సర్వాన్ మావోయిస్టు కోఆర్డినేషన్ ఏరియా కమిటీ కార్యదర్శి కాగా.. మరొకరు రాజేష్ నగరి ఏరియా కమిటీ గోబ్రా కమాండర్ ఉన్నారు. కాల్పుల ఘటనపై బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జన రల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ స్పందించారు. మావోయిజం అంతరించిపోయే దశలో ఉందనే వాస్తవాన్ని మావోయిస్టు కార్యకర్తలు అంగీక రించాలని అన్నారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి వరకు 8 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే

## తెలంగాణ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబరు 28,ప్రభాతవార్త :** భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి విజయవాడ (ఎన్‌హెచ్65)జాతీయ రహదారి 8లేన్ విస్తరణకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని 2026 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం కానున్నాయని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుండి విజయవాడ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉండడమే కాకుండా యాక్సిడెంట్స్ ఎక్కువ జరుగుతున్న రహదారుల్లో ఒకటని మంత్రి అన్నారు. ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసినప్పుడు ఈఅంశాన్ని గుర్తుచేశానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు యాక్సిడెంట్ ఫ్రీ రహదారిని అందుబాటులోకి తేనున్నామని, అధునాతన టెక్నాలజీతో, పూర్తి నాణ్యతతో హైదరాబాద్ నుండి విజయవాడ కు రోడ్ నిర్మించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ 8 వరుసల రహదారి పనులు పూర్తి ఐతే హైదరాబాద్ నుండి విజయవాడకు కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుండి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 230 కి.మీ గ్రీన్ ఫీల్డ్ హైవే పట్ల కేంద్ర మంత్రి గడ్కరీ పూర్తి సానుకూలంగా ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.

# 238 ఆసుపత్రుల్లో 'గోల్డెన్ అవర్' చికిత్స

>> రూ. 5,562కోట్లు ఇందులో హృద్రోగ సమస్యలతో చికిత్స పొందిన వారు 1,41,315 మంది ఉన్నారు. వీరికి రూ.996.20 (17.91) కోట్ల విలువైన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం అందించింది. వీరిలో స్టంట్లు 45,986 (32.54) మంది, బైపాస్ సర్జరీలు 9,880 (6.99), వాల్వ్ రీప్లేస్ వేయించుకున్న వారు 3,074 (2.18 ) మిగిలిన వారిలో ఇతర సమస్యలు కలిగిన వారు ఉన్నారని తెలిపారు క్యాన్సర్ బాధితులు 69,926 మంది ఉండగా వారికి కూటమి ప్రభుత్వం రూ.965.48 (17.36 ) కోట్ల విలువైన వైద్యాన్ని అందించింది. ఆ తరువాత ఆర్థో కు సంబంధించి 2,04,108 మంది చికిత్స పొందారు. వీరికి అయిన వ్యయం రూ.641.89 (11.54 ) కోట్లు" అని మంత్రి సత్యకుమార్ వివరించారు.

'గుండె సంబంధ వ్యాధుల చికిత్స అందించే ఆసుపత్రుల సంఖ్య గతంలో కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం పెంచాం. ప్రైవేటు, కార్పొరేటు రంగంలో కలిసి 161 ఆసుపత్రులు, 26 ప్రభుత్వాసుపత్రుల్లో గుండె సంబంధ వ్యాధుల చికిత్స ప్రస్తుతం అందుబాటులోనికి తెచ్చాం. మంగళగిరి ఎయిమ్స్, శ్రీకాకుళంలోని మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రిలోనూ గుండె సంబంధ వ్యాధులకు చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుద్వారా అందుబాటులోనికి తెచ్చాం. 202324లో కంటే 202425 లో ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య 13,921 నుంచి 17,500కు పెరిగింది అని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రాష్ట్రంలోని 238 ఆసుపత్రుల్లో గోల్డెన్‌అవర్ చికిత్స అందుబాటులో ఉంది. 'స్టె మీ' విధానంలో గుండెపోట్లకు గురైన వారికి గోల్డెన్ అవర్లోనే ఈ ఆసుపత్రుల్లో ఉచితంగా బాగా ఖరీదైన ఇంజెక్షన్ను ఇవ్వడం ద్వారా 3,402 మంది రోగుల ప్రాణాపాయ పరిస్థితులు తప్పాయి సామాజిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఈ వైద్యం అందుబాటులోనికి తీసుకువచ్చాం. టెలీ మెడిసిన్ (హబ్ అండ్ స్పోక్) విధానంలో గోల్డెన్ అవర్లో గుండెపోట్లుకు గురైన వారికి త్వరితగతిన చికిత్స అందించేందుకు అమల్లోనికి తెచ్చిన 'స్టెమీ' విధానం 3,402 మందికి టెనెక్ట్ ప్లేస్ (రక్త గడ్డం కరగడానికి) ఇంజక్షన్లు ఇచ్చాం. ఈ ఇంజక్షన్ లను గ్రామీణులకు అందుబాటులో ఉంచుతున్నాం అని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్య సంరక్షణ విషయంలో ఏ మాత్రం రాజీపడడంలేదన్నారు.

అసాంక్రమిక వ్యాధుల గుర్తింపులో భాగంగా రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ (ఓరల్, బ్రెస్టు, సర్వైకల్) లక్షణాలు కలిగిన వారిని సర్వే ద్వారా గుర్తిస్తున్నాం. వీటి ద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందిస్తూనే జీవనశైలి, ఇతర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం జీవనశైలి, ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యాలు బాగుంటాయి. రాష్ట్రం పై రోగాల భారం కూడా తగ్గుతుందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# చైనాలో మాజీ వ్యవసాయ మంత్రికి మరణశిక్ష

**బీజింగ్, సెప్టెంబరు 28:** అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం ప్రకటించింది. దేశ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధిస్తూ జిలిన్ ప్రావిన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సుమారు రూ.334 కోట్ల విలువైనలంచాలు స్వీకరించినట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. అయితే, విచారణకు పూర్తిగా సహకరించినందున శిక్ష అమలును రెండేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొంది. టాంగ్ రెన్‌జియాన్ 2007 నుంచి 2024 మధ్య కాలంలో పలు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలింది. వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం, కాంట్రాక్టులు ఇప్పించడం, ఉద్యోగ నియామకాలు జరపడం వంటి పనుల కోసం భారీ మొత్తంలో లంచాలు స్వీకరించినట్లు కోర్టు నిర్ధారించింది. మొత్తం 268 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.334 కోటు విలువైన నగదు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులను ఆయన లంచాల రూపంలో తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విచారణ సమయంలో టాంగ్ తన నేరాలన్నింటినీ అంగీకరించారు. మరణశిక్షతో పాటు, టాంగ్ రెన్‌జియాన్‌పై మరిన్ని కఠిన చర్యలకు కోర్టు ఆదేశించింది.

# జయహో భారత్





>> ఎవరూ క్రీజులో నిలబడలేకపోయారు. సయీమ్ అయూబ్ 14, కెప్టెన్ సల్మాన్ అఘా 8, మొహమ్మద్ నవాజ్ 6, హారిస్ రవూఫ్ 6 పరుగులు మాత్రమే చేశారు. దీంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టగా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండేసి వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 147 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి భారత్, ఓపెనర్ అభిషేక్ శర్మ(5) నిరాశపరిచాడు. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1) మరోసారి నిరుత్సాహపరిచాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (12) ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయాడు. 4 ఓవర్లకే 3 కీలక వికెట్లు జారవిడుచుకుని భారత జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ ఆచితూచి ఆడుతూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు, సిక్సర్లు బాదుతూ జట్టు స్కోరుబోర్డును పరుగులెత్తించాడు. అభిమానుల్లో సంతోషం నింపాడు. సంజూ శాంసన్‌తో, శివమ్ దూబెతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో టీమిండియా 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్ గెలుపులో బౌలింగ్‌లో కుల్‌దీప్ యాదవ్, బ్యాటింగ్‌లో తిలక్ వర్మ, శివమ్ దూబె అద్భుత ప్రదర్శనే కీలక పాత్ర పోషించింది.

**టోర్నీలో మూడుసార్లు పాక్ ఓటమి**

ఆసియా కప్ టోర్నీలో భారత్ చేతిలో పాకిస్తాన్ మూడు సార్లు పరాజయం పాలైంది. లీగ్‌లో ఓ సారి, సూపర్-4లో రెండోసారి, ఫైనల్‌లో మరోసారి చిత్తుగా ఓడింది. మొత్తమ్మీద పాకిస్తాన్‌పై తమదే పైచేయి అని మరోమారు టీమిండియా నిరూపించుకుంది.

# నిర్లక్ష్యమా! కుట్రకోణమా?

>> ఉంటే టివికె విజయ్ ర్యాలీ సంఘటనకు సంబంధించి కేంద్ర హోంశాఖ సమగ్రనివేదికలు కోరింది. సంఘటన ఎలా జరిగింది, పూర్వాపరాలు, రాష్ట్రప్రభుత్వ చర్యలు వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌లు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనుకోకకుండా 30 వేలమందికిపైగా ఒక్కసారిగా వచ్చిపడటంతో తొక్కిసలాట జరిగింది. రాష్ట్రప్రభుత్వం మృతుల కుటుంబాలక పదిలక్షలు, బాధితులకు లక్షరూపాయలు చొప్పున పరిహారం ప్రకటిస్తే కేంద్రంనుంచి పిఎం సహాయనిధినుంచి మృతులకు రెండు లక్షలు, గాయపడినవారికి 50 వేల వంతున ఆర్థికసాయం ప్రకటించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలంటూ ఆదేశాలు జారీచేసారు. ఇదిలా ఉంటే టివికె చీఫ్ విజయ్‌పై పోలీసులు కేసునమోదుచేసిన సంగతి తెలిసిందే. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, జాయింట్ సెక్రటరీనిర్మల్‌కుమార్‌లపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేసారు. ఎడిజిపి ఎస్ డేవిడ్‌సన్ ధృవీకరించారు. విజయ్ ఇద్దరు సహాయకులపైనా ఎఫ్‌ఐఆర్ నమోదుచేసామన్నారు.

**మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షలు చొప్పనసాయం**

సంఘటన హృదయవిదారకంగా ఉందని, ఈ బాధ ఆ కుటుంబాల్లో ఎన్నటికీ వీడనిదని టివికె చీఫ్ విజయ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షల వంతున ఆర్థికసాయం అందిస్తామని, గాయపడినవారికి రెండు లక్షలచొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబీకులందరికీ ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**తొక్కిసలాటపై కుట్రకోణం ఉంది: టివికె పార్టీ**

కాగా కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో కుట్రకోణం ఉందని, ర్యాలీలో గుర్తుతెలిని వ్యక్తులు రాళ్లు విసరడం, పోలీసులు లాఠీ ఛార్జిచేయడంవల్లనే తొక్కిసలాటపెరిగి ఈ ఘోరం జరిగిందని టివికె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. సిబిఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసి విచారణ జరిపించాలనికోరింది. టివికె తరపున న్యాయవాది ఎస్ అరివళగన్ ఈ పిటిషన్ దాఖలుచేసారు. హైకోర్టు చీఫ్‌జస్టిస్ దండపాణి నివాసానికి వెళ్లి విచారణ జరిపించాలని విజ్ఞప్తిచేసామని సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు హైకోర్టులోని మధురైబెంచ్‌కు కేసు విచారణకు వస్తుందని తెలిపారన్నారు. ఇదిలా ఉంటే ఈ సంఘటనతో విజయ్ ఇంటికి భద్రతను పెంచారు. ఆదివారం ఉదయంనుంచే విజయ్ ఇంటివద్ద భారీ సంఖ్యలో పోలీసులను మొహరించారు.

**సంఘటనస్థలానికి ఏకసభ్య కమిషన్ ఛైర్మన్**

ఇదిలా ఉండగా ఆదివారం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ సంఘటన ప్రాంతాలను సందర్శించారు. అలాగే ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను కూడా పరామర్శించారు. రాష్ట్ర డిజిపి ఇతర రెవెన్యూ జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఇతర అధికారులనుంచి క్షేత్రస్థాయి నివేదికలు అందించాలని కోరారు. సంఘటన పూర్వాపరాలు, బాధ్యతారాహిత్యం, బందోబస్తు వివరాలు మొత్తం కావాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# గరుడసేవకు పోటెత్తిన భక్తులు

>> ఆదివారం ఉదయం మోహినీ అవతారం వాహనసేవ ముగియగానే ఎక్కడి భక్తులు అక్కడే అలాగే గ్యాలరీల్లో, మాఢవీధుల్లో కూర్చున్నారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.80లక్షలమంది భక్తులు వాహనసేవలు వీక్షించే సౌకర్యం కలిగింది. దసరా సెలవులు, పెరటాసిమాసంతోబాటు ఆదివారం రాత్రి జరిగిన బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవ వీక్షణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలనుండేగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రల నుండి భక్తులు అనూహ్యంగా తిరుమలకు రావడంతో ఆదివారం ఉదయంనుండి కొండంతా భక్తజనసందోహంగా మారింది. ఉదయం 5గంటల నుండి ఆలయమాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి భక్తులు చేరారు. మధ్యాహ్నం 12గంటలకు మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.30లక్షల మంది భక్తులు నిండిపోయారు. మిగిలినభక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడానికి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎక్కడ భక్తులను అక్కడే నిలువరించారు. దాదాపు 50వేలమందివరకు భక్తులు తిరుమలలోనే పలు చోట్ల వెలుపల వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మధ్యాహ్నం రెండుగంటల తరువాత భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించలేదు. ఆదివారం ఉదయం భక్తుల రద్దీ మరింత రెట్టింపయ్యింది. ఉదయం నుండే గ్యాలరీల్లోకి చేరుకునే భక్తులసంఖ్య క్రమంగా పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకే తిరుమలలో ఆలయ తూర్పుమాఢవీధి, దక్షిణమాఢ, ఉత్తర పడమర వీధుల్లో గ్యాలరీలు పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 11గంటల నుండి నిరంతరాయంగా భక్తులకు 14రకాల వంటకాలు తయారుచేసి నిరంతరాయంగా అర్ధరాత్రి 12గంటల వరకు సాంబారన్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, చక్కెర పొంగలి, 4లక్షల మజ్జిగ ప్యాకెట్లు, పాలు, కాఫీ, సాయంత్రం సుండలు, అటుకలు తదితర అన్నప్రసాదాలు, తాగునీరు శ్రీవారి సేవకులు, టిటిడి ఉద్యోగులు పంపిణీచేశారు. ఎప్పటికప్పుడు తిరుపతి జిల్లా ఎస్పీ సిసికెమెరాల ద్వారా క్రౌడ్‌మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నారు. చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీగా 4వేలమంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు.

**తిరుమలలో 38 ఎల్ఇడి స్క్రీన్లు:**

సకల సౌకర్యాలు కల్పించినా మధ్యాహ్నం నుండి గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులకు గరుడవాహనసేవ వీక్షించేందుకు ఆలయ మాఢవీధుల్లో 22 ఎల్ఇడి స్క్రీన్లు ,భక్తుల రద్దీ వున్న ఇతరప్రాంతాల్లో 16కలిపి 38పెద్ద డిజిటల్ స్క్రీన్లపై వీక్షించారు. ఆదివారం ఒక్కరోజు భక్తులకు సంతృప్తికరంగా ఆనందనిలయుడ్ని దర్శనం కల్పించేందుకు, వాహనసేవ వీక్షణకు అన్ని దర్శనాలను రద్దుచేశారు. ఆదివారం మధ్యాహ్నం నుండి తిరుమలలోని అనేక ప్రాంతాలలో, మాఢవీధుల్లోని గ్యాలరీలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులు కలసి స్వయంగా ఎక్కడికక్కడే ఎప్పటికప్పుడు భక్తుల సౌకర్యాలపై ఆరాతీస్తూ తనిఖీలు చేశారు. మధ్యాహ్నానికి 4వేల వాహనాలు నిండిపోవడంతో ప్రైవేట్ వాహనాలను, ట్యాక్సీలను, భక్తుల వాహనాలను తిరుమలకు అనుమతించలేదు. అలిపిరిలోనే పార్కింగ్ చేయించారు.

## వారం - వర్జ్యం

29-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి సా.4.28
మూల పూర్తి
వర్జ్యం : రా.4.32-6.17
దు.మ.12.23-1.11,
2) మ.2.47-3.35
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. నూతన పెట్టుబడులలో నిదానం అవసరం.

**వృషభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. వాహనసౌఖ్యం.

**మిథునం:** ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మరిచిపోయే అవకాశం ఉంది.

**కర్కాటకం:** హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు.

**సింహం:** ఉద్యోగయత్నాలు ముమ్మరం చేసి సానుకూల ఫలితాలను సాధిస్తారు.

**కన్య :** పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయంలో కొంత అశాంతికి లోను అవుతారు.

**తుల :** శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తిచేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**వృశ్చికం:** భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

**ధనుస్సు:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది, జాగ్రత్త.

**మకరం:** బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** పాత బాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి.

**మీనం :** ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆరోగ్య సమస్యలు కొంత మెరుగుపడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అక్టోబర్ 2న ఖాదీయే ధరించండి

>> కారణం వల్ల ఈసారి విజయదశమి చాలా స్పెషల్‌గా నిలువనుంది. సరిగ్గా 100 ఏళ్ల క్రితం విజయదశమి పండుగ రోజునే ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించింది. ఈ విజయదశమి రోజునే ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవం కూడా జరగనుంది. ఆ సంస్థ వందేళ్ల ప్రస్థానం అపూర్వమైంది మాత్రమే కాదు, స్ఫూర్తిదాయకమైంది కూడా. వందేళ్ల క్రితం ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటైన సమయానికి మన దేశం బానిస సంకెళ్లలో ఉంది. శతాబ్దాల తరబడి బానిస సంకెళ్లలో బందీ అయినందు వల్ల భారతీయుల ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాలకు మానిపోని గాయమైంది. దేశ ప్రజల్లో ఆత్మన్యూనతా భావం ఏర్పడింది. అందుకే దేశానికి స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమో, సైద్ధాంతిక బానిసత్వం నుంచి స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యంఅని ప్రధాని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారని గుర్తు చేశారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ గత 11 ఏళ్లుగా మళ్లీ పెరుగుతోందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని కోరారు. రానున్న రోజుల్లో వరుసగా పండుగలు ఉన్నాయి. ప్రతి పండుగకి మనం వస్తువులను కొనుగోలు చేస్తాం. ఈసారి జీఎస్టీ ఆదా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఒక బలమైన సంకల్పంతో పండుగలను మరింత ప్రత్యేకంగా మార్చొచ్చు.

ఈ దఫా పండుగలను స్వదేశీ ఉత్పత్తులతోనే జరుపుకుంటామని నిర్ణయించుకుంటే, పండుగ తాలుకా సంతోషం మరింత రెట్టింపు అవుతుంది. షాపింగ్ చేసే సమయంలో ఒకల్ ఫర్ లోకల్ మంత్రాన్ని గుర్తుంచుకోవాలి. దేశంలో తయారైన వస్తువులనే కొనండి. చేనేత, హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులనే ఇంటికి తీసుకెళ్లండి. భారత పౌరులు కష్టపడి తయారు చేసిన వస్తువులనే వినియోగించండి. వీటిని పాటించడం ద్వారా మనం కేవలం వస్తువులను మాత్రమే ఇంటికి తీసుకెళ్లడం లేదు. ఒక విశ్వాసాన్ని తీసుకెళుతున్నాం. ఆత్మ నిర్భర భారత్ సాకారం కావాలంటే అందుకు స్వదేశీ ఒక్కటే మార్గం అని మోడీ అన్నారు. మన పండుగలే మన సంస్కృతిని కలకాలం సజీవంగా ఉంచుతాయి. ఛట్ పూజ సందర్భంగా మనం అస్తమిసున్న సూర్యుడిని పూజలతో గౌరవిస్తాం. యునెస్కో అపూర్వ సాంస్కృతిక వారసత్వ జాబితాలో ఛట్ పూజను చేర్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ చేరిక జరిగితే, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు ఈ పండుగ ప్రాధాన్యం గురించి తెలుసుకోవడం మొదలుపెడతారు. అంతర్జాతీయ పండుగగా ఛట్ పూజ మారుతుంది. కొంతకాలం క్రితం మా ప్రభుత్వం చొరవ వల్లే కోల్‌కతా దుర్గాపూజను యునెస్కో జాబితాలో చేర్చారని మోడీతెలిపారు.

# మున్సిపాలిటీలు నగర పంచాయతీలు

>> కొన్నింటిని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో విలీనం చేయడం వంటి, మరికొన్ని పంచాయితీలను కలిపి ఉడా (అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ)లుగా అభివృద్ధి చేయడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. వాస్తవానికి గతంలోనే పట్టణీకరణకు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. పట్టణీకరణ తరువాత ఆయా ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కనీసం 20 నుంచి 40 వేల మంది వరకు ఉండాలని, ప్రతి చదరపు కిలోమీటర్కు 400 మందితో జనసాంద్రత ఉండాలని ఆ మార్గదర్శకాల్లో సూచించిన సంగతి తెలిసిందే. అలాగే ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారిలో 25 శాతం వరకు ప్రజలు వ్యవసాయేతర కార్యక్రమాల్లో ఉపాధి పొందుతుండాలని, అక్కడ పరిశ్రమలను భారీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కూడా నిర్దేశించారు. పట్టణీకరణ విధానాన్ని విస్తృతం చేసేందుకుగాను భూసేకరణ అవకాశాలను కూడా పెంచాలని పేర్కొన్నారు. ఆదాయం కోసమేనా..? ఆదాయాన్ని పెంచుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో వివిధ రకాల పన్నులు, సేవల రుసుములు ఎక్కువన్న సంగతి తెలిసిందే. మౌళికవసతుల ఏర్పాటు సంగతి ఎలా ఉన్నప్పటికీ తక్షణం ఖజనాను నింపుకునే అవకాశం ఉండటంతో ఆ దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు భావిస్తున్నారు.

MN 3 GV_29-9Pg3exHMNWJQEKLCTV.qxd 9/28/2025 11:21 PM Page 1



# తిరుమల సమాచారం

## గరుడునిపై వేంకటాద్రివాసుడు అభయం

### గోవిందనామ స్మరణలతో మార్మోగిన తిరుమల



**తిరుమల,సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రా ముఖ్యత సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రవత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియ జేశాడు. ఏడుకొండలస్వామి సాలకట్ల బ్రహ్మోత్స వాల్లో ఆదివారం రాత్రి విశేషాభరణాల అలంకృ తుడైన మలయప్పస్వామి తనకెంతో ప్రీతిపాత్ర మైన గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధు ల్లో ఊరేగారు. జగన్నాటక సూత్రధారి మలయ ప్పస్వామి భక్తజనానికి దర్శనమిచ్చాడు. చల్లటి వాతావరణంలో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మర ణల మధ్య మెల్లగా మలయప్పస్వామి భక్తకోటిని కరుణిస్తూ భక్తకోటికి స్వామివారు సకలం నేను న్నానంటూ అభయమిచ్చాడు. ఏడుకొండలు ఏడులోకాలకు ప్రతీతి. ఇందులో గరుడాద్రి (వేంకటాద్రి) పర్వతంపై కొలువై వున్న తిరుమల శ్రీవేంకటేశ్వ రుడు మహామహిమాన్వి తమైన దేవుడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు శాంతారాం, దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జంగాకృష్ణమూర్తి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సిం ఘాల్ దంపతులు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమి షనర్ మౌర్య, సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తిరుమల అడిషనల్‌ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## 'శృంగారరసాధిదేవతగా జగన్మోహనాకారుడు'

**తిరుమల,సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** కన్నులపండువగా సప్తగిరులపై జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు ఆదివారం ఉదయం మోహినీఅలంకారంలో మలయప్పస్వామి ముగ్ధమనోహరంగా భక్తులను కటాక్షించాడు. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత ఆలయంలోపల నుండి వెలుపలకు వచ్చిన శ్రీనివాసప్రభువు శృంగారరసాధిదేవతగా మోహినీరూపంలో భక్తులకు మోక్షంకలిగించాడు. ఆపదమొక్కుల వాడు శ్రీమలయప్పస్వామి దంతపుపల్లకిపై చేతిలో బంగారపుచిలుకను ధరించి మరోరూ పంలో పక్కనే శ్రీకృష్ణుడు ఆలయంముందుకు వేంచేశారు. కమనీయమైన శ్రీకాంతునిరూపం జగత్సమ్మోహకంగా కనువిందుచేసింది. "పుంసాం మోహనరూపాయ" అన్నట్లు శ్రీమహావిష్ణువు ఏరూపం ఎత్తినా,పురుషులకు కూడా సమ్మోహకుడవుతాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు శాంతారం, దివాకర్‌రెడ్డి,పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జంగాకృష్ణమూర్తి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.



### గరుడకు ముందు వరుణుడి పలకరింపు

## వర్షాన్ని ఖాతరుచేయని భక్త జనం

**తిరుమల,సెప్టెంబరు 28 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై జరుగుతున్న వెంకన్న బ్రహ్మో త్సవాల్లో ఆదివారం రాత్రి జరిగిన అత్యంత ముఖ్యమైన గరుడవాహనసేవకు ముందు మధ్యాహ్నం వరుణదేవుడు పెద్దపెద్ద చినుకులతో పలకరించాడు. ఉదయం నుండి గ్యాలరీలను అంటిపెట్టుకున్న జనం వాహనసేవ వరకు కదల కమెదలక భక్తితో కూర్చున్నారు. ఉన్నఫళంగా వర్షం కురిసింది. వర్షానికి గ్యాలరీల్లో గంటలు తరబడి వేచివున్న భక్తులు ఏమాత్రం చలిం చలేదు. పదినిమిషాలు వర్షం కురిసింది. సాయం త్రం 4.30గంటలకు మళ్ళీ వరుణ దేవుడు తిరుమలలో వర్షించినా భక్తులు చలిం చలేదు, సాయంత్రం 6.30గంటలకు ప్రారం భమైన గరుడవాహనసేవ సుమారు అర్ధగంట పాటుపైగా వాహనమండపంలోనే విఐపిలకు ప్రత్యేక దర్శనంకోసం నిలిపివుంచారు. రాత్రి 7.05గంటలకు వాహన మండపం నుండి కదలిన గరుడునిపై మలయప్పను చూసి భక్తు లు గోవింద నామాలతో భక్తిని చాటుకున్నారు. కాగా ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు వరుణుడు రావడం సంప్రదాయం.





## అన్నప్రసాదాలు, తాగునీరు అందాయా..

### గ్యాలరీల్లో సౌకర్యాలపై అడుగడుగునా టిటిడి ఛైర్మన్, ఇఓ ఆరా

**తిరుమల,సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** దసరా సెలవులు...ఆపై పెరటాసి మాసం బ్రహ్మోత్సవాల గరుడసేవ ఆదివారం రాత్రి జరగడంతో అనూహ్యంగా భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఉదయం నుండి మాఢవీదుల్లోని గ్యాలరీలకు తరలిరావడంతో గరుడవాహనం రావడానికి ముందే మధ్యాహ్నం నుండి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు,, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, ఇతర అధికారులు తమతమ హోదాను మరచి భక్తులను చేరువగా పలకరించారు.

ఆప్యాయంగా మాట్లాడి తాగు నీరు, కాఫీ, మజ్జిగ, అన్నప్రసాదాలు, సౌకర్యాల కల్పనపై, సదుపాయాల గురించి ఆరా తీశారు. గ్యాలరీల్లో శ్రీవారి సేవకులతో, సిబ్బందితో అందుతున్న సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో వారితో కరచాలనం చేసి మరీ ముందుకు కదులుతున్నారు.

# నేడు మూల నక్షత్రం సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు

**రోజూ లక్ష దాటుతున్న భక్తుల సంఖ్య**

**రద్దీ దృష్ట్యా ప్రత్యేక బలగాలు**

**నేడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు**



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సిపి రాజశేఖర్ బాబు

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీకనక దుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున శ్రీ సరస్వతి దేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మూల నక్షత్రం రోజున దర్శన ఏర్పాట్ల పై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో శీనా నాయక్ తో కలసి ఆదివారం మీడియా తో మాట్లాడారు. గడచిన నాలుగు రోజుల నుంచి ప్రతిరోజు లక్ష మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారని చెప్పారు. ఈరోజు లక్షన్నర వరకు భక్తులు రావ చ్చని తెలియజేశారు. ఈరోజు రాత్రి 9 గంటల వరకే భక్తులను క్యూ లైన్ లోకి అనుమతిస్తామని చెప్పారు. రాత్రి 11 గంటల తర్వాత క్యూలైన్లో నిలబడే భక్తులు సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారిని రేపు దర్శించుకుం టారని తెలిపారు. కృష్ణా నదికి వరద ఉధృతి పెరిగిందని, రెండవ నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశామని తెలిపారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, స్నానానికి నదిలో దిగడం వంటివి చేయవద్దని చెప్పారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేస్తున్నారని తెలిపారు. సహజంగా రోజుకు 70 నుంచి 80000 ఉండే భక్తుల సంఖ్య ఇప్పుడు లక్ష దాటిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం దీనికి కారణం కావచ్చు అని అన్నారు. 36 కంపార్ట్మెంట్ లన్నీ భక్తులతో నిండినట్లు చెప్పారు. పెరిగిన భక్తుల రద్దీ నేపథ్యంలో అదనంగా ఏపీ ఎస్పీ ప్లటూన్లను రప్పిస్తున్నామని, రోప్ పార్టీలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. మొత్తం భక్తులలో విఐపి ల సంఖ్య రెండు శాతం మాత్రమేనని చెప్పారు. సోమవారం విఐపి పాసులు జారీ చేయడం లేదని చెప్పారు. భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా రేపు ట్రాఫిక్ ను మళ్లిస్తున్నట్లు చెప్పారు.

దుర్గగుడి ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ సోమవారం రెండు లక్షల మంది అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని చెప్పారు. కుంకుమార్చన, శ్రీ చక్ర నవార్చన వంటి ప్రత్యేక పూజలు చేయించుకునేవారి కోసం భవాని ఘాట్, గాంధీ మ్యూజియం నుంచి వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 7 నుంచి 8 మధ్య ఆ వాహనాలలోనే దేవస్థానానికి రావాలని, ఇతర వాహనాలను అనుమతించమని చెప్పారు.

సోమవారం మధ్యాహ్నం మూడున్నర నుంచి నాలుగున్నర గంటల మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. భక్తులకు కోరినన్ని లడ్డూలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధి పథంలో రాష్ట్రం: మంత్రి సవిత

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ కనక దుర్గమ్మ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రంపైనా, విజయవాడ నగర ప్రజలపైనా కనక దుర్గమ్మ చల్లని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనక దుర్గమ్మవారికి రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సవితను అర్చకులు వేదాశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. లక్షలాదిగా తరలొస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా దేవస్థానం అధికా రులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారన్నారు. కనక దుర్గమ్మ చల్లని దీవెనలతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోం దన్నారు. రాష్ట్రంపైనా, విజయవాడ నగర ప్రజలపైనా కనక దుర్గమ్మ చల్లని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని మంత్రి ఆకాంక్షించారు.

**ఉచిత దర్శనం:** లక్షలాదిగా తరలొస్తున్న భక్తులకు అమ్మవారి ఉచిత దర్శనం కల్పిస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు ముగిసేవరకు ఉచిత దర్శనాలకు అనుమతిచ్చారన్నారు. అమ్మవారి దర్శనానికి స్త్రీ శక్తి పథకం ఎంతో దోహదం చేస్తోందని, సుదూ రం నుంచి మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారని మంత్రి సవిత తెలిపారు. కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మంత్రి సవిత క్యూ లైన్లో ఉన్న భక్తులతో మాట్లాడారు. ఏర్పాట్లు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లన్నీ భేషుగ్గా ఉన్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తంచేశారు. కొండపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను మంత్రి సవిత పరిశీలించారు. ఏయే మందులు అందుబాటులో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. భక్తుల కోసం అహర్ని శలు కష్టపడుతున్న వైద్య ఆరోగ్య సిబ్బందని మంత్రి సవిత ప్రశంసించారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన మంత్రి సవితకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఏడో రోజు ఆదివారం అమ్మవారు శ్రీమహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.





## ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణమ్మ

### ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

### జలాశయం నీటిమట్టం 585.80 అడుగులు

**నాగార్జునసాగర్, ప్రభాతవార్త సెప్టెంబరు 28:** నాగార్జున సాగర్ జలాజయానికి ఉరకలేస్తున్న కృష్ణమ్మ ఎగువప్రాంతాలలో విస్తారంగా కురు స్తున్న వర్షాలతో ఉధృతంగా కృష్ణమ్మ ప్రవహి స్తున్నది. ఆదివారం సాయంత్రానికి సాగర్ ప్రాజె క్టుకు 5,88,580,క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతుంది,ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులు 26 రేడియల్ క్రస్ట్ గేట్లను విడుదల చేసి 5,45,884,క్యూసెక్కుల నీరు,విడుదల చేస్తున్నారు,ఇందులో 2గేట్లు 20 అడుగులు, 24,గేట్లు15 అడుగుల ఎత్తు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడు గులు,కాగా ప్రస్తుత నీటిమట్టం585.80 అడు గులకు చేరుకుంది,ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.0450టీఎంసీలు కాగా ప్రస్తుతం 299.7430,టీఎంసీల నీరు నిల్వఉంది. కుడికాల్వద్వారా 8,529, క్యూసెక్కులు, విడు దలను నిలిపివేశారు, జలా శయం ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967, క్యూసెక్కులు ఎస్ఎల్‌బీసీ ద్వారా 12,00, క్యూసెక్కులు, నీరు దిగుబకు విడుదలవుతుంది, అదేవిధంగా ప్రాజెక్టు నుంచి అవుట్ ఫ్లో పూర్తిస్థాయిలో 5,88,580,క్యూసెక్కుల నీరు దిగువకు కొనసాగుతోంది.

## నేడు శరన్నవరాత్రుల్లో కీలకఘట్టం

### శ్రీ సరస్వతి దేవిగా దుర్గమ్మకు సిఎం పట్టువస్త్రాలు

### దుర్గమ్మకు మంత్రి సవిత పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొన సాగుతున్నాయి. దుర్గమ్మవారు శ్రీ మహాచండీ దేవిగా భక్తులను ఆదివారం అనుగ్రహించారు. రాత్రి పది గంటల వరకు దుర్గమ్మవారిని లక్ష పదివేల మంది భక్తులు దర్శించుకున్నారని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. కలెక్టర్ .లక్ష్మీషా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు, కమీషనర్ .రామచంద్రమోహన్, .ఇఓ వికె .శీనా నాయక్ లు ఏర్పాట్లు ఎప్పటి కపుడు పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి భక్తుల సంఖ్య అంతకం తకు పెరుగుతుండడంతో మూలానక్షత్రంరోజున సోమవారం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుం టున్నారు. సుమారు 2లక్షల మంది సోమవారం శ్రీ అమ్మవారిని జన్మనక్షత్రం రోజు న దర్శించుకుంటారని అంచనా. దుర్గమ్మవారిని అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ ఆదివారం దర్శించుకున్నారు. బెజవాడ దుర్గమ్మవారి అలంకారం కోసం దాతలు సిఎం రాజేష్ రు.10లక్షల విలువైన 90 గ్రాముల బంగారు ఆభరణాలను తమ భార్య ప్రకృతి పేరిట విరా ళంగా అందించారు. అలాగే ఉచిత ప్రసాదానికి విజయవాడకు చెందిన మంజూష రు.1లక్ష విరాళాన్ని అందించారు. దుర్గమ్మవారికి రాష్ట్ర మంత్రి సవిత పట్టువస్త్రాలు అందించారు. ఏడవరోజైన ఆదివారం రాత్రి 10 గంటలకు ఒక లక్ష పదివేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ వెల్లడించారు.

దుర్గమ్మవారిని ఆదివారం శ్రీ మహాచండీదేవి అవతారంలో జస్టిస్ ఐఎఎస్ అధికారి అజయ్ జైన్, ఎమ్మెల్యే రాధాకృష్ణ, రిటైర్డ్ జస్టిస్ కృపా సాగర్, జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ కిరణ్మయి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ, ఎంపి కేశినేని శివనాథ్, మంత్రి కందుల దుర్గేష్, ఏపి ఛీఫ్ సెక్రటరి కె. విజయానంద్ తదితర ప్రము ఖులు దర్శించుకున్నారు.

త కృష్ణానదిలో పెరిగిన వరద నీటని కలెక్టర్ లక్ష్మీషా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు జల్లు స్నానాలు మాత్రమే చేయాలని చెప్పారు. వరద వల్ల ఇబ్బంది లేకుండా రెండంచెల బ్యారికెడ్లు ఏర్పాటు చేయించారు. దసరాకు వచ్చే భక్తులను జల్లు స్నానాలు మాత్రమే చేయడానికి అనుమ తించాలని అధికారులను ఆదేశించారు.

## 75యేళ్లు నిండటంతోనే బాధ్యతల నుంచి తప్పుకున్నా

### సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ



**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ తాజా నిబంధనవళిని అనుసరించి కీలక బాధ్యతలనుంచి తప్పుకున్నట్లు సీపీఐ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ డాక్టర్ కంకణాల నారాయణ స్పష్టం చేసారు.తన వయసు 75 ఏళ్ళు నిండటంతో జాతీయ కార్యదర్శి పదవి నుంచి తప్పుకున్నట్లు తెలిపారు.సీపీఐ కంట్రోల్ కమీషన్ ఛైర్మన్‌గా తనను పార్టీ జాతీయ సభలో ఎన్నుకున్నారన్నారని తెలిపారు.. తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఈ విషయాన్ని స్పష్టంగా వివరించారు. 75 ఏళ్ళు నిండిన వారు కీలక పదవుల నుంచి రిలీవ్ కావాలని చండీఘడ్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభలో నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రం సడలింపునిచ్చారు. దాన్ని అనుసరించి ఆ పదవిలో డి.రాజా కొనసాగుతారు' అని వివరించారు. పార్టీలో అంతర్గత సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని సక్రమంగా పరిష్కరించేందుకు కంట్రోల్ కమీషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమకాలీన రాజకీయకంశాలు,ఇతర సమస్యలపై తాను స్పందించి మాట్లాడతానన్నారు.పార్టీలో నూతనాలోచన విధానాలు కలిగిన యువ నాయకత్వం అవసరమన్నారు.

## మత్సకారులకు ప్రయోజనం లేని 'ఫిష్ఆంధ్రా': మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,సెప్టెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ప్రభు త్వంలో మత్సకారులకు కొత్తగా ఒక్క బోటు, వల,వాహనం వంటివేవీ ఇవ్వలేదని, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన క్రింద కేంద్రం నిధులిస్తూ వాటిని 'ఫిష్ ఆంధ్రా'కు మళ్ళిం చారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండి పడ్డారు. రూ.51 కోట్లు ఖర్చు చేసి షాపులు నిర్మించారని, వీటిలో చాలా వరకు పనిచేయడం లేదని,అసలు ఫిష్ఆంధ్రా వల్ల మత్స్యకారుల్లో ఎవరికీ ప్రయోజనం కలగలేదన్నారు.ఈ మేరకు మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో 2014-19 మధ్య మత్సకారులకు స్వర్ణయుగంగా ఉండేదని, వేట నిషేధ భృతి రూ.4వేల చొప్పున ఇవ్వడంతో పాటు చేపలు పట్టుకునేందుకు అన్నీ అందించామని చెప్పారు. గత ప్రభుత్వం ఆపేసిన డీజిల్ సబ్సిడీని ఈ ప్రభుత్వం ఇచ్చిందని, ప్రమాదవశాత్తూ మరణించిన 63 మందికి రూ.5 లక్షల చొప్పున సాయం అందచేశామని చెప్పారు.కాకినాడ ఎంఎల్‌ఏ వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేజ్ కల్చర్ తీసుకు రావాలని కోరారు. ఆక్వా రైతాంగానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు.ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వ్యవసాయరంగంలో యూరియా వాడకాన్ని తగ్గించమంటున్నామని,ఇందుకు ప్రతిగా కొన్ని ప్రోత్సాహాలు ఇస్తామన్నారు.

## కరూర్ తొక్కిసలాట ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** తమిళ నాడులోని కరూర్‌లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పవన్ కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ తొక్కిసలాటలో 31 మంది మరణించారని తెలిసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు కూడా ఉండటం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి తమిళనాడు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రాజ్యాంగంపై ప్రతిపౌరుడుకి అవగాహన ఉండాలి

### రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎడి ఎస్ కిశోర్ కుమార్



రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేస్తున్న కిశోర్ కుమార్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 28, ప్రభాత వార్త:** భారతదేశపు ప్రతిపౌరుడికి రాజ్యాంగ అవగాహన కల్పించడమే తమ ధ్యేయమని అఖిల భారత రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం గుంతకల్లు డివిజన్ అదనపు డివిజనల్ కార్యదర్శి జీ.ఎస్.కిశోర్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్ర మంలో రాజ్యాంగ పుస్తకాలను పౌరులకు అం దజేశారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువ తకు రాజకీయ అవగాహన కల్పించడంతోపాటు దేశపౌరుల ప్రాథమిక హక్కులు, రక్షణ, భద్రతలను కల్పించాలనే ఉద్దేశంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని వీటిని క్షేత్ర స్థాయిలో నివసించే పౌరులవరకు ప్రతి ఒక్కరికి అందించాలనే లక్ష్యంతో రాజ్యాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షుడు ఇ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం కొనసాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# గుణపాఠం ఇంకెప్పుడు?

జనం పోగుబడినచోట రద్దీ ఏర్పడుతుంది. అలాంటిచోట గందరగోళం, తొక్కిసలాటకు ఆస్కారం ఉంటుంది. హడావుడి, ఆందోళనల మధ్య తొక్కిసలాటలు సర్వసాధారణం. అలా అని సరిపెట్టుకోవడం కన్నా గత అనుభవాల బేరీజుతో మరో దుస్సంఘటన జరగకుండా చూసుకోవడం విజ్ఞుల లక్షణం. ప్రతి దుస్సంఘటన మరో కొత్తదారికి మలుపు కావాలి. ఈ మధ్యకాలంలో సందర్భం, సమయం ఏదైనా ఇలాంటి సంఘటనలు జరిగి దాని వైఫల్యాలను పూస గుచ్చినట్లు బహిర్గతపరిచాయి. అన్ని సంఘటనల్లోనూ విషాదాన్ని. ముఖ్యంగా ప్రాణనష్టాన్ని చవిచూసాము. అవన్నీ మానవ తప్పిదాలు కారణంగా, నిర్వాహకుల నిర్లక్ష్యం వలన సంభవించినట్లు నిరూపితమయ్యాయి. దేవాలయాలు, జాతరలు, ఎన్నికల ప్రచారర్యాలీలు, సెలబ్రిటీలు హాజరయ్యే వేడుకల సందర్భంగా జనం పోగుబడినప్పుడు, అలాంటి ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగం మీద ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలు, జనసమ్మోహన యాత్రలు, రాజకీయ పక్షాల రకరకాల విన్యాసాలకు జనాల రద్దీని బట్టి పోలీస్ అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమిళనాడు కరూర్‌లో టీవీకె పార్టీ అధినేత సినీ యాక్టర్ విజయ్ ర్యాలీ సందర్భంగా కనీసం 40 మంది మృతి చెందారు. ఇక్కడి విషయం గురించి చర్చించుకోవాలంటే వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న వివరాలను బట్టి ఆ పార్టీ తమ ర్యాలీకి కేవలం 10 వేల మందిని వస్తారని అనుమతి తీసుకోగా, 27 వేలమంది జనం పిల్లాపాపలతో తరలివచ్చారు. అనుమతులిచ్చిన పోలీసు యంత్రాంగం కూడా స్వీయ అంచనాలు వేసుకునీ మరీ అనుమతులు ఇవ్వాలి. అవసరమైన భద్రత కల్పించాలి. అవన్నీ చేయకుండా వాళ్ల అంచనా మేరకు భద్రత కల్పించామని తేలికగా తీసిపడేయడం పోలీసు విధి, నిర్వహణ అనిపించుకోదు. విషాద ఘటనల నేపథ్యం, జనఅంచనాలు, ఏర్పాట్లు గురించి సమీక్షించి విశ్లేషిస్తే నేతలు, అధికారులు ఎవరికివారు తాజా దుస్సంఘటనకు తాము బాధ్యత కాదంటే తాము బాధ్యత కాదనే ధోరణితో ఉన్నారు. ప్రాణనష్టం సంభవించినపుడు కేవలం సంతాపాలు వ్యక్తం ఊరుకోగలరే తప్ప మరో ప్రమాదాన్ని నివారించే ప్రయత్నాలు చేయలేకపోతున్నారు. కనీసం వ్యవస్థను, ఆ వ్యవస్థలోని బాధ్యతా రాహిత్యాన్నీ కూడా మందలించలేకపోతున్నారు. ఇదీ కలియుగ ధర్మం. మరోసారి అలాంటి దుస్సంఘటనలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న విషయంపై పర్యవేక్షణ లేక కనీసం సమీక్షలు జరిపిన సందర్భాలు కూడా కానరావు. తమిళనాట ఎంజీ రామచంద్రన్, కరుణానిధి, జయలలిత, రజనీకాంత్, కమల్ హాసన్, తాజాగా ఇప్పుడు దళపతి విజయ్‌లకు చెప్పుకో దగినంతమంది అభిమానులున్నారు. వారంతా రాజకీయ ప్రవేశమున్నవారే. పైగా వారివారి రాజకీయ ప్రచా రసభలకు భారీ బందోపస్తు అలవాటు పడినవారే. వారిని చూడగలగడం తమ అదృష్టమని, పూర్వజన్మ సుకృతమని భావించే అభిమానులే ఎక్కువమంది ఉన్నారు. రాజకీయాల్లోకి వచ్చే కథానాయకులకు ఆ మాత్రం ఫాలోయింగ్ ఉండడం కొత్తేమీ కాదు. అలాంటి రాష్ట్రంలో ప్రజాదరణ ర్యాలీ నిర్వహించుకోవల్సినప్పుడు ఆయా పార్టీ నిర్వాహకులకు, ప్రభుత్వ పోలీసు యంత్రాంగానికి బాధ్యత ఉంటుంది. వారు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఏమాత్రం ఆదమరచి ఉన్నా అనుకోని సంఘటనలు జరిగే వీలుంది. ఇప్పుడదే జరిగింది. కరూర్ ర్యాలీకి విజయ్ ఉదయం 12 గంటలకు వస్తారని ప్రకటించగా దాదాపు 7 గంటలు ఆలస్యంగా హీరో చేరుకున్నారు. వారానికి 2 రోజులు ప్రజల్ని కలిసేందుకు విజయ్ పర్యటన ప్రణాళిక ప్రకారమే ఈ కార్యక్రమం మొదలైంది. ఏమైతేనేం రాత్రి 7.20కి బస్ కరూర్‌చేరుకోగా విజయ్ ప్రసంగం ప్రారంభిస్తుండగానే, అంతవరకు వేచివున్న జనం తమ హీరోను చూడాలని ముందుకు కదిలారు. అందులో చిన్నపాప తప్పిపోయిందన్న మాటలు వినిపించగా జనంలో అలజడి బయలుదేరి తొక్కిసలాట జరిగింది. అప్పటికే నిరాహారంగా, కనీసం మంచినీళ్లు కూడా అందుకోలేని పరిస్థితిలో ఉన్న అభిమానులు స్పృహతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో విజయ్ మాట్లాడుతూ రేపటి అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే, డిఎంకెల మధ్యనే పోటీ ఉంటుందని, బీజేపీకి ఓటు వేయొద్దని, డిఎంకె, బీజేపీల మధ్య రహస్య ఒప్పందాలున్నాయని అన్నారు. ఇలాంటి రాజకీయ ప్రసంగంతో అలజడి పెరిగింది. తొక్కిలాస మొదలైంది. దాంతో ఊపిరాడక పదహారు మంది స్త్రీలు, ఎనిమిది మంది చిన్నారులు మృతి చెందారు. దాదాపు వంద మంది క్షతగాత్రులయ్యారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆ తర్వాత మరికొందరు చనిపోవడంతో ఆదివారం నాటికి మృతుల సంఖ్య నలభైకి పెరిగింది. సమయం, సన్నివేశం ఏదైనా అది దుర్ఘటనలకు దారి తీసిన సందర్భాలకు మసిపూసి మారేడు కాయ చేసినట్లుండకూడదు. దీని వలన ప్రజలకు కానీ, దుఃఖిత కుటుంబాలకు కానీ మేలు చేకూరదు. గతంలో ఎన్టీఆర్ వంటి అగ్రనేతలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ ప్రకటించి తెలుగునాట పల్లె పల్లెకూ రథయాత్ర చేసినప్పుడు కూడా మచ్చుకు ఒకటైనా దుస్సంఘటన నమోదు కాలేదు. కాగా నేడు టివికె పార్టీ పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం చెందినందునే చేదు అనుభవాన్ని ఎదురుచూడాల్సి వచ్చింది.

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణుకువతో మెలగాలి.



రామకృష్ణ పరమహంస

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు, మరికొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.



ఫ్రాంక్లిన్

# ప్రజావాక్కు



## పిల్లల భవిష్యత్తుకు అల్పాహార పథకం

**తెలంగాణ** ప్రభుత్వం తమిళనాడు ఉదయం అల్పాహార పథకాన్ని ఆదర్శంగా తీసుకోవడం శుభపరిణామం. పేద కుటుంబాల పిల్లలు తరచుగా ఉదయం అల్పాహారం లేకుండా పాఠశాలకు వెళ్తారు. దాంతో చదువుపై ఏకాగ్రత తగ్గి, హాజరు కూడా ప్రభావితమవుతుంది. అలాంటి పరిస్థితుల్లో పాఠశాలలోనే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందిస్తేవిద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా చదువుకోవచ్చు. తమిళనాడులో ఈ పథకంమంచి ఫలితాలు ఇచ్చినట్లు అనుభవం చెబుతోంది. అదే మార్గంలో తెలంగాణ కూడా అడుగులువేయడం, పిల్లల భవిష్యత్ పట్ల ప్రభుత్వ కట్టుబాటును సూచిస్తుంది. పథకం విజయవంతం కావాలంటే వంట నాణ్యత, పర్యవేక్షణ, పారదర్శకత కీలకం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## జనరిక్ మందులపై అవగాహన అవసరం

జనరిక్ మందులవినియోగాన్ని ప్రోత్సహించడం నేటి సమాజానికి, ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాల వారికి అత్యంత కీలకం. బ్రాండెడ్ మందులతో సమానమైన నాణ్యతతో, 30నుంచి 80తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు ప్రజల ఆరోగ్యహక్కును సాకారం చేయగలవు. జనరిక్ ఔషధాలు ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగాతయారవుతాయి. బ్రాండెడ్ కంపెనీలు మార్కెటింగ్, బ్రాండింగ్‌ల కోసం చేసే అనవసర ఖర్చులు జనరిక్ మందులకు ఉండవు. అందుకే అవి తక్కువ ధరకే అందుబాటులోకి వస్తాయి. జనరిక్ మందుల వాడకం పెరిగితే, వైద్య ఖర్చులు తగ్గుతాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రకృతిని కాలుష్య రహితం చేద్దాం

**అప్పట్లో** వర్షాలు పడి వరదల్లో కొట్టుకు వచ్చిన మురికి నీరు చెరువుల్లోకి చేరికాలుష్యంగా మారడంతో ఆ మురికి నీటిని స్వచ్ఛమైన నీరుగా మార్చడానికి పెద్దలందరూ ఔషధ గుణాలు కలిగిన అరుదైన పువ్వులతో శాస్త్రీయంగా భక్తితో బతుకమ్మ పండుగను జరుపుకుని నీటిని కాలుష్య రహితంగా చేసేటోళ్లు.. ఈ రోజుల్లో తంగేడు, గునుగు పువ్వులు కరువయ్యి. కాగితపు పూలకు కలర్లు అద్ది శాస్త్రీయపూలను మరిచి వ్యాధుల బారిన పడేలా చేస్తున్నారు. ఇకనైనా ప్రకృతి పూలను తెచ్చి పేరుద్దాం.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

## లడఖ్‌లో అశాంతి

**లడఖ్‌లో** లేహ్ పట్టణంలో కొనసాగుతున్న నిరసనలు హింసాత్మక రూపుదాల్చడం, నలుగురి మృతికి దారితీయడం ఆందోళనకరం. కర్ఫ్యూ విధించడం ద్వారా ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తెచ్చినా, దీర్ఘకాలిక పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది. జమ్మూ కాశ్మీర్ నుండి వేరుగా కేంద్ర పాలిత ప్రాంతంగా 2019లో లడఖ్ ఏర్పడినప్పుడు అక్కడి ప్రజల్లో సంతోషం వ్యక్తమైంది. తమ చిరకాలపుకోరిక ఒకరాష్ట్రంగా ఏర్పడడం అన్నది సాధ్యం కావడానికి మొదటి మెట్టుగా భావించారు. ఆ తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రం, స్థానికంగా లేహ్ ప్రాంతానికి, కార్గిల్ ప్రాంతానికి చెరొక అభివృద్ధి మండళ్ల ఏర్పాటు ద్వారా పాలనసాగిస్తోంది. ఈశాన్యంలో అమలవుతున్న ఆరవ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలకు స్వయం పాలన కోరుతూవస్తున్నారు. ఆదిశగా నిరసనలు, నిరహార దీక్షలు జరుగుతున్నా పెద్ద స్థాయిలో హింస ప్రబలడం ఇదే మొదటిసారి.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## ప్రాజెక్టులు నిర్మించాలి

**తెలంగాణ** పురోగమిస్తుంది రాష్ట్రంవిడిపోతే స్వయం సమృద్ధత సాధిస్తాం అని చేసిన పోరాటం గొప్ప మార్పును తెస్తుంది. తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం సాధించింది. దానికి ప్రధానకారణం చెరువులు కుంటలు మాత్రమే. ఒకనాడు పల్లె పల్లెనా పల్లేర్లు మొలిసే అని పాటపాడుకున్న ఈ నెల ఇవ్వాళ మహబూబ్‌నగర్‌లో కూడా పచ్చటిపొలాలు కనిపిస్తున్నాయి. వాటికి ప్రధాన కారణం కల్వకుర్తి బీమా నెట్టెంపాడ్ కోయిల్ సాగర్ లాంటి ప్రాజెక్టులు ప్రధాన కారణం అయితే ఇప్పుడు ఇది అంత ఎందుకంటే మిషన్ కాకతీయ పథకం ద్వారా పూడిక తీత పనులు జరిగి నీటి నిల్వ సామర్థ్యం బాగా పెరిగింది. తద్వారా జనగామ భద్రాద్రి కొత్తగూడెం మహబూబ్ నగర్ లాంటి కరువు ప్రాంతాలు సైతం జలాన్ని ఒడిసిపట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

- భారత అవినాష్, జనగామ

## నిబంధనలు మార్చాలి

భారత దేశంలో ఎన్నికల నిర్వహణలోఎలెక్షన్ కమిషన్ కొన్ని మార్పులు తీసుకురావలసిన ఆవశ్యకతఉంది. ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలు దేశం మొత్తం ఒకేసారి నిర్వహించాలి. అలాగే ముందస్తు ఎన్నికలు నిషేధించాలి. దీనివల్ల ప్రజాధనం వృధా కాకుండా చూడవచ్చు. అలాగే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి. ఎన్నికల నిర్వహణలో లొసుగులను సరి చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి

*అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రోత్సాహకాలు పారిశ్రామిక రంగానికి కల్పించాలి. 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25శాతానికి తగ్గించారు. ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు. కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడి పెట్టాలన్నది దీన్ని ఉద్దేశం. అయితే జరిగిందేమిటి ఉద్యోగ కల్పన కల్పించలేదు. ఉద్యోగులను ఎంతమంది నియమించుకుంటారో కంపెనీలు ప్రభుత్వానికి ముందుగా తెలియజేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ఉద్యోగాలను పెంచుకుంటూపోయే కంపెనీలకు రాయితీలు ఇవ్వాలి. ఎక్కువ మందిని నియమించండి తక్కువ పన్ను చెల్లించండి అనేది ప్రభుత్వ విధానం కావాలి. యువతకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అటు కంపెనీలు ఇటు ప్రభుత్వాలు కల్పించాలి. పాలకులు ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి.*

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

నేడు దేశంలో ఉత్పాదక రంగం కుదేలై ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వలన మేకిన్ ఇండియా లాంటి పథకాలు సఫలీకృతం కానందున అటు చైనా ఇటు అమెరికా నుంచి అనేక యంత్రాలు, యంత్ర పరికరాలు దిగుమతి చేసుకోక తప్పడం లేదు. పారిశ్రామిక రంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించడం వలన సరళీకృత ఆర్థిక విధానాల వలన జరిగిన ఫలితమిది. కుదేలైన తయారీ రంగం ఒకవైపు ఉండగా నేడు దేశానికి దిక్కుగా సేవల రంగం మాత్రమే ముఖ్యంగా ఐటీరంగం వలన మనం ప్రపంచంలో అగ్రదేశాల సరసన ఉన్నాం. ప్రపంచ దిగ్గజ కంపెనీలలో సైతం మన ఐఐటీ, ఎన్ఐటి, ఐఎంలలో చదివిన మన దేశపు విద్యార్థులే సీఈఓలుగా ఉన్నారు. ప్రపంచ సాఫ్ట్వేర్ రంగంలో రాణించడం మనకు గర్వకారణం. దీని పునాదులు ఆనాడు ప్రభుత్వమే ఐఐటీలను ఎన్ఐటీలను స్థాపించి ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడం వలననే జరిగిందనేది మరువరాదు. ఐఐటీలలో ఎన్ఐటీలలోనూ చదువుకున్న యువత ప్రపంచ పెట్టుబడిదారుల దేశాలలో ఉద్యోగాలు పొందేందుకు వలసపోయి వీరంతా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, యూరప్, దేశాలలో ఆర్థికాభివృద్ధికి గణనీయమైన కృషిచేస్తున్నారు. ప్రపంచ అగ్రగామి కంపెనీలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ట్విట్టర్, వంటి వాటి సీఈవోలుగా మనవారు ఉండటం సంతోషించదగ్గ విషయమే. కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని మార్చుతున్న యుగంలో భారతదేశం ఒక కీలకమైన మలుపుదగ్గరఉన్నది. ఐటీ శక్తిగా మనదేశానికి ఎంతో ఖ్యాతి విశాలమైన సాంకేతిక ప్రతిభ ఉన్నప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఇంకా సొంతంగా ఏఐ ప్లాట్ఫామ్లను అభివృద్ధి చేయలేదు. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలను ప్రపంచానికి అందించిన దేశం మనది. కానీ ఓపెనెల్ నుంచి విడుదలైన చాట్‌జిపిటికు లేదా చైనాకు చెందిన డీప్సీక్ సమానమైన సొంత ఏఐ ఉత్పత్తులను మనం ఇంకా తయారు చేయలేదు. ఈ లోటు ఇప్పుడు మన ముందు ఒక పెద్ద సవాల్ నిలబెట్టింది. పెట్టుబడి పరిశోధనలతోపాటుప్రభుత్వ ప్రైవేటు సంస్థల మధ్య మరింత సమగ్ర సహకారం అవసరం. సరియైన మౌలిక సదుపాయాలు నిధులు లేకుండా స్వదేశీ ఏఐ అభివృద్ధి అసాధ్యం. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ పై మన దేశం స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతం కన్నా తక్కువగానే ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. అంటే ఇక ఏఐ ఎలా అభివృద్ధి చెందుతుంది? ఈ రంగంపై విదేశీయులపై ఆధారపడలేం కదా? చైనా అయితే తన స్థూల జాతీయుత్పత్తిలో 2.43 శాతం కృత్రిమ మేధాపైన ఖర్చు చేస్తున్నది. చైనా కృత్రిమ మేధా రంగంలో అమెరికాతో దాదాపు సమాన స్థాయిని పొందడానికి రెండు అంశాలను కారణాలుగా చెప్పవచ్చు. మొదటిది వాణిజ్య సైనిక అనువర్తల అప్లికేషన్లో సెమీ కండక్టర్లను ఉత్పత్తి చేయడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు, పరికరాలు ఏఐ ప్రాసెసర్ల నుంచి హార్డ్వేర్ ఉత్పత్తులు ఏఐ మోడల్స్ వరకు మొత్తం డిజిటల్ టెక్నాల జీ రంగంలో అవసరమైన అన్నిటిని విషయంలో స్వయం సమృద్ధిని, సాంకేతిక ఆధిపత్యాన్ని చేరుకోవడానికి చురుకైన స్థిరమైన జాతీయ విధానం కలిగి ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో మనదేశం కృత్రిమ మేధా అభివృద్ధికి చేపట్టవలసిన వ్యూహం ఇంతవరకు లేకపోవడం శోచనీయం. నేడు దేశంలో కృత్రిమమేధా ఆధారిత కంపెనీలలో ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. ఉద్యోగస్తులను తొలగిస్తున్నారు. కృత్రిమ మేధా అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఇటీవల టాటా కన్సల్టెన్సీ కంపెనీలో 12వేలమంది ఉద్యోగస్తులను తొలగించినారు. టెక్నాలజీ ఆధారిత కార్పొరేట్ సంస్థలు ఉపాధి అవకాశాలు కల్పించగలవా? మన యువతకు ఆ సాంకేతిక పరిజ్ఞానం



లేదుకదా? మూలధన సాంద్రత, ఉత్పత్తి పద్ధతుల ద్వారా కాకుండా శ్రమ సాంద్రత అంటేఎక్కువగా ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టులకు పాలకులు ఎందుకు పోవడం లేదు. వీరికి దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్య తెలియదా? ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలు ఇస్తామని కదా ప్రధానమంత్రి అయింది. ఉద్యోగాలు ఇవ్వడం ద్వారా ప్రజల ఆదాయాలు పెంచడం ఇష్టం లేదా? కంపెనీల ఆదాయాలు పెరిగితే పాలకులకు ఎంత లాభాలు గిట్టుబాటు లభిస్తుందో తెలియదుగానీ ప్రజలకు మాత్రం వాళ్ల భూములు ఖనిజ సంపద, అటవీ సంపద పోగొట్టుకోవడం తప్పనిసరి అయింది. ఏఐ ఆధారిత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఎవరు వ్యతిరేకులు కారు. ఈ టెక్నాలజీని మన నిరుద్యోగులకు అందించితే తప్ప ఏఐ ఆధారిత కంపెనీలో ఏ ఒక్కరికి ఉద్యోగ కల్పన చేయలేవు. యువత నిరాశ నిస్పృహలతో పని, పాటలేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యంచేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతు న్నారు. అటు ఆర్థికాభివృద్ధికి ఇటు సామాజిక భద్రతకు నష్టం వాటిల్లేది యువతలోఅశాంతి హెచ్చరిల్లడంవల్లే కదా? యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలోమమేకం చేయగలిగితే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం దొరకక కనీస సంపాదనకు సైతం నోచుకోక దుర్భర పరిస్థితిలో మన యువత ఉండటం శోచనీయం. డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం చాలావేగంగా అభివృద్ధి చెందడం, జాబ్ మార్కెట్ కూడా సాంకేతిక విద్య అభివృద్ధి చెందడం వలన యువతకు అనుకూలమైన కావలసిన నైపుణ్యాలను కల్పించగలిగితే సాంకేతిక సాధికారికతో దేశం మెరిసిపోతుంది. ఎందుకనగా ఇంజినీరింగ్ పట్టభద్రులు కూడా సగానికి పైగా నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో అత్యంత అల్ప స్థాయిలో సాంకేతిక నైపుణ్యాలను కలిగిన దేశం మనది. మొత్తం శ్రామికులలో కేవలం 4.69 శాతం మాత్రమే శ్రామికులకు ఎంతో కొంత నైపుణ్యం కలిగి ఉన్నారు. మొత్తం శ్రామికులలో చైనాలో 24శాతం, అమెరికాలో 52శాతం, యునైటెడ్ కింగ్డమ్ 68శాతం, జర్మనీలో 75 శాతం, జపాన్‌లో 80శాతం, సౌత్ కొరియాలో 96శాతం శ్రామికులకు పూర్తి నైపుణ్యాలతో ఆర్థిక అభివృద్ధికి ఆయా దేశాలలో సహాయపడుతున్నారు. మన దేశంలో మాత్రమే అత్యంత తక్కువ స్థాయిలో నైపుణ్యం కలిగిన శ్రామికులు ఉన్నారు. కావున మనదేశంలో శ్రామికుల నైపుణ్య శాతం పెంచాలి. ముఖ్యంగా యువత సాంకేతిక నైపుణ్యాన్ని పెంచగలిగితే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుంది. దేశాభివృద్ధికి జనాభా నిధిగా ఉండటం మూలాన ఉపాధి అవకాశాలు కల్పించ లేనందువలన ఉపాధి రంగంలో వీరిశాతం కేవలం జనాభాలో రెండు శాతం మాత్రమే. వీరు మాత్రమే నైపుణ్యాలు అభివృద్ధి శిక్షణపొంది ఉన్నారు. కావున యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం తక్షణ ఆవశ్యకత ఉన్నదని గమనించాలి. అప్పుడే మన దేశం మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి చెందగలదు. యునెస్కో లెక్కల ప్రకారం మన దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యాథమెటిక్స్ కోర్సులు చేస్తున్నవారు ప్రపంచంలోనే ఎక్కువ. సేవల రంగాలకు సంబంధించిన విద్యా సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకుంటున్న వారు మనదేశంలో 26 మిలియన్లు దాటారు. తద్వారా దేశంలో ఎలక్ట్రానిక్స్ తదితర ఉత్పత్తులను చేయవచ్చును. అలా చేయకుండా మన ప్రభుత్వం ఈ వస్తువులను ఎక్కువగా విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రోత్సాహకాలు పారిశ్రామిక రంగానికి కల్పించాలి. 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25శాతానికి తగ్గించారు. ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు. కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడి పెట్టాలన్నది దీన్ని ఉద్దేశం అయితే జరిగిందేమిటి ఉద్యోగ కల్పన కల్పించలేదు. ఉద్యోగులను ఎంతమంది నియమించుకుంటారో కంపెనీలు ప్రభుత్వానికి ముందుగా తెలియజేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ఉద్యోగాలను పెంచుకుంటూ పోయే కంపెనీలకు రాయితీలుఇవ్వాలి. ఎక్కువమందిని నియమించండి తక్కువ పన్ను చెల్లించండి అనేది ప్రభుత్వ విధానంకావాలి. యువతకు కావాల్సినసాంకేతిక పరిజ్ఞానాన్ని అటు కంపెనీలు ఇటుప్రభుత్వాలు కల్పించాలి. పాలకులు ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి.

# నదుల పరిరక్షణతోనే మానవాళి మనుగడ

డా.బుర్ర మధుసూదన్ రెడ్డి

భూగ్రహ జీవనాడులుగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం ఏరులై పారుతూనే ఉన్నాయి. పర్యావరణంలో అతి ప్రధానమైన వనరులుగా జీవ నదులు ప్రాణికోటికి విశిష్ట సేవలను అందిస్తున్నాయి. నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్యనదులు ధరణికే ప్రాణమిచ్చేవరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి. నదీతీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతోపాటు సంరక్షణ బాధ్యతలను తీసుకుంటున్నాయి. సువిశాల భారత దేశ పుణ్యభూమిపై ప్రవహిస్తున్న గంగా, గోదావరి, యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి. ఏ దేశం లోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల జలశక్తి మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేసి పలు నదుల పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి. గత ఐదుదశాబ్దాలుగా మంచి నీటివనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83శాతం వరకు కనుమరుగయ్యాయని తెలుస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞా నికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తలనొప్పి, నదీజలాలదుర్వి నియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, ప్రణాళిక రహిత పట్టణీకరణ, నదీజలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదీ జలాలు పలుచబడడం లేదా గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది. నదీ జలాల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1980 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ నాలుగవ ఆదివారం, అనగా 28 సెప్టెంబర్ 2025 రోజున ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ నదుల దినం' లేదా 'వరల్డ్ రివర్స్ డే' వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది. 2025 ప్రపంచ నదుల దినం ఇతివృత్తంగా 'ఆరోగ్యకరమైన నదులు, ఆరోగ్య వంతమైన భవిష్యత్తు' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించుట జరుగుతోంది. నీటికాలుష్య కట్టడి, నీటిని వ్యాపారంగామార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం, నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డుకట్ట వేయడం, శుద్ధజలాల సంరక్షణ, నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్‌షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవవైవిధ్యాలను కాపాడడంలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జరజరా వాగులై, ఏరులై, నదులై నవ్వుతూ ప్రవహిస్తాయి. నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది. ప్రపంచ మానవాళి ఐక్యత తో మానవ హారం పడితేనే శుద్ధ నదీజలాల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళి మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి. కాలుష్య నదీజలాలు జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి.

# ఫ్యాక్టరీల చట్టసవరణ బిల్లును ఉపసంహరించాలి!

బొల్లిముంత సాంబశివ రావు

చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం 16 నెలలుగా ప్రజావ్యతిరేక, రైతాంగవ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు జరుపుతూ ఉంది. అందులో భాగమే ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్టసవరణ బిల్లు. ఇదికార్మిక, శ్రామిక వ్యతిరేకబిల్లు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల, వాణిజ్య సంస్థల చట్ట సవరణ బిల్లు 2025ను కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ 2025న శాసనసభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదంతెలిపింది. సవరణబిల్లు ప్రకారం దుకాణాలు, వాణిజ్యసంస్థల్లో పనిచేసే రోజువారీ వేలలు 8నుండి 10 గంటలకు, ఫ్యాక్టరీ కార్మికుల రోజువారి పనిగంటలు 9 నుండి 10గంటలకు పెరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు పనిచేసేందుకు బిల్లులో ఆమోదం తెలపటం జరిగింది. గతంలో మూడు నెలల్లో75 గంటలుగా ఉన్న ఓవర్టైమ్పునిబిల్లు ద్వారా 144 గంటలకు పెంచారు. బిల్లులో సవరించిన అంశాలన్నీ1948 ఫ్యాక్టరీల చట్టంలో పేర్కొన్న కార్మిక హక్కులకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. సవరణబిల్లు కోసం ఏపీ ఫ్యాక్టరీల చట్టంలోని అనేక నిబంధనల్లో మార్పుల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ముసాయిదా బిల్లును విడుదలచేసింది. ఈ ముసాయిదా బిల్లునే ఇప్పుడు శాసనసభ, శాసనమండలి ఆమోదించాయి. చట్టంలోని సెక్షన్ 54 అనేది కార్మికుల పని గంటలకు సంబంధించినది. కార్మికుడు రోజుకు, వారానికి ఎన్నిగంటలు పనిచేయాలి అనేది ఈసెక్షన్ పేర్కొంటుంది. దీని ప్రకారం కార్మికుడు రోజుకి8.30గంటలు పనిచేయాలి. ఇందులో భోజన విరామం 30నిమిషాలు ఉంటుంది. చట్టంలోనిసెక్షన్ 54లో మార్పులు చేసిరోజుకి 10.30 గంటలు పనిచేయాలని, అందులో భోజన విరామం అర్థగంటగా బిల్లులో పేర్కొనటం జరిగింది. ప్రస్తుతం చేస్తున్న 9గంటలకన్నా అదనంగా గంటపనిచేయాలి. దుకాణాల్లో పనిచేసే వారు అదనంగా రెండుగంటలు పనిచేయాలి. ఈసవరణతో ఎటువంటి వేతనం లేకుండా కార్మికుని అదనపు శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టిలాభాలు పొందుతారు. అదనపు శ్రమ చేయటంవల్ల కార్మికుడు దోపిడీకిగురౌతాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తానని చంద్రబాబు చెప్పటం అంటే కార్మికులను శ్రమదోపిడీకి గురిచేసి జీవితాలను అంధకారంలోకి నెట్టి, యజమానులు లాభాలుపెంచటమా! చట్టసవరణ బిల్లులో వారానికి 48 గంటల పని యథాతథంగా ఉంటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉంది. రోజుకి 10 గంటల ప్రకారం వారంలో60 గంటలు పనిచేయాలి. అలాంటప్పుడు 48 గంటలు ఎలా అమలు జరుగుతుంది. అందుకు సంబంధించిన వివరాలు ఏమీచెప్పలేదు. పనిదినాలు తగ్గితేనే అది సాధ్యం అవుతుంది. ఫ్యాక్టరీలచట్ట సవరణబిల్లుకు ముందు ప్రతి మూడు నెలలకు 50నుండి75 గంటలు కార్మికుని



వ్రాతపూర్వక అనుమతితో అదనంగా ఓవర్టైమ్పని చేయించవచ్చు. సవరణల బిల్లులో దాన్ని144 గంటలకు పెంచారు. దీనివల్ల విశ్రాంతిలేకుండా కార్మికులపై పనిభారంతో వత్తిడికిలోనై, ప్రమాదాలు, ఆరోగ్యసమస్యలు ఏర్పడతున్నాయి. ఓవర్టైమ్పని చేసినందుకు ఇచ్చేవేతనంలో కూడా వ్యత్యాసం ఉంది. ఇద్దరు చేయాల్సిన పనిని ఒకని చేత చేయిస్తారు. దీనివల్ల ఫ్యాక్టరీ యజమాని అదనంగా కార్మికులను నియమించుకునే అవసరంలేకుండా అధికలాభాలు పొందితే, మరోపక్క ఉపాధి. లేమితో నిరుద్యోగం పెరుగుతుంది. చట్టసవరణలకు ముందు అత్యవసర సర్వీసుల్లో సమ్మె చేయాలంటే 14 రోజుల ముందు సమ్మెనోటీసు ఇవ్వాలి. దీన్ని అత్యవసరంకాని సర్వీసులకు కూడా సవరణల తర్వాత వర్తింపచేశారు. ఫలితంగా అత్యవసరం కాని సర్వీసుల్లో నోటీస్ ఇవ్వకుండానే సమ్మె చేసే హక్కును కార్మికులు కోల్పోతారు. చట్టఉల్లంఘనపైన, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలపైనా యాజమాన్యం చిన్నపాటి నష్టపరిహారంతో తప్పించుకునేందుకు చట్టంలోసవరణ చేయటం జరిగింది. దీన్ని అవకాశంగా తీసుకుని యాజమాన్యం ప్రమాదాల బాధ్యత నుంచి, చట్టఉల్లంఘనల నుంచి శిక్షను తప్పించుకునే అవకాశం ఏర్పడింది. ప్రమాదాలకు గురైయ్యే కార్మికులకులభించే పరిహారం నిరుపయోగంగా మారుతుంది. ఫ్యాక్టరీల చట్టం లోని సెక్షన్ 66 ప్రకారం మహిళాకార్మికులతో రాత్రి ఏడు గంటల తర్వాత ఉదయం 6 గంటలలోపు పనిచేయించ కూడదు. దీన్ని సవరిస్తూ బిల్లులో మహిళలు రాత్రిపూట కూడా పనిచేయవచ్చని పేర్కొనటం జరిగింది. ఇది మహిళలకు సమానహక్కు కల్పించటంగా పేర్కొంది. వాస్తవంలో తక్కువ వేతనంతో మహిళల శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టే అవకాశం బిల్లుద్వారా కల్పించటమే. భారత సామాజిక వ్యవస్థ అర్థభూస్వామ్య సంస్కృతిని కొనసాగిస్తున్నది. ఫలితంగా పురుషాధిక్యత కొనసాగుతూ స్త్రీని విలాస వస్తువుగా చూస్తున్నది. స్త్రీలపై నిరంతరం అనేక అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయి. ఫ్యాక్టరీల్లో పట్టపగలే స్త్రీలు బలవంతపు అత్యాచారాలకు గురౌతున్నారు. అలాంటి పరిస్థితుల్లో రాత్రిపూట పనిచేసే మహిళా కార్మికులకు భద్రతఎలా ఉంటుంది. యజమానులు కల్పించే మహిళాభద్రత ఎలాంటిదో స్త్రీలకు, ప్రజలకు తెలిసిన విషయమే. 2022లో కేంద్రంలోని మోడీప్రభుత్వం, ఎన్నోపోరాటాలు చేసిసాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఏకీకృతం చేయటం పేరుతో కార్మిక హక్కులను హరిస్తూ నాలుగులేబర్ కోడ్‌లుగా మార్చివాటిని చట్టాలుగా మార్చేందుకు పార్లమెంట్లో ప్రవేశపెట్టినప్పుడు టిడిపి పార్టీ దానికి మద్దతు తెలిపింది. అప్పుడే తన కార్మిక వ్యతిరేకతను చాటుకుంది. కార్మికవ్యతిరేక విధానాలు అమలు జరపడంలో మోడీవిధానాలనే చంద్రబాబు ప్రభుత్వంఅమలు చేస్తున్నది. ఏపీఫ్యాక్టరీల చట్టసవరణబిల్లు ద్వారా పరిశ్రమల, సంస్థలపై ప్రస్తుత చట్టంవల్ల కలిగే విధానపరమైన ఇబ్బందులు తొలగించేందుకు చేసిందిగా కూటమి ప్రభుత్వం చెప్పటం ద్వారా పరిశ్రమల, ప్రయోజనాల ప్రయోజనాలుకాపాడి, కార్మికహక్కులను కాలరాయటంఅన్నకూటమిప్రభుత్వవిధానం బయటపడింది. చంద్రబాబు ఆలోచనలు, విధానాలు పెట్టుబడిదారుల, ఫ్యాక్టరీల యజమానుల చుట్టూ తిరుగుతూ, కార్మిక హక్కులను హరించేవిగా ఉంటాయి. అందులో భాగమే ఫ్యాక్టరీలచట్ట సవరణబిల్లు. ఈబిల్లునువెంటనేఉపసంహరించాలి.

5_5.qxd 9/29/2025 12:54 AM Page 1



## కార్యకర్తలకు జగన్ భరోసా డిజిటల్ బుక్- చింతలపూడి



**బల్లికురవ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ అరాచకత్వానికి సమిధలుగా మారుతూ కొందరు తీవ్ర కక్ష సాధింపుతో నలిగిపోతున్న పార్టీ శ్రేణులు మరికొందరు పార్టీ నేతలకు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే భరోసాని డిజిటల్ బుక్ అని అద్దంకి నియోజకవర్గం ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం అద్దంకి నియోజకవర్గం వైసీపీ శ్రేణులతో కలిసి డిజిటల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న అరాచకాలు అన్నింటిని డిజిటల్ బుక్కులో పొందుపరచడం జరుగుతుందని, వారందరికి తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల మండల పార్టీ కన్వీనర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కవులకు ఆదర్శప్రాయుడు జాషువా - ద్రావిడ దేశం కృష్ణారావు



**ఒంగోలు, ప్రభాతవార్త**
నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవం ఆదివారం జై శ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గుర్రం జాషువా శిలా విగ్రహానికి పూలమాలతో అలంకరించి సంఘ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై శ్రీకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకులు ద్రావిడ దేశం కృష్ణారావు ప్రసంగిస్తూ తెలుగు కవులు అందరికి ఆదర్శప్రాయుడు దివంగత గుర్రం జాషువా అని అన్నారు. ఆ రోజుల్లో దళితులకు ఆలయ ప్రవేశం లేని సమయంలో ఒక శివాలయం గబ్బిలం వేలాడటం చూసి చలించిపోయిన జాషువా తన కవిత్వం ద్వారా దళితులకు ఆలయ ప్రవేశం కలిగించడానికి శివునికి విన్నవించుకోవాల్సిందిగా కబ్బిళాన్ని తన కవిత్వం ద్వారా కోరటం ప్రజలందరి హృదయాలను కరిగించే సన్నివేశమని కృష్ణారావు అన్నారు. అలాగే ఆ రోజుల్లో సమాజంలో జరుగుతున్న అస్పృశ్యకతను గురించి ప్రజలను తన పద్యాల ద్వారా చైతన్యపరచారన్నారు. సత్యహరిశ్చంద్ర నాటకంలో జాషువా రచించిన కాటిసీను పద్యాలు నాటికి నేటికి ఎప్పటికి జనాన్ని రంజింప చేస్తున్నాయని కొనియాడారు. అటువంటి మహనీయునికి ప్రభుత్వం వారు శాసనమండలి సభ్యత్వం, పద్మభూషణ్ బిరుదులను ఇచ్చి సత్కరించడం సముచితమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, బీసీ నాయకులు బంకా చిరంజీవి, చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్, పెద్దన్న, బ్రహ్మయ్య, ఆవుల మహేష్, అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ రేబీస్ డే కార్యక్రమం



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతపేట వెటర్నరీ పాలిక్లినిక్ ఆవరణలో ప్రపంచ రేబీస్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు విచ్చేశారు. ఉచిత రేబీస్ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులందరూ విధిగా వారి పెంపుడు కుక్కలను రేబీస్ రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా ప్రకాశం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రవి విచ్చేసి పెంపుడు జంతువులకు రేబీస్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలకు, స్కూల్ పిల్లలకు రేబీస్ వ్యాధి గురించి స్కూళ్లలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ పాలిక్లినిక్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ ఎన్.జగత్ శ్రీనివాసు అధ్యక్షత వహించారు. దాదాపు 275 కుక్కలకు రేబీస్ వ్యాధి రాకుండా టీకాలు వేయడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో యానిమల్ లవర్స్ కుమారి దివ్య, విష్ణు, సికందర్, కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి, డాక్టర్ సురేంద్ర, వెంకటరావు, వీపీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనులకు అన్యాయం చేస్తే సహించం

- మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి
- గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలి
- జిపిఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్




**ఒంగోలు ప్రభాతవార్త ప్రతినిధి**
మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని,అన్ని రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని ఎట్టి పరిస్థితుల సహించే ప్రసక్తే లేదని ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షులు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ హెచ్చరించారు. ఒంగోలు పట్టణంలోని గిరిజన భవన్ లో ఆదివారం గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ అధ్యక్షతన జరిగిన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని, మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు కాలరాస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచిన నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు గూడు నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పొలాలకు దూరం అవుతున్నారని చెప్పుకొచ్చారు. గిరిజన జాతీ అభివృద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించకుండా వినియోగించబడాలంటే చట్టసభలలో గిరిజనుల తరపున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకొరకై మన హక్కుల సంరక్షణ కొరకై సంకటితంగా మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఉద్యమించాలన్నారు. ఎస్టిలో ప్రధానంగా సుగాలి, చెంచు, ఎరుకల, యానాది, నక్కల ఇలా అనేక జాతులు ఉన్నారన్నారు వీరందరికీ సరైన సమాన ప్రాతినిధ్యం లేదన్నారు.రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగిపోయిందన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరాటం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి నోచుకోక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో ఉన్నా ఇతర కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశాన్ని తీసుకువస్తే గిరిజన జాతి ఏకమై సంకటితంగా ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయాల్సి వస్తుందన్నారు.1962 నుండి 67 వరకు చట్టసభలకు నిర్వహించిన ఎన్నికల్లో జిల్లాలను ఒక యూనిట్ గా తీసుకొని రిజర్వేషన్ అందించడం వలన మైదాన ప్రాంతాల్లో అప్పటి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండేది. మైదాన ప్రాంతాల్లో కదిరి, కావలి, మాచర్ల, జగ్గయ్యపేట నాలుగు అసెంబ్లీ స్థానాలకు రిజర్వేషన్ కల్పించి చట్టసభలో ప్రాతినిధ్యం వహించారు .కానీ 1967లో ప్రభుత్వ పాలన విధానాల్లో జరిగిన మార్పుల వలన జిల్లా యూనిట్ తీసుకోకుండా రాష్ట్ర యూనిట్ గా తీసుకోవడం వలన ఏజెన్సీ ప్రాంతాలకి మాత్రమే గిరిజన రిజర్వేషన్ నియోజకవర్గం పరిమితమయ్యాయి. అలా చేయడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2026 సంవత్సరంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాలలో రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజికంగా, ఆర్థిక, రాజకీయ ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం లభించేలా పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం, జాతి వెలుగు కోసం, ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా పోరాడాలన్నారు.అందుకోసం రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లా తిరిగి ఈ చైతన్య యాత్ర పేరుతో ఉద్యమిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్, ఎరుకల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్ మోహన్ కుమార్ ధర్మ, జిపిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ హనుమ నాయక్, జై సంతోష్ నాయక్, ఏ శ్రీను నాయక్, వి రాజు నాయక్, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రవీంద్ర నాయక్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుధాకర్ నాయక్, ఆర్ కృష్ణ నాయక్, ఆర్ దస్రు నాయక్, జె హరి నాయక్, ఆర్ అంజి నాయక్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు దుర్గా నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, జి గణేష్ నాయక్, జైచంద్ర నాయక్, పాములేటి, ప్రసాద్, రమణమ్మ, బండి రూతమ్మ, కాకి రమణమ్మ, దేవరకొండ రమణమ్మ, వెంకట లక్ష్మమ్మ, డాక్టర్లు, మేధావులు తదితరులు పాల్గొన్నారు .



ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## నవంబరు నుండి విద్యుత్ చార్జీల తగ్గింపు

### - మంత్రి గొట్టిపాటి వెల్లడి



**అద్దంకి , సెప్టెంబరు 28, ప్రభాతవార్త**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నవంబరు నెల నుండి విద్యుత్ చార్జీలను తగ్గిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.ఆదివారం అద్దంకిలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ యూనిట్‌కి 13పైసల చొప్పున నవంబరు నుండి విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. గత వైసిపి ప్రభుత్వం 5ఏళ్ళ కాలంలో 9సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని,జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను ఆదాయ వనరుగా మార్చుకుందని,ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు తన అపారమైన అనుభవంతో విద్యుత్‌శాఖలో సంస్కరణలు తెచ్చి, చార్జీల తగ్గింపుకు మార్గం సుగమనం చేశారన్నారు. రాబోవు రోజులలో కూడ విద్యుత్‌చార్జీలు తగ్గించడానికి కృషి చేస్తామన్నారు. జగన్ ప్రభుత్వం ట్రూఆప్ చార్జీల పేరుతో ప్రజలపై 926కోట్లు భారం వేసిందని, మంత్రి వివరించారు.చార్జీల తగ్గింపువలన, చిరు వ్యాపారులకు మేలు జరుగుతుందని ఆయన వివరించారు. ఈ ట్రూఆప్ చార్జీలతో చిన్న పరిశ్రమ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని,ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి 10రోజులకు ఒకసారి విద్యుత్‌శాఖపై సమీక్ష చేసి, రాబోయే రోజులలో చార్జీల భారాన్ని ఎలా తగ్గించాలనే అంశంపై కృషిచేస్తున్నారు అన్నారు. ఇలాంటి తగ్గింపులపై అటు ప్రజలపై, భారం తగ్గడమే కాక, పరిశ్రమలకు కూడ ఊతం మిస్తాయని,క్రొత్త పరిశ్రమలు రావడానికి కూడ మార్గం ఏర్పడుతుందని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఒంగోలు - ప్రభాతవార్త**
ఒంగోలు నగరంలోని సుందరయ్య భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రారంభించారు. హాస్పిటల్స్ లోని పలు బ్లాక్‌లను సందర్శించి అక్కడ కల్పించిన సౌకర్యాల గురించి డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.అనంతరం దామచర్లమీడియాతో మాట్లాడుతూ వైద్య రంగంలో ఎంతో అనుభవం కలిగిన శ్రీనివాసరావు స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. డయాబెటిస్ కేర్ సెంటర్ కూడా ఏర్పాటు చేయడం పట్ల ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని జనార్ధన్ రావు ఆకాంక్షించారు. పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఇక్కడకు వచ్చే పేషెంట్లకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఐ ఎం ఏ ప్రెసిడెంట్ శివసీతారామయ్య, సెక్రెటరీ జాలాది మణిబాబు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు,టిడిపి నగర అధ్యక్షుడు బండారు మదన్,ప్రధానకార్యదర్శి బొడ్డపాటివెంకట్, నాయకులు మండవ మురళీకృష్ణ,పాలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## శ్రీమహాచండీ దేవి అలంకారంలో వల్లూరమ్మ



**టంగుటూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
టంగుటూరు మండలం వల్లూరు గ్రామం నందు వెలసిన శ్రీ వల్లూరమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ వల్లూరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కుంకు మార్చనలు అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేయటం జరిగింది. దేవి శరన్నవరాత్రులలో భాగంగా వల్లూరమ్మ అమ్మవారు ఏడవ రోజు శ్రీ మహాచండీ దేవి అలంకారంలో దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రమేష్ తెలిపారు.

## రైలుపై చిన్నచూపు

**ఒంగోలు, ప్రభాతవార్త**
శ్రీకాళహస్తి- నడికుడి రైల్వే లైనుకు భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారింది. కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్య రైల్వే లైన్‌లో దీనిని చేర్చడంపై హర్షం వ్యక్తమైన అందుకు అనుగుణంగా పనుల్లో ప్రగతి కొరవడడంపై ఆవేదన వ్యక్తం అవుతుంది. దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్ పొడవు 309 కిలోమీటర్లు కాగా, మొత్తం 33 స్టేషన్లు ఉన్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం 2018 నాటికే భూసేకరణ పనులు కొలిక్కి తెచ్చింది. అవార్డ్ చేసి చెల్లింపులే తరువాయి అన్న తరుణంలో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రక్రియను గాలికి వదిలేసింది. పెరిగిన ధరలతో ప్రస్తుతం భూసేకరణ భారంగా మారింది. 2018లో అవార్డు పాస్ చేసిన ధరలకు 15శాతం వడ్డీతో పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం తెలుపగా కొన్ని గ్రామాల రైతులు ప్రస్తుతం మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉందని ఆ క్రమంలోనే కొందరు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు పనులు పూర్తి కాగా కొన్ని ప్రాంతాల్లో నత్తనడకన సాగుతున్నాయి. మొదట రూ.2288 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించగా జాప్యంతో 4వేల కోట్లకు పైగా చేరింది. ఇప్పటి వరకు 1744 కోట్ల పైనే వ్యయమైనట్లు చెప్తున్నారు. ఆ ఆలస్యం కొనసాగితే 5వేల కోట్లకు పైగానే అవసరం అవుతాయని అంటున్నారు. ప్రాజెక్టుకు మొత్తం భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేయాల్సి ఉంది. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రకాశం జిల్లాలో చివరి దశలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గత ఏడాదిగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడాదిగా దర్శి ప్రాంతానికి రైలు నడుపుతామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్తున్నారే తప్ప ఆచరణలో అది అమలు కావడం లేదు. తొలి దశలో నడికుడి నుంచి కనిగిరి వరకు 155 కిలో మీటర్లు రైల్వే లైన్ నిర్మాణం 90శాతం పూర్తయింది. అయితే నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు 1600 ఎకరాల భూమి ఇవ్వాల్సి ఉంది. దాంతో నడికుడి - శ్రీకాళహస్తి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కనిగిరి వద్ద ఎన్‌హెచ్ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది. అదే ప్రాంతంలో క్వారీ వద్ద 300 మీటర్లు రైల్వే ట్రాక్ వేయాల్సి ఉంది. కనిగిరి కందుకూరు రోడ్డులో బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉంది. అక్కడక్కడ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. నెల్లూరు జిల్లాలోనే అత్యధికంగా రైల్వే పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వచ్చే ఏడాదికైనా రైలు నడుస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. నడికుడి నుంచి కనిగిరి వరకు రైల్వే లైన్ నిర్మాణం పూర్తయినందున మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి వీలైనంత త్వరగా రైలు నడపాలని మెట్టప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## చిన్నగంజాం పోలీసు స్టేషన్‌ని తనిఖీ చేసిన డీఎస్పీ మొయిన్





**చిన్నగంజాం(చీరాల), సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
వార్షిక తనిఖీలలో భాగంగా చిన్నగంజాం పోలీసు స్టేషన్‌ని ఆదివారం చీరాల డీఎస్పీ మొయిన్ తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్లో ఉన్నటువంటి రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో క్రైమ్ రేట్లు తగ్గించాలని పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. అలానే పారదర్శకంగా ప్రజలతో మమేకమై ఎలాంటి సంఘ విద్రోహక కార్యక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని విధాలుగా పోలీసు వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఎస్సై రమేష్‌ను సిబ్బందిని అభినందించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం




**సీఎస్‌పురం, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మేకల శ్రీనివాసయాదవ్, ఎంపీడీవో వి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్‌లో ఆదివారం ఎంఈఓలుజే.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి , ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మండలంలోని డీజీ పేట జడ్పీహెచ్‌ఎస్ ఏస్‌ఏ జి.వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ అనికాలపల్లి ఎస్‌జీటీ జే.భారతిలను ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలతో జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, బొట్లా చిరంజీవి, పెరుగు సుబ్బరామయ్య, మన్నేపల్లి పెద్దన్న, పులిమి ఆదినారాయణ, ఇండ్లా బాలయ్య, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, కేతనబోయిన శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కర్ణాటక ఆర్టీసీ బస్సు- మోటార్ బైక్ ఢీ

- మోటార్ సైకిల్లిస్టు అక్కడికక్కడే మృతి - అతివేగానికి నిండు ప్రాణం బలి
- మృతుడు ఏ వన్ గ్లోబల్ కళాశాల విద్యార్థిగా గుర్తింపు







**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
కర్ణాటక ఆర్టీసీ బస్సు- మోటార్ బైక్ ఒక దానికి ఒకటి ఢీకొని మోటారు సైకిలిస్టు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పెద్ద దోర్నాల మండలం కొత్తూరు సమీపాన కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిలో ఆదివారం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలానికి చెందిన ఈడ కొట్టు జస్వంత్(21) మృతి చెందాడు. మార్కాపురం ఏవన్ గ్లోబల్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుకుంటున్నాడు. తన సొంత పని మీద మోటార్ సైకిల్ వాహనంపై కర్నూలు వెళ్లి తిరిగి వస్తుండగా కర్ణాటక రాష్ట్రం బళ్లారి డిపోకు చెందిన కేఏ 34 ఎఫ్ 1403 నంబర్ గల కేఎస్‌ఆర్‌టీసీ బస్సు ఢీ కొట్టుకున్నాయి. దీంతో మోటారు బైక్‌పై ఉన్న జస్వంత్‌కు తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దోర్నాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. రహదారులపై అతి వేగం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. రక్తపు మడుగులో విద్యార్థి పడిపోవడం చూసి చూపరులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ రహదారిలో తరచుగా జరిగే రోడ్డు ప్రమాదాలు కేవలం అతి వేగం వలన జరుగుతున్నట్లు తెలుస్తుంది. ప్రాణం కంటే వేగం ముఖ్యమా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిరపరాదుల ప్రాణాలు బలి తీసుకుంటున్న ఈ రహదారి ప్రమాదాలు ఆగాలంటే డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. రహదారులపై జాగ్రత్తే జీవ రక్షకం.

## శ్రీ దేవి శరన్నవరాత్రుల 13వ వార్షికోత్సవం



**చీరాల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
పర్చూరు మండలం సంతనూతలపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి దేవస్థాన ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారి అలంకరణ మహా చండీ దేవి అవతారం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగమ్మగుంట సుబ్రహ్మణ్యం శ్యామ్ మాధవి దంపతులు, శివ సీతారాం రేష్మ అమ్మవారికి లడ్డు ప్రసాదం సమర్పించిన వారు కొర్రాకుపూర్ యశోద కపూర్ దంపతులు రాత్రి 8గంటలకు శ్రీ సీత రామ భక్త సమాజం నాదెండ్ల వారిచే ఆర్గనైజర్ దేవభక్తుని కోటమ్మ సంకీర్తన కార్యక్రమం అనంతరం ప్రసాదాల వితరణ జరుగుతుంది. ఆర్గనైజర్స్ ఆదిపూడి మోహన్‌కృష్ణ, వల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగమగుంట సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వల్లూరమ్మ తల్లి పొంగళ్ళు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మాదాసి వెంకయ్య



**టంగుటూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
మండలంలోని వల్లూరమ్మ దేవస్థానం నందు ఉప్పలపాడు గ్రామ నాయకులు నవీన్ రెడ్డి ఆహ్వానంతో వల్లూరమ్మ తల్లి పొంగళ్ళు కార్యక్రమం లో వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. అమ్మవారి మొక్కుబడి, పొంగళ్ళు కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్యతో కలిసి పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### కంభాలపాడు అంకాలమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల ఉత్సవాలు

#### - అన్న ప్రసాద సెంటర్ ప్రారంభం



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
పొదిలి కంభాలపాడు అంకాలమ్మ దేవస్థానంలో దసరా నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగు తున్నాయి. మహాచండీ అమ్మవారి అలంకరణ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఆభరణాలతో పుష్పాలతో అలంకరించిన అమ్మవారిని చూసి భక్తులు మంత్రముగ్ధులయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తజనసందోహంతో కళకళలాడింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దేవస్థానంలో అన్న ప్రసాద సెంటర్ దేవస్థాన చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, బెల్లంకొండ శ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. దేవస్థానం అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్ధం అన్న ప్రసాదం అందుబాటులో ఉంచుతామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి నవరాత్రి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నాయన్నారు. ఈ వేడుకల్లో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కటాక్షం పొందారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయలక్ష్మి అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగల్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈవో జి.వాసుబాబు, ఆర్‌ఏ కాటూరి ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

6_6.qxd 9/29/2025 12:55 AM Page 1



## గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### - కొత్తగా ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులకు మంత్రి స్వామి శుభాకాంక్షలు



**సింగరాయకొండ,సెప్టెంబర్ 28,(ప్రభాతవార్త)**
గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. 2025 మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు పొందిన అభ్యర్థులు ఆదివారం టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయస్సులోనే ఉద్యోగావకాశం పొందిన అదృష్టాన్ని సమాజ సేవకు వినియోగించాలని ఆయన కొత్త ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా రంగాన్ని ఆధునిక దిశగా ముందుకు నడిపించడం తమ బాధ్యతగా భావించాలని అన్నారు. ఈ సందర్భంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆదిబోయిన రాంబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ అవిర్భావం నుంచి ఇప్పటివరకు రెండు లక్షలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు డీఎస్సీ ద్వారా జరిగినాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ప్రతి ఏడాది పోస్టులు భర్తీ చేస్తూ శాఖను బలోపేతం చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అంబటి బ్రహ్మయ్య, జిల్లా ఎంఎల్ఎస్ కోఆర్డినేటర్ మసనం జాలరత్నం, ఉపాధ్యాయులు మసనం మాలిరావు, నక్కా శ్రీనివాసులు, పొమర్తి ప్రదీప్, గుంటూరు సౌజన్య, షేక్ సుల్తాన్ బాబు, సదానంద్, డోలా హరిబాబు, ఆలా రామకృష్ణ, కరేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 100 సంవత్సరాల జయంతి వేడుకలు





**దొనకొండ,సెప్టెంబర్ 28,(ప్రభాతవార్త)**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభించి నేటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రకాశం జిల్లా దొనకొండ మండలంలో ఆనందాశ్రమంలో ఆరెస్సెస్ విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథి శ్రీ శ్రీ శ్రీ భైరవానంద స్వామి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ విజయదశమి శత ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. . ముఖ్య వక్త శ్రీ కొల్ల రామకృష్ణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ నర్సరావుపేట మాట్లాడుతూ ఆరెస్సెస్ 1925 విజయదశమి రోజున ప్రారంభించి నేటి విజయదశమికి వంద సంవత్సరాల వార్షికోత్సవం చేసుకుంటున్నందుకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశి మాట్లాడుతూ ఈ భూమి మీద హిందూ ధర్మం సనాతనమని ఎప్పుడు పుట్టిందో తెలియదని, మన పురాణాలు, ఇతిహాసాలు, గ్రంథాలు మనకు ఎలా జీవించాలో, ఎలా ఉండాలో తెలియజేశాయని చెప్పారు. గడప లోపలే కులం, గడప దాటితే హిందువులం, మనం అందరం కలిసిమెలిసి ఉండాలని, శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడికి లేని కులవివక్షత మనకు ఎందుకు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవాహ కోలగట్ల వెంకటేశ్వర రెడ్డి , పొదిలి ఖండ కార్యవాహ వెంకట్రామ రెడ్డి , 7 గ్రామాల నుండి 75 మంది స్వయంసేవకులు, 15 మంది మాతృమూర్తులు , ఇతర సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రులలో శక్తిపీఠాల ఆరాధన మోక్షానికి మార్గము





**ఒంగోలుకల్చరల్,సెప్టెంబర్ 28,(ప్రభాతవార్త)**
ఆధ్యాత్మిక ఉపన్యాసకులు , బ్రహ్మశ్రీ పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు.మంత్రిప్రగడ నరసింహారావు స్మృత్యర్థం కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన త్రయాహ్నిక ఉపన్యాస యజ్ఞంలో మొదటి రోజు అష్టాదశ శక్తి పీఠాలపై ప్రసంగించారు. దక్షయజ్ఞంలో యోగాగ్ని ద్వారా తన శరీరాన్ని సతీదేవి భస్మం చేయగా ఆ శరీరాన్ని విష్ణుమూర్తి తన సుదర్శన చక్రం ద్వారా ఖండించగా అమ్మవారి శరీర భాగాలు 18 చోట్ల పడ్డాయని అవే అష్టాదశ శక్తి పీఠాలుగా అవిర్భవించాయన్నారు. కాశీకా పురాణంలోని జగద్గురు ఆదిశంకరులు రచించిన అష్టాదశ శక్తిపీఠ స్తోత్రాన్ని ఆధారంగా చేసుకుని శక్తి పీఠాల వైశిష్ట్యాన్ని తన ప్రసంగం ద్వారా వివరించారు. శక్తి పీఠాల ఆరాధన, ఉపాసన వలన కలిగే కలిగే ఫలశ్రుతిని వివరించారు. దేవస్థానం ఈవో రావెళ్ల శివశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మంత్రిప్రగడ ప్రసాద్, ప్రకాశంజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, అన్నమయ్య సంగీత సేవా సమితి అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య, ఓ.ప్రసాద్, ముప్పా నాగేశ్వరరావు, ఆకుల శ్రీను, సిరిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలకోటయ్య తల్లి మృతికి నివాళులర్పించిన జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి



**వెలిగండ్ల, సెప్టెంబర్ 28, (ప్రభాతవార్త)**
పి.రాళ్లపల్లి మండలంలోని పి.రాళ్లపల్లికి చెందిన మండల బీసీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పిన్నిక బాలకోటయ్య తల్లి ఆదివారం ఉదయం అకస్మికంగా మరణించటం జరిగింది. స్థానిక టీడీపీ నాయకులు ద్వారా విషయం తెలియడంతో జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి వారి స్వగ్రామం వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, హెచ్‌ఎంపాడు మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గువ్వల హరికృష్ణ, మాజీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గువ్వల పెద్ద మాలకొండయ్య, చిన్న మాలకొండయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ మీనిగ కాశయ్య, బూత్ ఇన్‌చార్జి కొప్పుల గురవయ్య, కడెం లక్ష్మయ్య, ఇంకా పలువురు టీడీపీ నాయకులు బాలకోటయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఘనంగా భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలు



**యర్రగొండపాలెం,సెప్టెంబర్28,(ప్రభాతవార్త)**
త్యాగానికి,ధైర్యానికి ప్రతీక భగత్ సింగ్ అని సిపిఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య,నియోజకవర్గ కార్యదర్శి బాజాల రామయ్య అన్నారు.ఆదివారం యర్రగొండపాలెం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలిట సింహ స్వప్నం అసమానతలపై ఎగిసిపడ్డ విప్లవ పతాకం ఆనాడు ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తు దేశ స్వాతంత్ర్యంకోసం తెల్లదొరలపై భగత్ సింగ్ ప్రభుత్వలసేసిన తిరుగుబాటు యావత్ దేశాన్ని ఆకర్షించిందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి కృష్ణగౌడ్,మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు



**యర్రగొండపాలెం,సెప్టెంబర్28,(ప్రభాతవార్త)**
య ర్రగొండపాలెం పట్టణంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు,యం.మంత్రునాయక్,చిట్యాల వెంగళ్‌రెడ్డి,వేగినాటి శ్రీను,కామేపు నాయకులు పాల్గొన్నారు.అనంతరం కొప్పుకొండ వెంకటేశ్వర స్వామి గుడిలో దసరా నవరాత్రుల సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గ్రంధాలయంలో గుర్రం జాషువా జయంతి వేడుక



**సంతమాగులూరు, సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**
సంతమాగులూరు శాఖ గ్రంధాలయంలో ఆదివారం నాడు ప్రముఖ రచయిత, సంఘసంస్కర్త స్వర్గీయ గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రందాలయ పాలకుడు బాదం విజయ భాస్కరరెడ్డి స్థానిక పెద్దలు పూలమాల చేసి నివాళి అర్పించారు.అనంతరం చదవటం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గా పదవీ ప్రమాణ స్వీకారం



**సంతమాగులూరు, సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బత్తుల రామకోటయ్య మరియు రామకోటయ్య జన్మ స్థలం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామస్తులు శింబోతుల వీరయ్య ,నంబుల ఏడుకొండలు , ఆవుల కోటేశ్వరరావు, నంబుల వేమలరాజు పాల్గొన్నారు.

## డిజిటల్ బుక్‌లో సంక్షిప్తం



**సంతమాగులూరు, సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధ్యక్షులు వై యస్ జగన్మోహనరెడ్డి కార్యకర్తలపై అధికార కూటమి నాయకులు, అధికారం అండతో అధికారులు పెడుతున్న ఇబ్బందుల ను నేరుగా పార్టీ డిజిటల్ బుక్ లో సంక్షిప్తం చేసేందుకు రూపొందించిన డిజిటల్ బుక్ ను అద్దంకి నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పిడుగురాళ్ళలోని అశోక్‌కుమార్ కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ నాయకులులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మండల నాయకులు గడ్డం నర్సిరెడ్డి, ధర్మ తేజరెడ్డి ,వెల్లలచెరువు కేసరి చెన్నారెడ్డి, బాపట్ల ఎస్సీ సెల్ కార్యదర్శి పోకూరి వెంకయ్య , షేక్ ఖాదర్ బాషా , సజ్జాపురం నుండి ఇంజం రామాంజనేయ రెడ్డి,గురిజేపల్లికి చెందిన పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాణి రాజు తదితరులు పాల్గొన్నారు.

## నీతి నిజాయితీ సందేశానికి నిలువెత్తు సాక్ష్యం గుర్రం జాషువా కవిత్వం - కాకాని సుధాకర్



**సంతమాగులూరు, సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**
నీతి నిజాయితీ సందేశానికి నిలువెత్తు సాక్ష్యం గుర్రం జాషువా కవిత్వం అని, అదే విధంగా భారత స్వాతంత్ర పోరాటంలో ప్రాణ త్యాగం రోజున కూడా ఉరి కంభంపైనుండి కూడా క్షమాబిక్ష కోరకుండా విప్లవ సందేశం ఇచ్చున మహావిప్లవ వీరుడు భగత్ సింగ్ అని ప్రముఖ కవి పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కాకాని సుధాకర్ అన్నారు. నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా131వ,భగత్ సింగ్ 118వ జయంతి కార్యక్రమం ఆదివారం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన సంతమాగులూరు లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న సమావేశపు మందిరంలో జాషువా, భగత్ సింగ్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుర్రం జాషువా తెలుగు సాహిత్యంలో ఒక దిగ్గజ కవి. తన అపారమైన జ్ఞానంతో మరియు తాను ఎదుర్కొన్న కులం ఆధారిత వివక్ష వల్ల కలిగిన పోరాటం ద్వారా, ఆయన తన కవిత్వాన్ని సార్వజనీన దృక్పథంతో రాశారని అన్నారు ముందుగా గుర్రం జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కాకాని సుధాకర్ మాట్లాడుతూ కవి చక్రవర్తి గుర్రం జాషువా సెప్టెంబరు 28, 1895 లో పల్నాడు జిల్లాలోని వినుకొండ లో జన్మించారన్నారు. ముఖ్యంగా తన 'గబ్బిలం' కావ్యంలో వివక్షకు గురైన ఒక వ్యక్తి తన బాధను గబ్బిలం ద్వారా కాశీలోని శివుడికి మొరపెట్టుకునే వైనాన్ని అద్భుతంగా చిత్రీకరించారన్నారు .ఆయన కవిత్వం సామాజిక స్పృహ, మానవత్వం మరియు దేశభక్తిని ప్రతిబింపజెస్తుందన్నారు . జాషువా రచించిన ప్రధాన రచనలు ఫిరదౌసి, గబ్బిలం, క్రీస్తు చరిత్ర వంటివి ఆయన ముఖ్యమైన రచనల్లో కొన్ని భాగలైనయని అన్నారు. అంతేకాకుండా ఆయనకు పద్మభూషణ్ మరియు సాహిత్య అకాడమీ అవార్డు వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయని తెలిపారు.చివరి రోజులలో గుంటూరులో గడిపిన గుర్రం జాషువా జూలై 24, 1971 వ సంవత్సరంలో తుది శ్వాస విడిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్, మాజీ ఎంపీపీ సన్నె బోయిన ఏడుకొండలు, మండల విద్యాశాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు సన్న బోయిన గురుబ్రహ్మం, కే ఎన్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసరావు, బీసీ సంఘం నాయకులు బండారు పుల్లారావు, సర్పంచి పుచ్చకాయల నాగేశ్వరరావు, ఆదర్శ మల్టీ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు అంగలకుదిటి కోటేశ్వరరావు, కార్యదర్శి నాగూర్ వలి, సీనియర్ జర్నలిస్ట్ బలుపు నూరి కృష్ణారెడ్డి, షేక్ ఖాదర్ మస్తాన్, మహిళా మండలి నాయకురాలు లక్ష్మి ్మ శేషు, ధూపాటి ఏసేపు, గద్దల రాజు, ఉపాధ్యాయులు అమృత పూడి శేఖర్ బాబు, లక్కె పోగు నరేంద్ర కుమార్, వలీ ఖాన్ షేక్ ముస్తఫా, మసనం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్,గుర్రం జాషువా జయంతి వేడుక




**సంతమాగులూరు, సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**
సీపీఐ ఆద్వర్యంలో భగత్ సింగ్,గుర్రం జాషువా జయంతివేడుక ఆదివారం నిర్వహించారు. భగత్ సింగ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా పూల దండలు వేసి నా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితి కార్యదర్శి షేక్ ఖాదర్బాషా మల్లెల ఏసోబు భూదాల వీరయ్య ఎలమందయ్యా షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## పలువురు ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం



**మార్కాపురం,సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
బీఎస్సీ నియామకంలో, పోలీస్ రిక్రూట్మెంట్‌లో ఉద్యోగాల సాధించిన పలువురికి ఆత్మీయ సత్కారం జరిగింది. మార్కాపురం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన బ్రాహ్మణ విజేతలకు ఘన సత్కారం జరిగింది.డీఎస్సీ లో ఉద్యోగాలు సాధించిన బొడ్డుపల్లి జ్యోతి, స్కూల్ అసిస్టెంట్ నెల్లూరు జిల్లా, కర్నూలు జిల్లాకు చెందిన గోపాలుని రాజరాజేశ్వరికి ఎస్జిటి కి, త్రిపురారి భట్ల సౌమ్యశ్రీ,పోలీస్ ఉద్యోగం సాధించిన కుంచాల రాజేష్ కు ఘన సత్కారం జరిగింది. లక్ష ్యసాధన దిశగా వారి చేసిన కృషిని పలువురు కొనియాడారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని నిరుద్యోగ యువతీ యువతకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలుని హరిహర రావు, భరతుల శ్రీనివాస్ శాస్త్రి, కమలపురి శ్రీనివాసరావు ( హాట్ చిప్స్ ) సోమయాజుల సుభాశాస్త్రి బ్రదర్స్ బద్వేటి రమణారావు ,దూళిపాల మధు, వాలిచర్ల శేష సాయి, బొడ్డుపల్లి గోపాలకృష్ణ, మార్కాపురం పట్టణ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**మార్కాపురం ప్రభాతవార్త**
సెప్టెంబర్ 28దసరా నవరాత్రులను పురస్కరించుకొని మార్కాపూర్ పట్టణ సమీపంలోని శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం పూజలు నిర్వహించారు. శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు వేకువజామున అమ్మవారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకము నిర్వహించి వివిధ రకాల పూల మాలలతో అమ్మవారిని శోభాయి మానంగా అలంకరించారు ఈ రోజు ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుటకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది వెన్న శ్రీధర్ రెడ్డి, పొదిలి రంగనాయకులు పర్యవేక్షి ంచారు

## సామూహిక కుంకుమార్చ



**మార్కాపురం, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
విశ్వ హిందూ పరిషత్ దుర్గా వాహిని ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా దుర్గా వాహిని సంయోజక అపర్ణ గారి కృషితో సామూహిక కుంకుమార్చన, ఆయుధ పూజ,కుటుంబ ప్రభోధన్ , మహిళా ఆత్మ విశ్వాసం ధైర్యం, నిషా నివారణ గురించి తెలియజేయడం జరిగింది .



ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా దుర్గా వాహిని సంయోజక అపర్ణ,సహ సంయోజకప్రసన్న, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు కుమారి అనూష, సబిత, దుర్గ,హిందూ బంధువులు పాల్గొన్నారు.

## మహాచండీ దేవిగా అలరించిన అమ్మవారు





**బల్లికురవ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులను అలరించారు. మండలంలోని బల్లికురవ, కొత్తపాలెం, కొండాయపాలెం, గొర్రెపాడు, వి.కొప్పెరపాడు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణి ముహూర్త సమయంలో పంచామృతాభిషేకాల అనంతరం అమ్మవారిని సువర్ణ శోభిత అలంకరణలో కనువిందు చేశారు. అనంతరం వేద పండితులకు సుధీర్ శర్మ మాట్లాడుతూ అసుర గణాలు దేవతలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న సమయంలో ముక్కోటి దేవతలు శరణు వేడినప్పుడు, ముగ్గురు, మూర్తులు నివే దిక్కు అని ప్రార్థించినప్పుడు, ముల్లోకాల రక్షణ కోసం ముగ్గురమ్మల మూలపుటమ్మ సింహ వాహనం మీద అసుర సంహారానికి బయలుదేరిందని అన్నారు. వేల సైన్యాల అసురుల్ని ఒక్క దెబ్బతో నేలకూలుస్తూ దేవతలకు నేనున్నానంటూ అభయహస్తం అందించిన చల్లని తల్లి చండీ దేవి అన్నారు. దుర్గముడు అనే రాక్షసుడిని సంహరించి దేవతలను, మహర్షులను, ప్రకృతి శక్తులను, బంధ విముక్తులను చేసిన ఘనత చండీ దేవిది అని వివరించారు. సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

## పార్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



**యర్రగొండపాలెం,సెప్టెంబర్28,ప్రభాతవార్త**
దసరా నవరాత్రులలో భాగంగా యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు పార్వతిదేవి అలంకరణతో ఆదివారం అమ్మవారు భక్తులను కనువిందు చేశారు. శరన్నవరాత్రులలో భాగంగా దేవాలయంలో ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పూజారి రెంటచింతల శ్రీరామచంద్రమూర్తి నేతృత్వంలో ఉదయం సాయంత్రం అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి పూజలు జరుపుతున్నారు. ఈ పూజలలో భక్తులు దంపత సమేతంగా ఉదయం సాయంత్రం పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు. ఆలయ కమిటీ నిర్వహకులు భక్తులకు ప్రత్యేకఏర్పాటు చేశారు. అధ్యక్షులుకొత్తమాసుఆనంత వెంకట సుబ్రమణ్యం,ప్రధాన కార్యదర్శి చీదేళ్ళ సుబ్రమణ్యం,కోశాధికారి చలువాది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహా చండీ దేవిగా అమ్మవారి అలంకరణ



**సంతమాగూరు సెప్టెంబరు 28 ప్రభాతవార్త,**
దసరా నవరాత్రులలో భాగంగా ఆరవ రోజైన ఆదివారం గ్రామాలలో నవరాత్రుల వేడుకలకై ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్ళలలో అమ్మవారిని మహా చండీ దేవిగా అలంకరిచి భక్తులకు కనువిందుగా అమ్మవారి దర్శనం లభించింది. మండల కేంద్రమైన సంతమాగులూరు శివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నవరాత్రుల వేడుకల్లో అమ్మవారినిమహా చండీదేవిగా చేసిన అలంకరణ భక్తులనుఆకట్టుకుంది. సంతమాగులూరు ఆర్యవైశ్యసంఘంతో పాటు గ్రామస్తులందరూ ఐఖ్యంగా ఈవేడుక నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటి తెలిపింది.

## ఇరువురు బైక్ దొంగలు అరెస్ట్ - ఒక బైకు స్వాధీనం



**మార్కాపురం,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త**
ఇరువురు బైక్ దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక బైక్ ను మార్కాపురం పోలీసులు స్వాధీనం. మార్కాపురం పట్టణంలో ఇంటి ముందు పార్కు చేసిన మోటార్ సైకిల్ ను దొంగలించారు. మార్కాపురం సిఐ సుబ్బారావు నేతృత్వంలో పోలీసులు అనుమానంగా తిరుగుతున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తే బైకు దొంగతనాలు బయటపడ్డాయి. వారి వద్ద నుంచి ఒక బైకును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి మార్కాపురం కోర్టులో హాజరు పరిచారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపడమే కాకుండా దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పట్టణంలో ప్రత్యేక పోలీసు బృందం రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనుమానిత వ్యక్తులనుఅదుపులోకి తీసుకొని విచారించి పంపించి వేస్తున్నామన్నామని సిఐ సుబ్బారావు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యేచే గోశాల నిర్మాణానికి శంకుస్థాపన

**మార్కాపురం,సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**
శ్రీ లక్ష్మి ్మ చెన్నకేశవ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నేడు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. గోశాల నిర్మాణానికి భూమి పూజ మహోత్సవం చేయనున్నారు. మార్కాపురం పట్టణ శివారులోని కొండేపల్లె రోడ్ లోకందుల నారాయణ చేతుల మీదుగా ఉదయం 9 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి ్మ చెన్నకేశవ స్వామి వారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా శ్రీ లక్ష్మీ ్మ చెన్నకేశవ స్వామి గోశాల నిర్మాణ కమిటీ పిలుపు నిచ్చింది..

## భూగర్భ గనుల శాఖలో విష్ణువర్ధన్ రావు విశిష్ట సేవలు

### - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త**
భూగర్భ గనుల శాఖలో ఏడిఏ విష్ణువర్ధన్ రావు విశిష్ట అందించారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కొనియాడారు. మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్ లో ఏడిఏ విష్ణువర్ధన్ రావు పదవి విరమణ అభినందన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భూగర్భ గనుల శాఖలో సుదీర్ఘంగా కాలంగా పనిచేసి మన్ననలను పొందారున్నారు. విష్ణువర్ధన్ రావు జీవనం ప్రశాంతంగా గడపాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం విష్ణువర్ధన్ రావు ను దృశ్యాలతో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో భూగర్భ గనుల శాఖ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాషువా జయంతి వేడుకలు



**మార్కాపురం ,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త**
ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలు మార్కాపురం పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీసీ భవన్ లో న్యాయవాది, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నికి లక్ష ్యం ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.జాషువా చిత్రపటానికిపూలమాలవేసి ఘన నివాళులర్పించారు. జాషువా సేవలను పలువురు కొనియాడారు . ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ,నాయి బ్రాహ్మణ వంకేశ్వరం శ్రీనివాస్, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్. పురుషోత్తం, సూర్య బలిజ సంఘం, కాటమరాజు దేవస్థాన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుమ్మా గంగరాజు యాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నక్క శ్రీనివాస్ యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్ , ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్ , కాటంరాజు గుడి జాయింట్ సెక్రెటరీబోరి గొర్ల గాలయ్య యాదవ్ , ఉపాధ్యక్షులు నాగం వెంకటేష్ యాదవ్ , కాటంరాజు దేవస్థాన కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి తోకల ఎల్లయ్య యాదవ్ పాల్గొన్నారు..

## మార్తాల వారి ఓణిల వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా



**బేస్తవారిపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గంలోని బెస్తవారిపేట మండలం పందిళ్ళపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీ ్మపురం గ్రామంలో మార్తాల బ్రహ్మానందరెడ్డి, దివ్య, మార్తాల ఈశ్వర్ రెడ్డి, సువర్ణల కుమార్తెల ఓణీల వేడుకలో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం వైఎస్సార్సీపి ఇన్చార్జి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజి శాసనసభ్యులు అన్నా రాంబాబుకు మార్తాల బ్రహ్మానందరెడ్డి కుటుంబ సభ్యులు సాదారంగా ఆహ్వానం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బ్రహ్మానందరెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## తురిమెళ్ళలో శ్రీగంధం చెట్లు చోరీపై కేసు నమోదు

**కంభం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త**
మండలంలోని తురిమెళ్ళ గ్రామంలో శ్రీగంధం చెట్లు చోరీ చేసిన ఘటనపై బాధితుడు బెల్లంకొండ నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కంభం ఎస్సై నరసింహారావు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బెల్లంకొండ నాయుడు తోటలో గుర్తు తెలియని వ్యక్తులు ఆరు శ్రీగంధం చెట్లను నరికి దొంగిలించారని తెలిపారు. దొంగతనానికి గురైన ఆరు చెట్ల విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

7_7.qxd 9/29/2025 12:55 AM Page 1



## ఆర్‌డిఎస్‌ఎస్ పనుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**రాచర్ల, సెప్టెంబర్ 28 ,ప్రభాతవార్త**

ఆర్‌డిఎస్‌ఎస్ (రివ్యాంపుడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పనుల కారణంగా నేడు (సోమవారం) మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్‌ఎస్ పనుల దృష్ట్యా మండలంలోని జేపీ చెరువు, చిన్నగానిపల్లి ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఆ గ్రామాల పరిధిలో 11 కెవి ఫీడర్లకు సంబంధించి ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 33/11 ఆకవీడు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం 9 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు, ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**రాచర్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ఓటర్ల జాబితా అవకతవకలపై రాహుల్ గాంధీ చేపట్టే పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జ్ పగడాల రంగస్వామి ఆదివారం రాచర్ల మండలంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పగడాల రంగస్వామి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి ప్రజల ఓట్లను దొంగిలించి మూడోసారి గద్దెనెక్కిందని ప్రజాస్వామ్యబద్ధంగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడలేదని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ఓటు హక్కు వినియోగించుకోకుండా ఓట్లు దొంగిలించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని కోల్పోయిన బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఓట్లు దొంగిలించిన బిజెపి ప్రభుత్వంపై పూర్తి ఆధారాలతో ఎన్నికల కమిషన్ కు తెలియజేసేందుకు దేశవ్యాప్త పోరాటం సాగిస్తున్నారని దానికి మద్దతుగా సంతకాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ సంబంధిత అధికారులను తమ చేతుల్లో పెట్టుకొని రాజ్యాంగ విరుద్ధంగా ఓట్ల చోరీకి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. సంతకాల సేకరణకు, రాహుల్ గాంధీ పోరాటానికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు.

## నేడు మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

### - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని పవిత్ర ఫంక్షన్ హాల్ నందు నేడు అనగా సోమవారం ఉదయం 10గంటలకు మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొంటారని కావున ఏవైనా భూ సమస్యలు ఉంటే మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలి

### - జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈనెల 30వ తేదీ లోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. దర్శి సహాయక వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్, మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావులతో కలిసి కొనకనమిట్లలో నమోదు చేసిన ఈ పంటను, పొగ నారుమళ్ళకు సిద్ధం చేస్తున్న భూమిని పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైట్ బర్లీ, ఎఫ్‌సీవీ పండించే పొగాకు రైతులు ఖచ్చితంగా పొగాకు బోర్డు అనుమతులు తీసుకోవాలని ముఖ్యంగా బాండు రూపంలో తీసుకొని మాత్రమే సాగు చేయాలని కోరారు. ఎక్కడైనా పండించినట్లయితే వాళ్ల మీద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బ్లాక్ బర్లీ ఎక్కడైనా నర్సరీ సాగు చేస్తుంటే తక్షణమే మీ వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ త్వరగా ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని సూచించారు.

## ఘనంగా గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలు



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పొదిలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా జయంతి, అమవీరుడు శహీద్ భగత్‌సింగ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవకులు, సంఘ ప్రతినిధులు హాజరై మహానుభావులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మానవతా ఛైర్మన్ శ్రావణి వెంకటేశ్వర్లు, గౌరవ ఛైర్మన్ ముప్పల పార్థసారధి, జిల్లా అధ్యక్షులు కే.యలమందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, డైరెక్టర్లు మామిడి వెంకటేశ్వర్లు, ఎం.కరిముల్లా బేగ్, మాజీ ఎంపీపీ వెలిశెట్టి బెల్లంకొండ విజయలక్ష్మి, బి.శ్రీనివాసరెడ్డి, ఆప్(టీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతినిధులు మాట్లాడుతూ గుర్రం జాషువా తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలపై గళమెత్తి, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేసుకున్నారు. భగత్‌సింగ్ తన ప్రాణాలను అర్పించి భారత స్వాతంత్య్ర పోరాటానికి నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. ప్రత్యేకంగా మాట్లాడిన బెల్లంకొండ విజయలక్ష్మి గుర్రం జాషువా సాహిత్యం సమాజంలో వెలుగునిచ్చిందని, భగత్ సింగ్ త్యాగం యువతకు శాశ్వత స్ఫూర్తిగా నిలిచిందని వారి సేవలను కొనియాడారు. మహనీయులను స్మరించుకోవడం యువతకు స్ఫూర్తినిచ్చే పని అని, వారి త్యాగాలను ఆలోచనలను ఎప్పటికీ మార్గదర్శకాలు అవుతాయని పాల్గొన్నవారు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

## వైసిపి ఇన్‌చార్జిని కలిసిన జెసిఎస్ కన్వీనర్లు



**అద్దంకి ,సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌ను జెసిఎస్ మండల కన్వీనర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అశోక్‌కుమార్‌ను కలిసిన వారిలో అద్దంకి మండలం జెసిఎస్ కన్వీనర్ జష్ఠి వెంకటరావు,బల్లికురవ మండల జెసిఎస్ కన్వీనర్ బి నరేష్, అద్దంకి టౌన్ జెసిఎస్ కన్వీనర్ పూనూరి చైతన్య కిషోర్, కొరిశపాడు మండల జెసిఎస్ కన్వీనర్ మామిళ్లపల్లి వేణు ఉన్నారు. ఈ సందర్భంగా వారు అశోక్ కుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎజెపి బిఆర్‌కె కుటుంబ సభ్యులు



**అద్దంకి , సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎజెపి గా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్‌ను బిఆర్‌కె కుటుంబసభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మంత్రికి బొకేతోపాటు మోమెంటో అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఇలా వుండగా మంత్రి బత్తుల రామకోటయ్యకు శాలువ కప్పి అభినందించారు. ఎజెపి వెంట ఆయన కుటుంబ సభ్యులు భార్య విజయదుర్గ, కుమారుడు వంశీకృష్ణ, బంధుమిత్రులు శింగోటం వీరయ్య, నంబుల ఏడుకొండలు, ఆవుల కోటేశ్వరరావు, నంబుల వేమలరాజు తదితరులు వున్నారు.

## జాషువా సమాజములోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు



**అద్దంకి , సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**

కమఠేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మరాజు శ్రీనివాసరావు అధ్యక్షతన సృజన సాహిత్య సమాఖ్య ఆదివారం సాయంత్రం జరిగింది. నిమ్మరాజు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. మహా కవి జాషువా రచనలు సమాజానికి,సమాజములోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి తోడ్పడ తాయని, జాషువా గబ్బిలం మహాకావ్యమును మరో కావ్యంగానే జాషువా గబ్బిలం కావ్యంతో సాటిరావని అనిల్‌కుమార్ సూరి అన్నారు.సమాజాన్ని, అట్టడుగు వర్గాలని జాషువా పట్టించుకొంతగా మరే కవి తెలుగు సాహిత్యంలో పట్టించుకోలేదని కె.అనిల్ కుమార్ సూరి పేర్కొన్నారు. గురజాడ వారు తెలుగు భాష కు చేసిన సాహిత్య సేవ గురించి తెలియజేసారు. ఆర్ రాఘవ రెడ్డి, గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాష కు గారి వ్యవహారిక భాషోద్యమం గురించి తెలియజేసారు. సభాధ్యక్షులు లక్ష్మరాజు శ్రీనివాసరావు భస్మా సుర ఏకపాత్ర పోషించిన వర్యం సీతారామశాస్త్రి నట విశారద బిరుదును ప్రధానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యనమంద్ర వరలక్ష్మి, ప్రస్తుతిరాజు శ్రీరామ చంద్రమూర్తి, మస్తాన్ మాస్టర్,కొల్లా భువనేశ్వరి, ఆర్ రాఘవ రెడ్డి, యోగేశ్వరరావు, కొల్లా పవన్, మాలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, పార్టీ బండ్ల శ్రీమన్నారాయణ, కే పాపారావు, కొల్లా భువనేశ్వరి, రోటరీ అధ్యక్షులు బాబిన శివధర పూర్వధ్యక్షుడు, పి ఎల్ వి నరసింహారావు, శంకర రెడ్డి, కక్కర వెంకటేశ్వర్లు,నర్రా గోపాల్, సుబ్బారావు, ఇలపావులూరికేష తల్లి సాయి, చండలూరి నారాయణ రావు,ఆర్. వి.రాఘవరావు, ఆర్టిస్ట్ బాలు, మెట్టుపల్లి రామదాసు,రంగస్వామి నటులు అలకుంట శ్రీనివాసరావు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

## ఎంఆర్ఎన్ సేవా సమితి ఆధ్వర్యంలో జార్లపాలెం గ్రామ ముఖద్వారం ప్రారంభం



**అద్దంకి , సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

బాపట్ల జిల్లా అద్దంకి మండలం జార్లపాలెం గ్రామ ముఖద్వారాన్ని ఎం.ఆర్.ఎన్ సేవాసమితి 20 లక్షల రూపాయలతో నిర్మించింది. ఈముఖ ద్వారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని సంస్థ నిర్వహించింది. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో సేవాసమితి చేపడుతున్నట్లు సేవా సమితి సభ్యులు చల్ల నాగార్జున్ రెడ్డి చెప్పారు. సేవా సమితి దిక్సూచి మూలకారకుడు ములకా కృష్ణారెడ్డి లాంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాగార్జున రెడ్డి తెలిపారు. దీనికి సహకరించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## జాషువా 130వ జయంతి కార్యక్రమం



**అద్దంకి ,సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా130 వ జయంతి సందర్భంగా పసుమర్తిపాలెంలోని గుర్రం జాషువా గారి విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం గుర్రం జాషువా సాహిత్య వేదిక తరపున సాహిత్యపరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ కుల మతాల గీచుకున్న గీతల్న పంచరాన కట్టువడను నేను, నిఖిల లోక మెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వ నరుడ నేను అని సగర్వంగా ప్రకటించుకున్న విశ్వకవి గుర్రం జాషువా అని దేవపాలను అన్నారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి కోటయ్య, గోరంట్ల నాగేశ్వర్‌రావు, బిజెపి యువ నాయకుడు జువ్వి రాము, నాటి విగ్రహ ప్రదాత తాళ్లూరు బాబురావు, నందమూరి కల పరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, రోటరీ మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ఎస్సీ ఎస్టీ రాష్ట్ర ఐక్యవేదిక స్టేట్ కన్వీనర్ జ్యోతి రమేష్, బుచ్చిబాబు, వై వెంకటేశ్వర్లు, తొట్టెంపాడు శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యా మండలి రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావును

### మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శిగా నియమితులై ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ బి.తిరుపతిరావును ఒంగోలు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి అమరావతిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు నాయకత్వంలో రాష్ట్రంలోని ఉన్నత విద్య పురోగమించాలని డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఉన్నత విద్యా రంగంలో రావాల్సిన సంస్కరణల గురించి చర్చించారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని కార్యదర్శికి వెంకటేశ్వరరెడ్డి తెలియజేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని వెంకటేశ్వరరెడ్డి కోరగా అందుకు ప్రొఫెసర్ తిరుపతిరావు అంగీకరించారు. త్వరలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నట్లు ఆయన తెలిపినట్లు పేర్కొన్నారు.

## శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా దేవి నవరాత్రి మహోత్సవ వేడుకలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని ఆవులు వారి బజార్ నందు శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా దేవీ నవరాత్రి మహోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఆరవ రోజున లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారిని తీర్చిదిద్దారు. అర్చకులు సముద్రాల సుబ్బయ్య ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ దాతలుగా చివుకుల శ్రీరాములు, శ్రీలక్ష్మి కుటుంబీకులు వ్యవహరించారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. విచ్చేసిన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని వైభవంగా ఏర్పాటు చేశారు.

## దసరా లేదా విజయదశమి హిందూ సాంప్రదాయాలలో ప్రధానమైన పండుగ

### - సత్యము ఎప్పటికీ విజయం సాధిస్తుంది

### - ధర్మము ఎప్పటికీ నిలుస్తుందనే సందేశాన్ని సూచిస్తుంది





**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

దసరా లేదా విజయదశమి హిందూ సాంప్రదాయంలో ప్రధానమైన పండుగ. ఈ పండుగ సత్యము ఎప్పటికిని విజయం సాధిస్తుంది. ధర్మం శాశ్వతంగా నిలుస్తుందని తెలియజేస్తుంది. దీని చరిత్ర ఆవిర్భావం వివిధ పురాణాలు, ఇతి హాసాలు ప్రాంతీయ సంప్రదాయాలతో అనుసంధానమై ఉంది. పురాణ గాథల ప్రకారం శ్రీరాముడు రావణుడిని విజయాన్ని సాధించిన రోజుగా, అలాగే మహిషాసుర మర్ధిని దుర్గాదేవి రాక్షసుడిని జయించిన రోజుగా దసరా పండుగకు చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని పండితులు తెలుపుతున్నారు. మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాసము అనంతరం శమీ వృక్షం వద్ద తమ ఆయుధాలను తిరిగి స్వీకరించిన సందర్భం కూడా దసరాకు సంబంధించిందేనని శాస్త్రవేత్తలు తెలుపుతారు. ఉత్తర భారతదేశంలో రామలీల ప్రదర్శనలు, దక్షిణ భారతంలో అమ్మవారిని మహా గౌరీ, మహాలక్ష్మి, సరస్వతి అలంకరణలతో భక్తులు దర్శించుకుంటారు. మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల్లో సమయం శమీ పూజలు, ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు భక్తులను అలరిస్తాయి. విజయదశమి పండుగ స్పష్టమని పండితులు తెలుపుతారు. సత్యము ఎప్పటికి విజయం సాధిస్తుంది. ధర్మము ఎప్పటికీ నిలుస్తుంది. అందుకే ఈ పండుగను దసరాగా లేదా విజయదశమి గా పిలుస్తూ తరతరాలుగా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

### రామాయణ సంబంధం :

రాముడు రాక్షస రాజు రావణుడును లంకలో జయించిన రోజు విజయదశమిగా భావిస్తారు. రాముడు ధర్మం కోసం యుద్ధము చేసి సత్యము అబద్ధంపై గెలిచిందనే గుర్తింపుగా ఈ పండుగ జరుపుకుంటారు.

### దుర్గాదేవి - మహిషాసురమర్ధిని :

దేవి మహత్యం ప్రకారం మహిషాసురుడు అనే రాక్షసుడు భూమిని దేవలోకాన్ని హింసించాడు. అప్పుడు దేవతల శక్తుల సమన్వయంతో ఆవిర్భవించిన దుర్గాదేవి తొమ్మిది రోజుల పాటు మహిషాసురమర్ధినితో యుద్ధము చేసి దశమి రోజున అతన్ని సంహరించింది. అందువలన ఇది దుర్గాదేవి దినముగా గుర్తింపబడి దుర్గా పూజ లేదా నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజుగా దసరా జరుపుకుంటారు.

### పాండవుల కథ(మహాభారతం) :

పాండవులు అజ్ఞాతవాసం ఉన్న సమయంలో తమ ఆయుధాలను శమీ వృక్షంలో దాచారు. అజ్ఞాతవాసం పూర్తయ్యాక విజయదశమి రోజున ఆ ఆయుధాలను తిరిగి స్వీకరించి విజయ సంకల్పంతో యుద్ధానికి సన్నద్ధులయ్యారు. అందువల్ల ఈ రోజున ఆయుధ పూజ సాంప్రదాయం ప్రారంభమైంది.

### పండుగ విశేషాలు :

ఉత్తర భారతదేశంలో రామలీల ముగింపు, రావణ దహనం ప్రధాన విశేషం. దక్షిణ భారతదేశంలో అమ్మవారు పూజలు(దుర్గ, లక్ష్మి, సరస్వతి) ఘనంగా చేస్తారు. మహారాష్ట్ర, కర్ణాటకలో శమీ వృక్షానికి ప్రాధాన్యత ఉంది. పూజ చేస్తారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో శ్రీ వాసవి, గౌరి, దుర్గ, దేవాలయాల్లో ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. సత్యము- అబద్ధం, ధర్మము- అధర్మం, మంచి- చెడు మధ్య యుద్ధము చివరకు మంచి గెలుస్తుందని దసరా తెలియజేస్తుంది.

## సమాజ మార్పు కోసం నిరంతర కృషి చేసిన మహనీయుడు గుర్రం జాషువా



**కనిగిరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

సమాజంలోని అసమానతలు, అంటరానితనాన్ని రూపు మాపేందుకు తన కలం ద్వారా అలుపెరగని పోరాటం చేసిన వారు పద్మశ్రీ, కవి కోకిల, కవిరత్న, గానగాంధర్వ, కవిచక్రవర్తి గుర్రం జాషువా అని దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ పేర్కొన్నారు. ఆదివారం కనిగిరిలో ఆర్అండ్‌బి బంగ్లా వద్ద ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జాషువా గబ్బిలం వంటి అనేక పద్యాల ద్వారా ప్రజలలో అసమానతలు పోయేందుకు కృషి చేశారు. రాజ్యాంగం వచ్చిన తర్వాత కూడా పాలకులు అసమానతలను పెంచిపోషిస్తున్నారు. నేటి రాజకీయ పార్టీలు కులాన్ని భుజాన వేసుకొని ఉన్నత వర్గాలను ప్రోత్సహిస్తూ, బలహీన వర్గాలను వెనక్కి నెడుతున్నాయి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు పల్లా మాలకొండరావు, భాస్కర్, కంటూ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## 7 వ రోజున అన్నదాన సత్రంలో పూజలు



**అద్దంకి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

సింగరకొండలోని వాసవీ నిత్య అన్నదాన సత్రంలో దేవీ నవరాత్రుల సందర్భంగా 7వ రోజున శనివారం శ్రీశక్తి దుర్గాదేవి అలంకారంలో, కాశి అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు పివిఎస్ నాగేశ్వరరావు దంపతులు, కొత్త రమేష్ దంపతులు, శ్రీరామ్ భరత్ కుమార్ సత్ర కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. తదుపరి ప్రసాద వినియోగము, అన్న ప్రసాద్ వితరణ జరిగింది.

## 7 వ రోజున దత్త పాదుకాక్షేత్రంలో పూజలు



**అద్దంకి ,సెప్టెంబరు 28,ప్రభాతవార్త**

స్థానిక నాగులబండ బజారులోని దత్తపాదుకాక్షేత్రం(దత్తగుడి)లో దేవి శరన్నవరాత్రిఉత్సవాలలోభాగంగా శనివారం 7వ రోజున పూజలు నిర్వహించారు. శ్రీ శక్తిదుర్గి (కాళిక) దేవిగా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనం



**అద్దంకి , సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీచక్రసహిత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 7వ రోజున ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

## ముప్పళ్ళపాడులో దసరా శరన్నవరాత్రుల సందడి

### - శ్రీ మహాచండీ దేవి అలంకరణలో శ్రీశ్రీశ్రీ బాల త్రిపుర సుందరి దేవీ అమ్మవారు భక్తులకు దర్శనం



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మండలంలోని చిన్న ముప్పళ్ళపాడు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ బాల త్రిపుర సుందరి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్దల మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నిత్యం అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దసరా శరన్నవరాత్రుల 7వ రోజు సందర్భంగా ఆదివారం శ్రీశ్రీశ్రీ బాల త్రిపుర సుందరి దేవీ అమ్మవారు భక్తులకు శ్రీ మహా చండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**కంభం, సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కంభం పట్టణంలోని శ్రీ కోటా సత్యమాంబ దేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారు 7వ రోజైన ఆదివారం శ్రీ పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆయా దేవస్థానాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

### - 35 మంది వికలాంగులకు ట్రైస్కూటీలు పంపిణీ - మెగా డిఎస్‌సి నియామక పత్రాలు అందజేత

### - రెండు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషిగా పంపిణీ - ప్రజా అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### - అధికారులకు మంత్రి ఆదేశం





**అద్దంకి , సెప్టెంబరు 28 ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా వినతులను స్వీకరించారు. వీటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను అదేశించారు. సమస్యల పరిష్కార విషయంలో అధికారులు శ్రద్దగా పనిచేయాలని, తద్వారా ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని, ఆయన సూచించారు. ఈ సందర్భంగా 35మంది వికలాంగులకు ట్రేస్కూటీలను మంత్రి ఉచితంగా పంపిణీచేశారు. అదే విధంగా మెగా డిఎస్‌సిలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఏటా కూటమి ప్రభుత్వం డిఎస్‌సి నిర్వహిస్తుందని వెల్లడించారు. అదే విధంగా విద్యుత్ ప్రమాదంలో చనిపోయన ఇద్దరు వ్యక్తులకు సంబంధించి, ఎక్స్‌గ్రేషియా మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పట్టణ ప్రజాప్రతినిధులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.






## రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**కురిచేడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ అడ్డు వచ్చిన కుక్కను ఢీకొని ద్విచక్రవాహనదారుడు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో వాహనదారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆదివారం నాడు మండల కేంద్రమైన కురిచేడు బ్రహ్మంగారి దేవాలయం సమీపంలో చోటు చేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు రాజంపల్లికి చెందిన రాచపూడి ప్రభుకిరణ్ అనే వ్యక్తి తన అన్న వివాహం నిమిత్తమై మండలంలోని అలవలపాడుకు వచ్చాడు. అలవలపాడు నుండి కురిచేడుకు బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని సమాచారం అందుకున్న 108 సిబ్బంది అంబులెన్స్‌లో దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు అతన్ని ఒంగోలుకు తరలించారు.

## యారవ రమా శ్రీనివాసులుకి ఘన సన్మానం



**పామూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పామూరు మండలంలోని ఆదివారం కంబాలదిన్నె గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులుకి టీడీపీ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబుకి గజమాలతో ఘన సన్మానం చేశారు. డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గ్రామంలో రైతుల, ప్రజా సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలని పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మాజీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, మహిళా నేతలు షేక్ షాహిర, సయ్యద్ రజియా, రమణమ్మ, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన యువకిశోరం షాహిద్ భగత్ సింగ్

### - డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య - మొక్కలు నాటిన నాయకులు



**దర్శి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడానికి ఉరికంబాన్ని ముద్దాడిన యువ కిశోరం షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు అని డీవైఎఫ్ఐ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య అన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా దర్శిలోని శివరాజ్‌నగర్ పాఠశాల నందు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శివరాజ్ నగర్ పాఠశాల నందు మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుటీఎఫ్ సీనియర్ నాయకుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశం కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ఉరికొయ్యను ఎక్కిన వ్యక్తి భగత్‌సింగ్ అని ఆయన జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు తీసుకువచ్చిన స్వతంత్రాన్ని ప్రస్తుతం ఉన్న పాలకులు దానిని మరిచి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. దేశంలో ప్రైవేటీకరణ ఎక్కువైందని పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాటాలు చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి కౌన్సిలర్ తిరుపతయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యూటీఎఫ్ సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు, డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ జెసిపాల్, షేక్ పీరా సాహెబ్, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ నారాయణరావు, కౌన్సిలర్ బత్తుల తిరుపతయ్య, పాఠశాల యూటీఎఫ్ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు కోటేశ్వరరావు పార్థివదేహానికి ఎమ్మెల్యే ఉగ్ర నివాళులు



**కనిగిరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పీసీపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు కొలనీటి కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గాయం తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్



**సింగరాయకొండ, సెప్టెంబర్ 28,ప్రభాతవార్త**

అక్రమ మట్టి తవ్వకాలపై రెవిన్యూ, పోలీస్ అధికారులు కొరడా ఝుళిపించారు.ఆదివారం సాయంత్రం మండలంలోని పాతసింగరాయకొండ ఎస్సీ కాలని సమీపంలోని మేఠం చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక జెసిబి,మూడు ట్రాక్టర్లను పోలీసు,రెవెన్యూ అధికారులు సమన్వయంతో దాడి చేసి, సంఘటన స్థలం లోని వాహనాలు ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఇటీవల చెరువులు, దేవస్థాన భూములు,ప్రభుత్వ భూములలో అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలింపు పై స్థానికుల నుండి ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు గట్టి చర్యలు చేపట్టారు.ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాహసీల్దార్ ఎన్నెటి రాజేష్ తెలిపారు.ఈ దాడులలో ఎస్ఐ బి.మహేంద్ర,గ్రామ రెవెన్యూ అధికారి సింహాద్రి, ఎస్ఐ బేగ్ పాల్గొన్నారు.

## షటిల్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రధానం



**సింగరాయకొండ, సెప్టెంబర్ 28,ప్రభాతవార్త**

దసరా సందర్భంగా ఆరోస్ జిమఖానా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఆదివారం మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నన్నెబోయిన శ్రీనివాసులు,నాగసూరి వెంకట సుబ్బారావు, గోపి, శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజేతలకు ముఖ్య అతిథుల చేతులు మీదుగా నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.5000 బీగాలా శ్రీనివాస్, టి. హనుమంతరావు; రెండో బహుమతి రూ.3000 వెంకట్రావు, సయ్యద్ జిలాని; మూడో బహుమతి రూ.2000 - రాజశేఖర్, శ్రీనివాసులు నాలుగో బహుమతి రూ.1000 - అనాలా రవీంద్ర, నాగరాజు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో తాళ్లూరి రమేష్, నాగసూరి వెంకట సుబ్బారావు, హనుమంతరావు, పల్లా గోపి, ప్రదీప్,కొల్లూరు అశోక్, మస్తాన్ వలి,పంతగాని వెంకటేశ్వర్లు, ఎల్చూరి రమేష్, షేక్ బాషా పాల్గొన్నారు.

## మోడీ పిలుపు మేరకు అందరం ఖాదీ వస్త్రాలు కొందాము

### - మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్న జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు



**ఒంగోలు - ప్రభాతవార్త**

భారతీయ జనత పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఒంగోలు కేంద్రంలోని 4వ మండలం, డివిజన్ 37,బూత్ నంబర్ 39 లో ఈ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం మీడియా తో మాట్లాడారు. జీఎస్టీ తగ్గించిన అనంతరం మొదటిసారి నిర్వహించిన మన్ కీ బాత్ అని అని అన్నారు. అక్టోబర్ 2న ప్రతి ఒక్కరు ఖాదీ వస్త్రాలు కొనాలని మోదీ పిలుపునిచ్చారు అని, దాన్ని అందరం పాటిద్దాం అని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి విజయదశమి, దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు గారు, జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు గారు, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్, 38 వ డివిజన్ కార్పొరేటర్ మలగ రమేష్, 37వ డివిజన్ సీనియర్ నాయకులు రాయిని రమేష్, బీజేపీ కార్యకర్తలు,నాయకులు, వివిధ వర్గాలకు చెందిన మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## పరుల సొమ్ము ఆశించకు : నవదిన వేడుకలు



**ఒంగోలు - ప్రభాతవార్త**

ఒంగోలు ఆదివారం రాత్రి సెయింట్ తెరెసా చర్చిలో జరుగుతున్న నవదిన వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ జాన్ పీటర్ ఈరోజు అంశం అయినటువంటి పరుల సొమ్ము ఆశించకు అనే అంశంపై మాట్లాడుతూ కష్టపడి సంపాదించుకున్న సొమ్ము ఎప్పుడైనా శాశ్వతమని పరులు సొమ్ము పాము వంటిదని అటువంటి సొమ్ము పై ఆశించి సమాజంలో చెడు వ్యక్తులుగా చెడ్డ పేరు తెచ్చుకోవడం వలన కుటుంబ పరువు పోవడంతో పాటు వ్యక్తిగతంగా చిన్న భిన్నమవుతారని అటువంటి ఆలోచనలను వదిలి దైవ భక్తితో ప్రేమతో భయభక్తులతో ఉండాలని తెలియజేశారు పూజా కార్యక్రమంలో చర్చి ఫాదర్ డిఎస్ పాల్ అసిస్టెంట్ ఫాదర్ హృదయ రాజు ఈరోజు పునీత చిన్న రేసమ్మ కొనియాడ పడుతున్న సంఘ పెద్దలు బొంతు ఆనందరావు మరియు సంఘ పెద్దలు యువతి యువకులు పాల్గొన్నారు

## మహాకవి జాషువా ఆలోచనలు భావితరాలకి మార్గదర్శకం - ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా కనిగిరి పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద గల విగ్రహానికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా రచనలు సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం దారి తీసేలా ఉంటాయని ఆయన సాహిత్యం తరతరాల ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచల రవి, కనిగిరి మండల టీడీపీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, ఉండేల శ్రీనివాస్‌రెడ్డి, పెళ్లి కిరణ్ కుమార్‌రెడ్డి, రీటా ఫయాజ్, మాజీ కౌన్సిలర్ బుల్లా బాల బాబు, గుడిపాటి ఖాదర్ రామసుబ్బారెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, పాతురు నాగ, బాదుల్లా, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మహాకవి జాషువా సేవలను స్మరించుకున్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆకుపాటి వెంకటేష్



**పామూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పామూరులోని స్థానిక నెల్లూరు రోడ్డు నందు అమరావతి టౌన్షిప్, లక్ష్మీ టవర్స్ ఆర్ఎంపీ వైద్యులు తిట్ల లక్ష్మీనారాయణ వారిచే నిర్మించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్, ఆకుపాటి మిత్ర బృందం పాల్గొన్నారు.

## స్విమ్స్ సూపర్‌స్పెషాలిటీ- స్విమ్స్ డయాబెటిక్ సెంటర్

### ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆకుపాటి వెంకటేష్



**పామూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ఒంగోలు సిటీలోని స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, స్విమ్స్ డయాబెటిక్ కేర్ సెంటర్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ చల్ల అమర్ వారితో మాట్లాడుతూ హాస్పిటల్ నందు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకోవాలని సూచించారు. అనంతరం ఆకుపాటి వెంకటేష్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువాకు వైసీపీ నాయకుల నివాళులు



**కనిగిరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఆదివారం కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు, కనిగిరిలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజు, ఎస్సీ ప్రముఖ నాయకులు కటికల వెంకటరత్నం, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి మాణిక్యరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, చింతగుంట్ల కిషోర్, పలుకూరి భాస్కర్, ద్రోణాదుల చెంచులు, షేక్ పొలిచర్ల రహీం భాష, దమ్ము వెంకటయ్య, సిగా కృష్ణారావు, చింతలపూడి చెంచులు, కంటు గురవయ్య, దాదిరెడ్డి మాలకొండయ్య, ముల్లంగి శ్రీహరిరెడ్డి, షేక్ ఖాదర్ జిలాని తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

## కనిగిరిలో రేపు మీ కోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### - ప్రజా సమస్యలు పరిష్కారానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు పర్యటన



**కనిగిరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో మీ కోసం - ప్రజా పరిష్కారం వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటలకు కనిగిరి పవిత్రి కళ్యాణ మండపంలో నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు పాల్గొని ప్రజల ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే పరిష్కార మార్గాలు సూచించనున్నారు. కనిగిరి తహసీల్దార్ ఆకుల వెంకట రవిశంకర్ ప్రజలను ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలు నమోదు చేసుకొని ప్రయోజనం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా విజ్ఞప్తుల దీనానికి ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఆకుల వెంకట రవిశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పూర్వ ఉపాధ్యాయ, విద్యార్థుల కలయిక అపురూపం

### - ఉద్యోగం, వ్యాపారం, వృత్తి రంగం ఏదైనా నీతి నిజాయితీగా ఉండాలి

### - డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్



**పామూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

స్థానిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి కళ్యాణం మండపంలో ఆదివారం 1989- 90 నుండి 1994- 95 వరకు విద్యను బోధించిన ఉపాధ్యాయుల, విద్యనభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థుల అపూర్వ కలయిక అపురూపంగా నిలిచింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన ప్రస్తుత ఒంగోలు డిప్యూటీ డీఈఓ ఏ.చంద్రమౌళీశ్వర్ దంపతులను అదే విధంగా అప్పటిలో ఉపాధ్యాయులుగా పని చేసిన బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, డి.వెంకటేశ్వర్లును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి వారి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అప్పటి ఉపాధ్యాయులు ప్రస్తుత ఒంగోలు డిప్యూటీ డీఈఓ ఏ.చంద్రమౌళీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగం, వ్యాపారం, వృత్తి, ఏదైనా నీతి నిజాయితీతో పని చేయాలన్నారు. అదే విధంగా సమాజం కోసం దేశం కోసం పాటుపడాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి మొదలు పెట్టిన పామూరు ప్రాంతాన్ని ఎప్పటికి మరువలేనన్నారు. నా శిష్యులుగా సమాజంలో మీరు నీతి నిజాయితీతో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తే అదే మీరు నాకు ఇచ్చే నిజమైన సన్మాన సత్కారం అన్నారు. అదే విధంగా నాటి ఉపాధ్యాయులు బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే పునర్జన్మ నిచ్చేది గురువులేనన్నారు. ఈ సందర్భంగా మీకు సంతోష ఉషస్సులు, జ్ఞాపకాల తలుపు తెరుద్దాం అనే కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యార్థినిలు అనుబంధం ఎప్పటికి మరువలేనిది అన్నారు. ఈ సందర్భంగా 1989 నుండి 95 వరకు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు ప్రస్తుత ఒంగోలు డిప్యూటీ డీఈఓ ఏ.చంద్రమౌళీశ్వర్ దంపతులను, అప్పటి ఉపాధ్యాయులు బొగ్గవరపు రాధాకృష్ణమూర్తిని, పచ్చిపులుసు రాధాకృష్ణమూర్తిని, డి.వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి

### పాలకమండలి, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మంత్రికి ఘనస్వాగతం





**అద్దంకి , సెప్టెంబరు 28 ,ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించి, పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం వద్ద పాలకమండలి, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నేతలు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు, మంత్రికి అమ్మవారి ఆశ్వీరచనాలతోపాటు,తీర్థ ప్రసాదాలను అందజేశారు. పాలకమండలి అధ్యక్షులుతోపాటు పాలకమండలి సభ్యులు మంత్రికి అమ్మవారి శేషవస్త్రం, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరి రామకోటేశ్వరరావు, చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, గార్లపాటి శ్రీనివాసరావుతోపాటు ఆలయ పాలకమండలి, పట్టణ ఆర్యవైశ్య సంఘ నేతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు మంత్రి వెంట వున్నారు.

## చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు



**చీమకుర్తి,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త**

శ్రీ కంచి కామాక్షిదేవి ఆలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించిన అమ్మవారు.సువాసీనులకు పూజలు నిర్వహించిన శ్రీమతి లక్ష్మి పద్మావతి చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు ఆదివారం పార్వతీ దేవి అమ్మవారు శ్రీ కంచి కామాక్షిదేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు.మాజీమంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శ్రీమతి శిద్దాలక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీ వాసవి అమ్మవారికి పాంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతల చే కుంకుమ అర్చన,అర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ సోస్త్రం,పారాయణం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రీ పార్వతీ దేవి అమ్మవారికి శ్రీ నగరేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేక పూజా శ్రీ చక్రార్చన నవావరణ పూజా,నైవేద్యం,హారతి,తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.సోమవారం ఎనిమిదవ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకారంతో పాటు భరత నాట్య ప్రదర్శన,చిన్నారుల కు సరస్వతి పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీమతి శిద్దా లక్ష్మి పద్మావతి తెలిపారు శిద్దా వెంకటేశ్వర్లు,శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా సాయి బాబా దంపతులు చలువాది బదరీ నారాయణ,కొణిజేటి సువర్ణ,గాదం శెట్టి లక్ష్మి,చలువాది మాధవి,కూరపాటి ధనలక్ష్మి,దాట్ల సువర్చల, ఏ.అరుణ,మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి యువసేన ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

### - వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తా - ముప్పవరపు సుచిత్ర





**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మండల పరిధిలోని అమ్మనబ్రోలు గ్రామంలో పశువుల ఆసుపత్రి, చిలకబడి వద్ద ఆదివారం ముప్పవపు సుచిత్ర వీరయ్య చౌదరి యువసేన ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాలను విజయవాడ హెల్ప్ హాస్పిటల్, శంకర కంటి ఆసుపత్రి, పెద్ద కాకాని వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో స్వర్గీయ ముప్పవరపు వీరయ్య చౌదరి పేదలకు విద్య, వైద్యం అందించాలని ఎప్పుడు పరితపించే వారని వారి ఆశయాలను అన్ని విదాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని సుచిత్ర తెలిపారు. మండల పరిధిలోని నాగులుప్పలపాడు, మాచవరం, రాపర్ల, చవటపాలెం, అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, కనపర్తి తదితర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హెల్ప్ హాస్పిటల్ డాక్టర్ నాగకిరణ్, వారి వైద్య బృందం వారు 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 80 మందికి మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం హెల్ప్ హాస్పిటల్ నందు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమయ్యే మందులను అందజేయడం జరుగుతుందన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో 435 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 130 మందికి ఆపరేషన్లు అవసరమని వాటిని తమ హాస్పిటల్ నందు పూర్తిగా ఉచితంగా నిర్వహించి తిరిగి వారిని స్వగ్రామానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, సంతనూతలపాడు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఈదర వెంకట కృష్ణారావు(నాని), మండల పరిధిలోని ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నాయకులు పార్టీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో వీరయ్య చౌదరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలు పెంపకం దారులకు రుణాలు ఇవ్వాలి

### - బుర్రి ఆంజనేయులు



**చీరాల టౌన్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

గొర్రెలు, మేకలు పెంపకం దారులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక చీరాల మండలం బోయినవారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసూఉకున్న సొసైటీ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెంపకం దారుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కోటయ్య ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని ప్రధానంగా గొర్రెలకు మందులు, పశుగ్రాసం దొంగతనాలు సమస్య తీవ్రంగా ఉందని కొన్ని చోట్ల పశువుల కాపరులను హత్యలు చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీవాలకు అవసరమైన మందులను ఉచితంగా సరఫరా చేయాలని సంవత్సరానికి నాలుగు సార్లు నట్టల మందులు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరనించిన జీవాలకు ఉచిత భీమా అమలు జరపాలని, 50 శాతం సబ్సిడీతో నాబార్డు ద్వారా రుణాలు పెంపకం దారులకు ఇవ్వాలని, తప్పకుండా దాడులు అరికట్టడానికి సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. షెడ్యూల్ నిర్మించుకోవడానికి పశుగ్రాసం కోసం తక్షణం రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బుర్రి ఆంజనేయులు ప్రధానోపాన్యాసం చేశారు. ఐక్యంగా ఉండి సమస్యల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో గడ్డం వెంకటేశ్వర్లు, ఎరాకుల శివయ్య, ఎర్రాకుల ప్రకాశం, పంచకట్ల నాగరాజు, గడ్డం శ్రీనివాస్‌రావు, గడ్డం యేసు రాజు, పిన్నిబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతిదేవిగా త్రిముఖ దుర్గాదేవి

**సీఎస్‌పురం, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మండలంలోని భైరవకోనలో దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా ఆదివారం 7వ రోజు శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని రాచూరి పెద్దమ్మ అమ్మవారు చండీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించగా ఈవో వంశీ కృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, వసతులను పర్యవేక్షించారు.

## వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సమావేశం



**పర్చూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పర్చూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన పర్చూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు చేయకుండా పార్టీ కార్యక్రమాలు, కూటమి ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాల గురించి ప్రజలకు సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని అన్నారు. సోషల్ మీడియా వారి మీద పెడుతున్న అక్రమ కేసులు చట్టం ద్వారా ఎదుర్కొంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కుమ్మరి చందు, స్టేట్ సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి బట్టు అనిల్ కుమార్, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

## ఏఎంఆర్ సీనరేజీలతో అక్రమాలకు అడ్డుకట్టేనా..

- నెలకు రూ.47 కోట్లు చెల్లించేలా టెండర్ తగ్గించుకున్న సంస్థ
- ఏఎంఆర్ కంటైనర్లను ధ్వంసం చేస్తున్న అక్రమార్కులు
- బల్లికురవ, మార్టూరు, అద్దంకి ప్రాంతాలలో 54 చెక్‌పోస్టులు

**బల్లికురవ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ఇప్పటి వరకు అక్రమ రవాణాలతో అక్షరాలు రానివారు కూడా తమ సామ్రాజ్యాన్ని రాజకీయ ముసుగులో మహాదర్జాగా కొనసాగించారు.ఈ అక్రమ రవాణాను అరికట్టటంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం చాణక్య నీతిని ప్రదర్శించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో గ్రానైట్, ఇసుక, గ్రావెల్,కంకర వంటి క్వారీల నుండి ప్రభుత్వ సీనరేజీ వసూళ్లు చేస బాధ్యతను ఏఎంఆర్ సంస్థ దక్కించుకుంది. అక్టోబర్ 1 నుండి ఆ సంస్థసీనరీ వసూళ్లను ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగం గా బల్లికురవ, మార్టూరు, అద్దంకి ప్రాంతాలలో అక్రమంగా గ్రానైట్, ఇసుక, గ్రావెల్ తరలి వెళ్లే 54 ప్రాంతాలను గుర్తించి అక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసేందుకు కంటైనర్లు దించింది. ప్రభుత్వ వైఖరి ఏమాత్రం నచ్చని అక్రమార్కుల ప్రతినిధులు కంటైనర్లను ధ్వంసంచేస్తున్నారు.అద్దంకిమండలం ధర్మవరం,బల్లికురవ మండలం కొనిదెన, కే.రాజుపాలెం ప్రాంతాలలో వీటిని ధ్వంసం చేసి ఏఎంఆర్ సంస్థకు హెచ్చరికలు జారీచేస్తున్నారు. ప్రభుత్వం నుండి అనుమతులు పొందిన సంస్థకు అక్రమార్కులు బెదిరింపులు పర్వాన్ని ఆరంబించటం రెండేళ్లకు 1128 కోట్లు ప్రభుత్వానికి సీనరేజి జమ చేసేందుకు ప్రభుత్వంతో అంగీకారం కుదిరింది. సంబంధిత ఆదేశాలను కూడా భూగర్భగనులశాఖ అధికారులు విడుదల చేయడం జరిగింది.బల్లికురవ,సంతమాగులూరు మండలాల నుండి రాజకీయ ముసుగులో ఒక వైపు గ్రానైట్ ముడి రాయి,మరొక వైపుగ్రానైట్ పలకలలారీలు మహాదర్జాగా సరిహద్దులు దాటు తుంటాయి.అదే విధంగా మార్టూరు మండల పరిధిలోని జంగమ మేశ్వరపురం,వలపర్ల రెవెన్యూపరిధిలో కోలలపూడి ప్రాంతాలలో ఎర్రగ్రావెల్ అక్రమంగా తరలిపోతూ కొండలు కరిగిపోతుంటాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 600 క్వారీలు ప్రభుత్వఆధీనంలో ఉన్నాయి.రాజ్యాలు మారిన రాచరికాలు మాత్రం ఎక్కడికి పోలేదు అన్న చందంగా ఇప్పటి వరకు మట్టి ఇసుక, రేషన్ బియ్యం, గ్రానైట్, రోడ్లు, లేఅవుట్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటేమిటి అన్నింట కిరీటాలు లేని అలనాటి మహారాజుల వసూళ్ల పర్వంగానే ఉంటుంది.ఏఎంఆర్‌కు సీనరేజి హక్కులు అప్పగించడం తో వీరంతా మింగలేక,కక్కలేక,ప్రభుత్వ విదానంపై లోలోపల రగిలిపోతున్నారు.








29-9Pg5 MN 9_29-9Pg5.qxd 9/28/2025 11:27 PM Page 1



# బీహార్‌లో నితీశ్‌కు ఎదురుగాలి!

### ఈసారి మహాఘట్ బంధన్‌కు అవకాశం
### నిరుద్యోగం, శాంతిభద్రతలే ప్రధానాంశాలు
### ఎన్డీఏ సర్కార్‌పై పెరిగిన వ్యతిరేకత
### ఆర్జేడీకి ఒబిసి, ఇబిసిల మద్దతు
### కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశం
### 105-114 సీట్లకే ఎన్డీఏ పరిమితం
### ఎంజీబీకి 118-126 స్థానాలు పక్కా
### లోక్ పాల్ ప్రి-పోల్ సర్వేలో వెల్లడి






**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ మొదటి వారంలో షెడ్యూల్ విడుదల కానుంది. ఇప్పటికే అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌లు ఎన్నికల ప్రచారాన్ని అనధికారికంగా ప్రారంభించాయి. పార్టీల మధ్య, నేతల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో బీహార్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో బీహార్ ప్రజలు ఏమనుకుంటున్నారు? అని 'లోక్ పోల్' అనే సంస్థ ప్రి-పోల్ సర్వే చేపట్టింది. మూడు వారాలపాటు రాష్ట్రమంతా కలియతిరిగి ఓటర్ల అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వే వివరాలను 'ఎక్స్' వేదికగా విడుదల చేసింది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ- జేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి 38-41శాతం ఓట్లతో 105 నుంచి 114 సీట్లు మాత్రమే వచ్చే అవకాశముంది. అలాగే ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమికి 39-42శాతం ఓట్లతో 118 నుంచి 126 స్థానాలు కైవసం చేసుకోనుంది. ఇతరులు, ఇందులో ప్రధానంగా ప్రశాంత్ కిశోర్ పార్టీకి 12 నుంచి 16శాతం వరకు ఓట్లు రావచ్చుని, అయితే 2 నుంచి 5 సీట్లు మాత్రమే గెలవగలుగుతాయని సర్వే తేల్చింది. అసెంబ్లీలో 243 స్థానాలుండగా, 122 స్థానాలు సాధించిన పార్టీ లేదా కూటమి అధికారం చేజిక్కించుకోనుంది. అయితే, ఎన్నికలకు ముందు ఓటింగ్ జరిగే సమయానికి బట్టి అంచనాలు తారుమారు అయ్యే అవకాశముందని 'లోక్ పోల్' సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది. బీహార్‌లో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, వలసలు ఈసారి ఎన్నికల్లో ప్రధాన అంశాలు కానున్నాయి. నితీశ్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత పెరిగిందని సర్వేలో వెల్లడైంది. ఆరోగ్య సమస్యలు, అవినీతి, క్షీణిస్తున్న శాంతిభద్రతల ప్రభావం నితీశ్ పాలనపై పడిందని చెబుతోంది. గతంలో ఎన్డీఏకు వెన్నుదన్నుగా నిలిచిన ఓబీసీ, ఈబీసీలు ఈసారి ఆర్జేడీ- కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారు. కాంగ్రెస్ కులగణన సహాయంతో ఎస్సీలు, ఈబీసీల్లో ఉదా-చమర్, ముసాహర్, మల్లా తదితర కులాల్లో ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశముంది. జేడీయూ బలమైన ఓటు బ్యాంకు కూడా ఈసారి ఆర్జేడీకి మద్దతివ్వనున్నారు. ముస్లింలు- యాదవుల ఏకీకరణ దేశాన్ని బలోపేతం చేస్తోందని ఆయా వర్గాల్లో నమ్మకం పెరుగుతోంది. దీంతో జేడీయూ ప్రభావం క్రమంగా తగ్గుతోందని పేర్కొంది. బీజేపీ ఓటు బ్యాంకుకు జాన్ సూరజ్ పార్టీ గండికొట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. బీజేపీకి బనియాల కులం మద్దతు ఉంది. అయితే, జాన్ సూరజ్ పార్టీ ఉన్నత కులాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుంది. ఫలితంగా బీజేపీకి ఆయా కులాల నుంచి నెగెటివ్ ఫలితాలు వచ్చే అవకాశాలున్నట్లు కనిపిస్తోంది. మై బెహన్ మాన్ యోజన, ఉచిత విద్యుత్ వంటి పథకాల కారణంగా మహిళా ఓటర్లు మహాఘట్‌బంధన్ వైపు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఓట్ల దొంగతనం కూడా ప్రభావం చూపే అవకాశముంది. రాహుల్ గాంధీ ఇమేజ్ మెరుగుపడిందని, ఓటర్ల కోసం ఆయన చేసిన యాత్ర, ప్రజా సమస్యలపై దృష్టి సారించిన నాయకుడిగా ఇమేజ్ పెరుగుతున్నట్లు పేర్కొంది. ఉత్తర ప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలోని స్థానాలలో బీఎస్పీ ప్రభావం క్షీణించడంతో మహాఘట్ బంధన్‌కు అవకాశాలు పెరిగే అవకాశముంది.

## బీహార్ ఎన్నికలకు 470 మంది పరిశీలకులు!

**పాట్నా, సెప్టెంబరు 28:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరంచేస్తోంది. ఈ క్రమంలో 470 మంది పరిశీలకులను నియమించింది. వీరిలో 320 మంది ఐఎఎస్‌లు కాగా 60 మంది ఐపిఎల్‌లతోపాటు మరో 90 మంది ఇతర ఉన్నతాధికారులున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు మరో ఏడు స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీ అవుతోంది. ఎన్నికల సమయంలో అవకతవకలకు తావులేకుండా చూడటం, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాత పోటీ వాతావరణం కల్పించాలని జనరల్, పోలీసులు ఖర్చుల పరిశీలకులను నియమిస్తున్నది.

అక్టోబరు తొలివారంలోనే బీహార్‌లో ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించనున్న ఈసీ అంతకుముందురోజే పరిశీలకులకు దిశానిర్దేశం చేస్తోంది. మొత్తం 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీ గడువు నవంబరు 22తో ముగియనుంది. ఇందుకోసం ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకుఈసీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తిచేయగా ఇందుకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు విచారణలో ఉంది.



## నటి సంజనకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** డ్రగ్స్ కేసులో సినీ నటి సంజనా గల్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నైజీరియన్ డ్రగ్ పెడ్లర్‌తో సంజనా సంబంధాలపై ఆరోపణలు, 2020నాటి డ్రగ్స్ కేసులో నటి సంజనా గల్రానీకి కర్ణాటక హైకోర్టు మార్చి 25, 2024 క్లీన్ చిట్ ఇస్తూ తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ కేసులో సుప్రీంకోర్టు తాజాగా నటి సంజనా గల్రానీతోపాటు మిగతా వారికి నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ పంపిణీ, విక్రయం ఆరోపణలతో సంజనా గల్రానీ గతంలో అరెస్టయ్యారు. ఈ కేసును విచారించిన కర్ణాటక హైకోర్టు.. ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, విచారణలో సంజనా ఫోన్ కాల్స్ డాటా, ఇతర వివరాలు, నగదు లావాదేవీలతోపాటు నైజీరియన్ డ్రగ్ పెడ్లర్‌తో ఆమెకున్న సంబంధాలను కర్ణాటక హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ అమన్ పన్వర్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. దీంతో నటి సంజనా సహా డ్రగ్స్ కేసులో గతంలో హైకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన వారికి జస్టిస్ సూర్యకాంత్, జాయ్‌వ ాల్యా బాగ్చి సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

## బ్యూనస్ ఏరీస్‌లో ముగ్గురు యువతుల దారుణ హత్య

**బ్యూనస్ ఏరీస్, సెప్టెంబరు 28:** అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎరీస్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ముగ్గురు యువతులను చిత్రహింసలు పెట్టి హత్య చేయడమే కాకుండా, ఈ ఘోరకృత్యాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పాశవిక చర్యకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులతో కలిసి పార్లమెంట్ వరకు భారీర్యాలీ నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యూనస్ ఏరీస్ శివారు ప్రాంతానికి చెందిన మోరెనా వెర్డి (20), బ్రెండా డెల్ కాస్టిల్లో (20), లారా గుటియెర్రెజ్ (15) అనే ముగ్గురు అమ్మాయిలు ఈ నెల 19న అదృశ్యమయ్యారు. ఐదు రోజుల తర్వాత,ఒక ఇంటి పెరట్లో వారి మృతదేహాలను పోలీసులు పాతిపెట్టిన స్థితిలో కనుగొన్నారు. డ్రగ్స్ ముఠాతో ఉన్న విభేదాలే ఈ హత్యలకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పార్టీ పేరుతో యువతులను ఒక వ్యాన్‌లోకి ఎక్కించుకుని, ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఒకరు హత్యను ఇన్‌స్టాగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ అకౌంట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు వెల్లడించడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు 45మంది ఈ లైవ్‌ను చూసినట్లు అధికారులు తెలిపారు. నా దగ్గర డ్రగ్స్ దొంగిలిస్తే ఇలాగే జరుగుతుందని ఒక ముఠా నాయకుడు వీడియోలో హెచ్చరించినట్లు సమాచారం. నిందితులు బాధితుల వేళ్లను నరికి, గోళ్లను పీకి, తీవ్రంగా కొట్టి ఊపిరా డకుండా చేసి చంపారని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్పం దించిన జాతీయ భద్రతా మంత్రి పాట్రిసియా బుల్రిచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలతో సహా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఐదో నింది తుడిని బొలీవియా సరిహద్దు నగరమైన విల్లాజోన్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ హత్యలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న 20 ఏళ్ల పెరూ దేశస్థుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు, ఈ లైవ్ స్ట్రీమింగ్ తమ ప్లాట్‌ఫామ్‌పై జరిగిందనడానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దారుణమైనేరంపై దర్యాప్తు చేస్తున్న అధికారులకు తాముపూర్తిగా సహకరిస్తున్నామని మెటా ప్రతినిధి చెప్పారు.నిరసనలో పాల్గొన్న బాధితుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. జంతువులతో కూడా ఇంత క్రూరంగా ప్రవర్తించరు. మాకు న్యాయం జరగాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.



## సోనమ్ దిష్టిబొమ్మలు దగ్ధంచేయకుండా చర్యలు తీసుకోండి

### మధ్యప్రదేశ్ హైకోర్టు తక్షణ ఆదేశాలు

**భోపాల్,సెప్టెంబరు 28:** మేఘాలయలో హనీమూన్ సందర్భంగా కొత్తగా పెళ్లైన భర్తను హత్య చేసిన నిందితురాలు సోనమ్ రఘువంశీ దిష్టిబొమ్మను దసరా రోజున దహనం చేయడాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టు నిషేధించింది. నిందితురాలు లేదా ఇతర వ్యక్తుల దిష్టిబొమ్మలను దహనం చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించింది. ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీకి సోనమ్‌తో పెళ్లి జరిగింది. అనంతరం కొత్త జంట హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లారు. అక్కడ ప్రియుడితో కలిసి భర్తను సోనమ్ హత్య చేసింది. ఈ కేసుపై దర్యాప్తు చేసిన పోలీసులు సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా, ఇతర నిందితులను అరెస్ట్ చేశారు. దసరా రోజున 'సుర్పణక దహనం' కోసం 11 తలల దిష్టిబొమ్మను సిద్ధం చేస్తున్నట్లు ఇండోర్‌కు చెందిన సామాజిక సంస్థ 'పౌరుష్' తెలిపింది. సోనమ్‌తో పాటు భర్తలు, పిల్లలు, అత్తమామలను దారుణంగా హత్య చేసిన నిందితులైన మహిళల చిత్రాలు ఉంటాయని పేర్కొంది. మరోవైపు సోనమ్ తల్లి సంగీత ఆ సంస్థకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ ప్రణయ్ వర్మతో కూడిన సింగిల్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. అలాంటి దిష్టిబొమ్మ దహనానికి అనుమతి లేదని శనివారం తీర్పునిచ్చింది. పిటిషనర్, ఆమె కుమార్తె, కుటుంబం ప్రాథమిక హక్కులను ఇది ఉల్లంఘిస్తుందని పేర్కొంది. కాగా, 'భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్య ఆమోదయోగ్యం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేరు' అని కోర్టు స్పష్టం చేసింది. అలాంటి దిష్టిబొమ్మ దహనం జరగకుండా చూడాలని, మహిళా నిందితులు, వారి కుటుంబాల ప్రతిష్టను దెబ్బతీసే చట్టవిరుద్ధమైన లేదా రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను నిరోధించాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లను హైకోర్టు ఆదేశించింది.



## ప్రపంచ దేశాల్లో 80% సమస్యలన్నీ వృద్ధనేతల వల్లనే..

### అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా



**శ్రీనగర్, సెప్టెంబరు 28:** ప్రపంచదేశాల్లో 80శాతం మంది వృద్ధనేతలు అధికారం పట్టుకుని వేలాడుతుండటంవల్లనే సమస్యలు పెరుగుతున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. పిరమిడ్లుతో సహా ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కడం వంటివాటివల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. 77 ఏళ్లవయసులో అగ్రరాజ్యానికి అధ్యక్షుడుగా ఉన్న ట్రంప్‌ను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేసారని అంతా అనుమానిస్తున్నారు. లండన్‌లో జరిగిన ఒక ఈవెంట్‌లో ఒబామా మాట్లాడుతూ ప్రపంచ సమస్యల్లో 80శాతం మరణానికి భయపడే వృద్ధులు అధికారాన్ని పట్టుకుని వేలాడుతుండటంవల్లనేనని చెప్పడం సముచితం. వారు ఏదీ వదులుకోరు. వారు పిరమిడ్‌లను నిర్మిస్తారు. ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కించుకుంటారని అన్నారు. బ్రిటిష్ చరిత్రకారుడు డేవిడ్ ఒలుసొగాతో జరిగిన ముఖాముఖిలో ఈవ్యాఖ్యలు చేసారు. 2017నుంచి 2018 వరకూ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బరాక్ ఒబామా 2019లో కూడా సాధారణంగా వృద్ధులు ముఖ్యంగా బాగా ముదిమి వయసు బారిన పడినవాళ్లు అధికారం అనే మార్గంనుంచి బయటకు రారని అన్నారు. పారాసిటమాల్ వాడితే గర్భస్తశిశువుల్లో ఆటిజం పెరుగుతుందన్న ట్రంప్ వ్యాఖ్యలపైనా ఒబామా విమర్శించారు. ట్రంప్ వ్యాఖ్యలు సత్యదూరమని ఒబామా కొట్టిపారేసారు.


## సెక్యూరిటీ దళాల దాడుల్లో 17 మంది పాక్ తాలిబన్‌లు మృతి



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 28:** పాకిస్తాన్ వాయవ్యప్రాంతంలో ఆదేశ భద్రతా దళాలు జరిపిన మెరుపుదాడుల్లో సుమారు 17 మంది పాకిస్తానీ తాలిబన్ యోధులు మృతిచెందారు. ఖైబర్ ఫక్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని కరక్ ప్రాంతంలో ఈ దాడులు జరిపారు. ప్రాంతీయ పోలీస్ చీఫ్ షెహబాజ్ ఇలాహి వివరాలప్రకారం ఈ దాడుల్లో ముగ్గురు పోలీస్ అధికారులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇవ్వని చీఫ్ వీరిని ఖ్వార్జి అని మాత్రమే చెప్పారు. వీరంతా పాకిస్తాన్ తాలిబన్‌కు చెందినవారని తెలిపారు. ఇటీవలి కాలంలో టిటిపై ఆకస్మికదాడులు, ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వాయవ్య ప్రాంతంలోనే డేరా ఇస్మాయిల్‌ఖాన్ జిల్లాలో 13 మంది టిటిపి ఫైటర్లు చనిపోయారు. ఇటీవలికాలంలో పాకిస్తాన్‌లో మిలిటెంట్ హింసపెరిగిపోయింది. వేర్పాటు వాదుల దాడులు ఎక్కువయ్యాయి. పాకిస్తానీ తాలిబన్ కూడా ఈ దాడులు నిర్వహించింది. ఈ సంస్థనే తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ లేదా టిటిపి అని కూడా పిలుస్తారు. అఫ్ఘన్ తాలిబన్లతో సంబంధాలు ఎక్కువ ఉన్న టిటిపి పాక్ ప్రభుత్వ దళాలపై మెరుపుదాడులు చేస్తోంది. 2021లో ఆఫ్ఘన్ తాలిబన్ అధికారం లోకి వచ్చినప్పటినుంచి టిటిపి మిలిటెంట్లు, కమాండర్లు ఆఫ్ఘనిస్తాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

## ఆధార్ అప్‌డేట్‌కు ఇకపై రుసుముల బాదుడు

### కొత్తకార్డులు ఉచితమే




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** ఆధార్ కార్డు సంబంధించిన వివిధ సర్వీసులకు ఇకపై అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఆధార్ సేవల యూజర్ ఛార్జీలను పెంచుతూ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఏఐడీఏఐ) ప్రకటించింది. అయితే, కొత్త ఆధార్ కార్డుల జారీ సర్వీసులు ఉచితంగానే అందిస్తామని తెలిపింది. కానీ, ఇప్పటికే జారీ చేసిన ఆధార్ కార్డుల్లో అడ్రస్ మార్చుకోవడం, నిర్ణీత వయసు వారు వేలి ముద్రలను అప్డేట్ చేయడం వంటి సేవలకు ఛార్జీలు విడతల వారీగా పెంచుతున్నట్లు తెలిపింది. మొదటి విడతలో పెంచిన ఛార్జీలు అక్టోబర్ 1 నుంచే అమలులోకి తీసుకొస్తున్నారు. 17 ఏళ్ల వయసు దాటిన వారు తమ ఆధార్ కార్డులో వేలి ముద్రలను అప్డేట్ చేసుకోవాలంటే ప్రస్తుతం ఈ సర్వీసులకు రూ.100 వసూలు చేస్తున్నారు.అయితే, దీనిని రూ.125కు పెంచారు. ఇక అడ్రస్ మార్చుకునేందుకు ప్రస్తుతం రూ.50 మేర వసూలు చేస్తుండగా ఈ ఛార్జీలను రూ.75కు పెంచుతున్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచే పెరిగిన ఛార్జీలు అమలులోకి వస్తాయని యూఐడీఏఐ పేర్కొంది. ఈ మేరకు యూఐడీఏఐ హెడ్ ఆఫీసులోని డిప్యూటీ డైరెక్టర్ హిమాన్ష దేశంలోని అన్ని యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయాలకు సమాచారం అందించారు. కొత్త ఆధార్ ఎన్‌రోల్మెంట్ ఉచితంగానే ఉంటుంది. చిన్న పిల్లలు 5 సంవత్సరాల నుంచి 7 ఏళ్ల మధ్య వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయాల్సి ఉంటుంది. వారికి సైతం ఈ సేవలు ఉచితంగానే ఉంటాయి. అలాగే 15 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయసు వారికి సైతం ఎలాంటి ఛార్జీలు ఉండవు. 17 ఏళ్ల వయసు దాటిన వారికి కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. రెండో విడతలో ఈ ఛార్జీలు రూ.100, రూ.125గా నిర్ణయించారు. ఇవి అక్టోబర్ 1, 2028 నుంచి అమలులోకి వస్తాయి. ఇక మూడో విడతలో సెప్టెంబర్ 30, 2031 నుంచి రూ.90 నుంచి రూ.150గా ఉంటాయని యూఐడీఏఐ తెలిపింది. మరోవైపు 2026, జూన్ 14వ తేదీ వరకు మై ఆధార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్లో ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్ ఉచితంగా చేసుకోవచ్చని యూఐడీఏఐ తెలిపింది. ఆ తర్వాత ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇక ఆఫ్‌లైన్ ద్వారా ఆధార్ నమోదు కేంద్రాల్లో అయితే ఇప్పుడు కూడా ఛార్జీలు కట్టాలి. అయితే, ఆధార్ కేంద్రాల్లో ఇప్పటికీ రూ.50, రూ.100 పాత ఛార్జీలనే ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. కొత్త వాటిని అక్టోబర్ 1వ తేదీ తర్వాత ప్రదర్శించే అవకాశాలు ఉన్నాయి. పేరు మార్పు, చిరునామా మార్పు, ఫోన్ నంబర్ మార్పు, బయోమెట్రిక్ అప్డేట్ వంటి వాటికి కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. చిన్న పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కోసం యుఐడిఎఐ స్కూళ్లలోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది.



## భారత్ విషయాల్లో జోక్యం చేసుకోం

### రష్యా అధ్యక్షుడు పుతిన్

**న్యూయార్క్, సెప్టెంబరు 28:** ఈ యేడాది చివర్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. తర్వాత భారత విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి కీలక విషయాల్లో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ యేడాదిలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని తెలిపారు. వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే.. దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యుఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్‌కు ఆత్మగౌరవం ఉందని లవ్రోవ్ వ్యాఖ్యానించారు.

## భారత్‌పై నోరుపారేసుకున్న అమెరికా మంత్రి లుట్నిక్

**వాషింగ్టన్, సెప్టెంబరు 28:** అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్నారు. అమెరికాతో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్ వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వారు తమ మార్కెట్లను తెరిచి అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలను అగ్రరాజ్యం మరింత సరిచేయాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో ప్రేలాపనలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచిందని లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు ఉండాలనే విషయంపై మోడీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై నోరు పారేసుకున్నారు.



## ఇద్దరు వ్యక్తులపై కాంగ్రెస్ నాయకుడి దాడి



**భోపాల్, సెప్టెంబరు 28:** కాంగ్రెస్ నేత కుమారుడు ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడంతోపాటు వారిని బెదిరించాడు. నగరంలోని సగం మంది తన పేరు వింటే భయపడతారని వారితో అన్నాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బాధిత వ్యక్తుల ఫిర్యాదుతో కాంగ్రెస్ నేత కుమారుడిపై కేసు నమోదైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 3న అనికేత్ బైరాగి తన బావమరిది నీరజ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతి కుమారుడు నీర్ ప్రజాపతి ఇంటికి వెళ్లి కలిశాడు. ఆయన మేనల్లుడు అమిత్ ప్రజాపతి, నీరజ్ మధ్య జరిగిన వివాదాన్ని ప్రస్తావించాడు. కాగా, వివాదాన్ని పరిష్కరించడానికి బదులు అనికేత్, నీరజ్‌ను నీర్ ప్రజాపతి దుర్భాషలాడాడు. వారిద్దరిని కొట్టాడు. 'భోపాల్‌లో సగం మంది తన పేరుకు భయపడతారు' అని బెదిరించాడు.

## సంక్షిప్తంగా..

### విద్యార్థినులను వేధించిన స్వామీజీ అరెస్టు



**ఆగ్రా, సెప్టెంబరు 28:** విద్యార్థినులపై లైంగిక వేధింపులు, కోట్ల రూపాయల ఆర్థిక మోసం వంటి తీవ్ర ఆరోపణలతో కొన్ని రోజులుగా పరారీలో ఉన్న వివాదాస్పద స్వామీజీ చైతన్యానంద సరస్వతిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఆగ్రాలోని ఓ హోటల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని శ్రీ శారద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌కు డైరెక్టర్‌గా పనిచేసిన చైతన్యానంద (62) అసలు పేరు పార్థసారథి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) స్కాలర్‌షిప్‌పై చదువుకుంటున్న 17 మందికి పైగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని, వారిని తాకుతూ వేధించాడని, అసభ్యకర సందేశాలు పంపాడని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్ధరాత్రి తన గదికి రావాలని విద్యార్థినులను బలవంతం చేసేవాడని, వారి కదలికలను ఫోన్ ద్వారా నిత్యం గమనించే వాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

### నార్త్‌కరోలినా రెస్టారెంట్‌లో కాల్పులు: ముగ్గురు మృతి

**నార్త్‌కరోలినా, సెప్టెంబరు 28:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. నార్త్ కరోలినాలో ఓ దుండగుడు వినూత్న రీతిలో రెస్టారెంట్‌పై దాడికి పాల్పడ్డాడు. బోటులో వచ్చి జనంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. విల్మింగ్టన్‌కు సమీపంలోని సౌత్ పోర్ట్ యాట్ బేసిన్ ప్రాంతంలో ఉన్న 'అమెరికన్ ఫిష్ కంపెనీ' అనే రెస్టారెంట్‌లో శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. రెస్టారెంట్ సమీపంలోని నీటిలో ఒక బోటు వచ్చి ఆగింది. అందులో ఉన్న ఓ వ్యక్తి ఒక్కసారిగా రెస్టారెంట్‌లోని వారిపై తుపాకీతో కాల్పులు జరపడం ప్రారంభించాడు. అనంతరం అదే బోటులో వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనలో మొత్తం ఏడుగురిపై బుల్లెట్లు దూసుకెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



### సోషల్ నెట్‌వర్కింగ్‌లో నంబర్ వన్ 'అరట్టై'..



**చెన్నై,సెప్టెంబరు 28:** చెన్నైకి చెందిన జోహో కార్పొరేషన్ అభివృద్ధి చేసిన 'అరట్టై' యాప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. యాపిల్ యాప్ స్టోర్‌లో సోషల్ నెట్వర్కింగ్ విభాగంలో ఇది నంబర్ వన్ స్థానంలో నిలిచింది. 'అరట్టై' అంటే తమిళంలో "మాట్లాడటం" అని అర్థం. టెక్స్ట్ మెసేజ్‌లు,వాయిస్/ వీడియోకాల్స్, ఫోటోలు, వీడియోలు, డాక్యు మెంట్లు పంపడం, స్టోరీస్, ఛానల్స్ క్రియేట్ చేయడం ఇలా వ్యక్తిగత మరియు వృత్తిపరమైన అవసరాలకు తగిన ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించారు. దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ యాప్‌ను కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రదాన్, అశ్వినీ వైష్ణవ్ ప్రోత్సహిస్తున్నారు. తాజాగా తాను జోహోకు మారుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.మైక్రోసాఫ్ట్ పవర్ పాయింట్ బదులుగా జోహోతోనే తాజా కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు ఆయన తెలిపారు.

### బాలికపై ఆరునెలలుగా అత్యాచారం: నిందితుడి అరెస్టు

**లక్నో,సెప్టెంబరు 28:** ఒక వ్యక్తి బాలికను కిడ్నాప్ చేశాడు. ఒకచోట నిర్బంధించి ఆరు నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. చివరకు బాలికను నిర్బంధించిన ప్రాంతాన్ని పోలీసులు గుర్తించారు. ఆమెను రక్షించడంతోపాటు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మోధ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక మార్చి 22న అదృశ్యమైంది. ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులపాటు అన్ని చోట్ల వెతికారు. కాగా, 21 ఏళ్ల ఆశిష్ కుమార్ సరోజ్ ఆ యువతిని మభ్యపెట్టి లోబర్చుకుని కిడ్నాప్ చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. ఆరు నెలల తర్వాత సెప్టెంబర్ 26న ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని సంగం రైల్వే స్టేషన్ సమీపంలో ఆ బాలికను రక్షించారు. ఆశిష్ కుమార్ తనను నిర్బంధించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించింది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.



# దక్షిణ కొరియాలో మంత్రుల పర్యటన

- సుస్థిర నగరాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై అధ్యయనం
- నామి ఐలాండ్, చియాంగ్ గెచెవోన్ వాగు, హాన్ నదిని పరిశీలన
- ఏపీఈడీబీ ఆధ్వర్యంలో మంత్రుల బృందం మూడు రోజులపాటు పర్యటన



**రాజంపేట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** అమరావతితో పాటు రాష్ట్రంలో సుస్థిర నగరాల అభివృద్ధి, రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి దక్షి ణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ(ఏపీఈడీబీ) ఆధ్వర్యంలో మంత్రులు, అధికారులు దక్షి ణ కొరియా పర్యటనకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 11.40 గంటలకు ఆ దేశ రాజధాని సియోల్ చేరుకున్నారు. ఆ తర్వాత దక్షి ణ కొరియాలోని నామి ఐ ల్యాండ్ సీఈవో మిన్ క్యోంగ్ వూతో మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు భేటీ అయ్యారు. దక్షి ణ కొరియాలో సహజ సిద్ధమైన, సాంస్కృతిక, సాంప్రదాయక పర్యాటక ప్రదేశంగా ఉన్న నామీ ఐలాండ్ ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నది. సియోల్‌లో ఉన్న అతి పెద్ద పర్యాటక ప్రాంతం ఇదే కావడం విశేషం. కొరక అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లతో ఏడాది పొడవునా సంగీత ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్జిస్తుంగానూ అభివృద్ధి సాధిస్తోంది. నామీ ద్వీపం అభివృద్ధి, పర్యాటకులను ఆకట్టుకునేందుకు తీసుకున్న చర్యలపై సీఈవోతో మంత్రి నారాయణ చర్చించారు. 4,60,000 చ.మీ. విస్తీర్ణంలో అందమైన చెట్లు, పూల మొక్కలతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న నామీ ద్వీపంలో అనుసరిస్తున్న విధానాలను అమరావతిలో బ్లూ గ్రీన్ సిటీగా రూపుదిద్దడంలో పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నారాయణ నిర్ణయించారు. మధ్యాహ్నం లంచ్ తర్వాత సియోల్‌లోని చియాంగ్‌గేచెఒన్ వాగును మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. 30 ఏళ్ల క్రితం పూర్తిగా మురుగునీటితో తీవ్ర కలుషితకారకంగా ఉండి ఆ తర్వాత అత్యంత పరిశుభ్రంగా మారిన చియాంగ్‌గేచెఒన్ వాగును పరిశీలించారు. 2003-2005 మధ్యకాలంలో సియోల్ నగరంలో మెరుగైన వాతావరణం కల్పించడం కోసం "చియాంగ్‌గేచెఒన్" పునరుద్ధరణ ప్రాజెక్టును స్థానిక ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సియోల్ నగర వాతావరణాన్ని మెరుగుపరచడం కోసం చేసిన ప్రయత్నం ఫలించి నేడు అత్యంత ఆహ్లాదకరంగా చియాంగ్‌గేచెఒన్ వాగు పరిసర ప్రాంతాలు మారాయి. ముఖ్యంగా గతంలో అత్యంత మురికిగా, కలుషిత కారకంగా ఉండే "చియాంగ్‌గేచెఒన్" వాగులోని నీరు.. నేడు పునరుద్ధరణ తర్వాత ఎంతో స్వచ్ఛంగా మారడం, గాలి నాణ్యత పెరగడం, శబ్ద కాలుష్యం తగ్గడం.. తద్వారా జీవవైవిధ్యం మెరుగుపడటం ఈ వాగు పునరుద్ధరణలో ప్రత్యేకత. ఏపీలో కాలుష్య కారకంగా మారిన నదులు, కాలువలు, వాగులు వంటి వాటిని పునరుద్ధరించే కోణంలో ఈ వాగును మంత్రులు, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎం.టి.కృష్ణబాబు, కన్నబాబు పరిశీలించారు. సాయంత్రం దక్షి ణ కొరియాలో హన్ నదిని మంత్రులు పరిశీలించారు. దక్షి ణ కొరియా రాజధాని సియోల్ ను నగరం మధ్యలో ప్రవహించే హన్ నది.. నది పరిసర ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. సియోల్ అభివృద్ధిలో అంతర్జాతీయంగా నిలుస్తూ, నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణ కల్పిస్తూ.. పర్యాటకులను ఆకర్షిస్తుంటుం హన్ నది యొక్క ప్రత్యేకత. అమరావతి నిర్మాణంలో సైతం ఇటువంటి ఆహ్లాదకర వాతావరణం కల్పించే కోణంలో హన్ నది తీర ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. హన్ నది పరివాహక ప్రాంతంలో అనేక పార్కులు, వంతెనలు, సైకిల్ మార్గాలు వంటి అభివృద్ధి నిర్మాణాలతో ఆధునిక రాజధానులకు సరికొత్త రూపంగా సియోల్ నిలుస్తుంది. కృష్ణానది తీరంలో అమరావతి రాజధాని నిర్మిస్తున్న క్రమంలో హన్ నది.. తరహాలో ఆధునిక రాజధాని నిర్మాణంలో కృష్ణ తీరంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలపై మంత్రులు స్థానిక అధికారులతో చర్చించారు. రాత్రికి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిశాంత్ సింగ్, షాలిని సింగ్ దంపతుల ఆహ్వానం మేరకు స్థానిక శరవణ భవన్‌లో మంత్రులు పి. నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు టి. కృష్ణబాబు, కాటమనేని భాస్కర్, కన్నబాబు తదితరులు హాజరయ్యారు.



## సమసమాజ స్థాపనే జాషువా ఆశయం

### గుర్రం జాషువా జయంతి సభలో పలువురు వక్తలు

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** సమాజంలోని అసమానతలు రూపుమాపి సమసమాజం వైపుగా అడుగులు వేసే ఆశయంగా గుర్రం జాషువా సాహిత్యం సాగిందని వేమన పౌండేషన్ ఆధ్వర్యంలో యస్.యస్.బి.యన్ కళాశాలలో ఆదివారం జరిగిన గుర్రం జాషువా జయంతి సభలో వక్త, సాహిత్య విమర్శకులు డా.కల్లూరి ఆనందరావు పేర్కొన్నారు. విశాంత ఉపకులపతి, వేమన పౌండేషన్ అధ్యక్షులు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సభ కొనసాగింది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ.. సమాజ స్థితిగతులను పద్యం ద్వారా ఎలుగెత్తి ప్రజలను చైతన్యవంతం చేయడంలో జాషువా కృషి అనన్యమైనదని అన్నారు. మరో వక్త డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి.. వేమన జాషువాలను తులనాత్మకంగా విశ్లేషించారు. ఇరువురు కవులు తాము ఏ వర్గాలను విమర్శించారో ఆ వర్గాలు సైతం వీరి ప్రతిభను గుర్తించేలా చేసారని అన్నారు. సమాజ పురోగతికి వీరి సాహిత్యం చేదోడుగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పద్యగాయకులు వేంకటేశ్వర ప్రసాద్ జాషువా పద్యాలను గానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్య లక్ష్మినారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, పౌండేషన్ సభ్యులు లోకన్న కృష్ణారెడ్డి, నాగాశేషారెడ్డి, కవులు సురేష్, రియాజ్ అహమ్మద్, జూటూరు షరీఫ్, మధురశ్రీ, వన్నప్ప, వీరభద్రప్ప, టి.వి రెడ్డి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు

## సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

- రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** కలాన్ని ఆయుధంగా వాడుకొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం విజయవాడ ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. నవయుగ కవి చక్రవర్తి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న డా. కనకదుర్గ ప్రసాద్ రావు, డా. పాలపర్తి శ్రీధర్, మీసాల లక్ష్మణ, కె.గురువమ్మలకు కవికోకిల పద్మభూషణ్ గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు పురస్కారాలను మంత్రి ప్రదానం చేశారు. పొట్లూరి హరికృష్ణకు జాషువా ప్రతిభా పురస్కారాన్ని అందజేసారు. అంతకుముందు భాషా సాంస్క ృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఛైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, ఎన్టీఆర్ కలెక్టర్ జి. లక్ష్మీశ, నాటక రంగ అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ అధికారులు సుమన్, శ్రీనివాస్, ప్రముఖ రంగ స్థల, సినీ నటుడు మీసాల లక్ష్మణ్, నంది అవార్డు గ్రహీత డా. కనకదుర్గా ప్రసాద్ రావు, కత్తి గురువమ్మ, డా. శ్రీధర్, జానపద కళల అకాడమీ మాజీ ఛైర్మన్ పొట్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన పాండిత్యంతో పరవశింపజేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. భావితరాలకు మహాకవి గుర్రం జాషువా గొప్పతనాన్ని తెలపాల్సిన అవసరాన్ని వివరించారు. భావితరాలకు గుర్రం జాషువా భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జాషువాపై ఆలపించిన గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.



జాషువా జయంతి సభలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని ఆవిష్కరణ

## కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకుని వస్తాం



**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, ఇతర నాయకులు ఆమెను కలిశారు. సామాజికంగా కురబలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కురుబలకు అధిక ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. కురుబల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. బిసిల అభ్యున్నతికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. కురబలకు అన్ని విధాలు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. కురబల నుంచి మంచి విద్యావంతులు అధికారులు, రాజకీయవేత్తలు. వైద్యులు, ఇంజినీర్లు తయారు కావాలన్నారు. అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో కురుబ సంక్షేమ సంఘం నాయకులు బి ప్రసాద్, ఎం సదాశివ తదితరులు ఉన్నారు.



## మన్‌కీబాత్ ప్రతి భారతీయునికి ప్రేరణ

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురంలోని అలెగ్జాండర్ ఫంక్షన్ హాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలతో, నాయకులతో, కార్యకర్తలతో, కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి, షహీద్ భగత్‌సింగ్ త్యాగస్ఫూర్తి, లతా మంగేష్కర్ గాన మాధుర్యం, గాంధీ జయంతి సందర్భంలో ఖాదీ ప్రోత్సాహం, మహిళా సాధికారత విజయాలు, సముద్రయానంలో యువ మహిళా సాహసాలు, స్వచ్ఛ భారత్ ఉద్యమం, అలాగే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవా భావం వంటి అంశాలను ప్రస్తావించారు. తరువాత మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మోడి మన్‌కీ బాత్ ప్రతి భారతీయునికి ప్రేరణ. భగత్‌సింగ్ వంటి మహనీయుల త్యాగస్ఫూర్తి మనకు మార్గదర్శి. ఖాదీకి మద్దతు, మహిళా సాధికారత, యువత సాహసాలు, శుభ్రత ఇవన్నీ ఆచరణలో పెడితేనే దేశం శక్తివంతమవుతుంది. ప్రజలతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించడం నాకు గర్వకారణం అని తెలిపారు.

## డీజెడ్‌బిఐ.కామ్ వెబ్‌సైట్ ప్రారంభం

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయుష్ వైద్యశాల కోసం రూపొందించిన డీజెడ్‌బిఐ.కామ్ వెబ్‌సైట్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం స్థానిక గెస్ట్ హౌస్‌లో ప్రారంభించారు. డిజెడ్‌బిఐ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు అనే ఒక స్టార్ట్ ఆప్ కంపెనీ ఆయుష్ వైద్యులను ప్రపంచ నలుమూలల ఉన్న ఎవరైనా స్వస్థత, ఆయుష్ చికిత్సలను (ఆయుర్వేద, యోగ నాచురోపతి, యునాని, సిద్ధ హోమియోపతి) కోరుకునే వారికోసం వైద్యులచే వైద్యసేవల కొరకు తయారు చేయబడిన ఒక ఆన్‌లైన్ వేదిక ద్వారా ఆయుష్ వైద్యులను, హాస్పిటల్స్ ను క్లినిక్‌లను, వైద్య వృత్తిలో ఉన్న ఇతర నిపుణులను, ఫార్మసీలను, ల్యాబ్‌లను, స్వస్తియన్‌లను (ఆరోగ్యం పొందాలని కోరుకునే వారు) వీరందరినీ ఒక ఏకీకృత వేదిక ద్వారా అనుసంధించటం ద్వారా ఇంటివద్దకే వైద్యము, ఆన్‌లైన్ ద్వారా వైద్యులను సంప్రదించటం, వైద్యులు వీడియో కన్సల్టేషన్ ద్వారా స్వస్తియన్లకు (రోగులకు) చికిత్సలను అందుబాటులోకి తేవడం, అంతేకాక భారత్ దేశంలోని ఏమూలకైనా కొరియర్ ద్వారా నేరుగా మందులు పంపించే వెసలుబాటు ఇలాంటి అనేక సౌకర్యాలతో సంప్రాదాయ ఆయుష్ వైద్య వెబ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డిఐజెడ్‌బిఐ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ దాకవరపు సురేష్ మాట్లాడుతూ.. తమ సంస్థ సభ్యులకు ఒక సంవత్సరం పాటు పూర్తిగా ఉచితంగా సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను అందించటం ద్వారా సాంప్రదాయ ఆరోగ్య సంరక్షణ పద్ధతలను శక్తివంతం చేస్తామన్నారు. వైద్యులు సేవలందించే క్రమంలో తమ సాంకేతికత ద్వారా వారి శ్రమని తగ్గించి మెరుగైన వైద్యం అందించటానికి తోడ్పాటు అందిస్తామన్నారు. అంతరాలను తగ్గించడం, నమ్మకాన్ని పెంపొందించడం, సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యం అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డిఐజడ్‌బిఐ హెల్త్ వెల్‌నెస్ హెడ్ డా.రజిత యాదవ్ వీరబోయిని కో ఫౌండర్, డిజబీఐ నతురయి హెల్త్ వెల్‌నెస్ హాస్పిటల్ బెంగళూరు, డాక్టర్ నాగేశ్వరరావు వీరబోయిని ఛైర్మన్ గోకుల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ అనంతపురము, ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు.



ఆయుష్ వైద్యశాల కోసం రూపొందించిన డీజెడ్‌బిఐ.కామ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్‌కు మెమెంటో అందజేస్తున్న అధికారులు



దుకాణం దారునితో మాట్లాడుతున్న కలెక్టర్

## జిఎస్‌టి తగ్గింపు ధరలను అమలు చేయాలి

### శ్రీకాళహస్తిలో అంగడంగడికి వెళ్లి కలెక్టర్ పరిశీలన

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** ప్రతి షాపు నిర్వాహకులు తగ్గించిన జిఎస్‌టి మేరకు ధరలను ఖరారు చేసుకొని విక్రయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ సూచించారు. అయితే తమకు పాత ధరలతోనే సరకులు సరఫరా అవుతున్నాయని దుకాణం దారులు కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. శ్రీకాళహస్తిలో జిల్లా కలెక్టర్ నాలుగుమాడ వీధుల్లో దుకాణం దుకాణానికి వెళ్ళి నిర్వాహకులతో జిఎస్‌టికి సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం జిఎస్‌టి తగ్గింపు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వరన్ జనాల్లోనూ, దుకాణం దారుల్లో అవగాహన కల్పించుటకు చొరవ చూపారు. ప్రతి గడపకు జిఎస్‌టి తగ్గింపు ఫలాలు ఆందేలా విస్తృత ప్రచారం చేసారు. ఈ సందర్భంగా దుకాణం దారులు కలెక్టర్ దృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందిస్తూ వాటిని త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వరన్ భరోసా ఇచ్చారు. తాము ఉత్పత్తి దారులతో చర్చిస్తున్నామని వివరించారు. కొత్త తగ్గిపు పన్నుతో ఎంఆర్‌పిలు వస్తాయని వివరించారు. కలెక్టర్ నాలుగుమాడ వీధుల్లోని ప్రతి అంగడి వద్దకు వెళ్ళ కొనుగోలుదారులు, అమ్మకం దారులతో మమేకమయ్యారు. బంగారు దుకాణాలు, బుక్‌స్టాల్స్ బేరివారి మండపం వద్ద ఉన్న సూపర్‌బజార్‌లో వస్తువులపై ఉన్న ధరలను అమ్మకం దారుడు అందిస్తున్న ధరలను పరిశీలించారు. సూపర్‌బజార్ యజమాని మహమ్మద్‌తో చర్చించారు. అలాగే బుక్‌స్టాల్ యజమాని ఆరవిందరెడ్డితో చర్చించారు. వారు జిఎస్‌టి తగ్గింపు ఇన్వాయిస్ రావటం లేదని బిల్లులు చూపారు. అయితే కొనుగోలు దారులు తమను నిలదీస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ వీటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

#### ప్రతిగడపకు ఫలాలు అందాలి

క్షేత్ర స్థాయిలో పరిశీలనలు, అవగాహన కల్పించిన కలెక్టర్ వెంకటేశ్వరన్ మీడియాతో మాట్లాడుతూ జిఎస్‌టి ఫలాలు ప్రతి గడపకు చేరాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని వివరించారు. నిత్యావసర వస్తువులు, మెడికల్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలపై జిఎస్‌టి తగ్గింపు వచ్చిందని వీటిని ప్రతి వినియోగదారునికి అవగాహన కల్పించి ఆ ఫలాలను దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ అవగాహన ర్యాలీలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, వాణిజ్య పన్నుల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## కాత్యాయిని అలంకారంలో ముత్యాలమ్మ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగలు సంబరాల్ని నింపుతున్నాయి. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో అమ్మవారు జ్ఞాన ప్రసూనాంబ దేవిగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఆదివారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జ్ఞాన ప్రసూనాంబ దేవిని కాళరాత్రి అలంకారం నిర్వహించారు. ఈ అలంకారం భక్తుల్ని ఇట్టే ఆకట్టుకునేటట్లు తీర్చిదిద్దారు. ముత్యాలమ్మగుడి వీధిలోని ముత్యాలమ్మ ఆలయంలోనూ, ఏడుగంగమ్మలు వెలసిన ఆలయాల్లో విశేష పూజలు చేశారు. కాగా దక్షిణ కాళిమాత ఆలయం, పానగల్‌లోని పొన్నాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాలకు విశేష అలంకారాలు నిర్వహించారు. శనివారం జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు, ముత్యాలమ్మ ఆలయం, ఏడుగంగమ్మల ఆలయం అమ్మవారి విగ్రహాలకు కాత్యాయిని అలంకారం నిర్వహించారు.

## కాణిపాకంలో గరుడసేవ

**కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అను బంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి పెరిందేవి సయిత వరద రాజసా ్వమి ఆలయంలో ఆదివారం రాత్రి గరుడసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కలియుగ వైకుంఠం తిరుమలలో గరుడసేవ జరిగే సమయంలో శ్రీవరదరాజస్వామి ఆలయంలో స్వామివారికి గరుడ సేవను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్ర మానికి కాణిపాకంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ మేరకు ఆలయంలో పగలు స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి దూపదీప నైవేద్యాలను సమరి ్పించారు. ప్రత్యేక హోమాలను నిర్వహించారు. తిరిగి రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తన కిష్టమైన అలంకరించిన గరుడ వాహనంపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



## విజయలక్ష్మీ దేవిగా ఆదిలక్ష్మీ అమ్మవారు

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి పట్టమహిషి అయిన శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి నిర్వహిస్తున శరన్నవరాత్రి ఉత్సవాలు 7వ రోజైన ఆదివారం అమ్మవారికి శ్రీ విజయలక్ష్మి దేవి అలంకారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి పట్టువస్త్రాల సమర్పణ, పూలాంగి సేవ నిర్వహించారు. తదుపరి అమ్మవారి ఉత్సవ మూర్తికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం (అభిషేకం) నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి పూలాంగి సేవ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పద్మపీఠోత్సవం, ఆస్థాన సేవ నిర్వహించారు. తదుపరి అమ్మవారికి విజయ లక్ష్మిదేవి అలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గోపూజ ద్వారా ముక్కోటి దేవతల అనుగ్రహం

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ప్రతి నిత్యం గోపూజ చేయడం ద్వారా జనులకు ముక్కోటి దేవతల అనుగ్రహం లభిస్తుందని భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో 7వ రోజైన ఆదివారం ఉదయం 5 గంటలకు గర్భాలయంలోని శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహా లక్ష్మిదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిలకు, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రమణ్యేశ్వరల స్వాములకు అభిషేకాలు, సుప్రభాత సేవ నిర్వహించారు. ఉదయం 6.30కి వేదపారాయణం, శ్రీ మహా రుద్రాభిషేకం, శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహా లక్ష్మిదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు ఆశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు, మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. 9.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆశ్రమంలోని యాగశాలలో శ్రీ మహా గణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ ఛండీ హోమం, నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హోమం, శ్రీ అరుణ హోమం, శ్రీ ఆదిత్య హృదయ హోమం, శ్రీ సుబ్రమణ్య మూల మంత్ర హోమం, శ్రీ నాగేంద్ర మూలమంత్ర హోమం, శ్రీ సర్పసూక్త హోమాలు నిర్వహించి భగవతి విజయేశ్వరీ దేవి పూర్ణహుతిని హోమగుండాలలో సమర్పించారు. సాయంత్రం 6.30కి మణిద్వీప మహా సంస్థానంలో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన, రాత్రి శ్రీ లలితాంబికా దేవికి శ్రీ శాఖాంబరీ దేవి అలంకారం నిర్వహించి, గజ వాహనంపై ఆశ్రమంలోని మాఢవీదులలో క్షేత్రోత్సవం నిర్వహించారు.



29-9P g7exHMNWJQE 11_29-9P g7exHMNWJQE.qxd 9/29/2025 12:03 AM Page 1



# మూలా నక్షత్రం సందర్భంగా విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

● ప్రజలు సహకరించాలి: సీపీ రాజశేఖరబాబు



**విజయవాడ క్రైం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దసరా పండుగ నవరాత్రుల్లో అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునే ఆనవాయితీ ఉన్నందున అమ్మవారి టెంపుల్‌కి వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్‌ను డైవర్షన్ చేయనున్నట్లు విజయవాడ సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. పున్నమిఘాట్ ఎంట్రెన్స్ (కుమ్మరిపాలెం సెంటర్), తాడేపల్లి చెక్‌పోస్టు, ఆర్టీసి ఇన్‌గేట్, కనకదుర్గ ఫ్లై ఓవర్ ఎంట్రెన్స్, గద్ద బొమ్మ సెంటర్‌లను ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాలుగా గుర్తించామన్నారు. సదరు డైవర్షన్ ప్రాంతాల వైపు నుండి ఆదివారం రాత్రి 7.30 గంటల నుండి సెప్టెంబరు 30వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఎటువంటి వాహనాలను అమ్మవారి గుడి వైపు అనుమతించమని ఆయన స్పష్టం చేశారు.

- తాడేపల్లి చెక్‌పోస్ట్ నుండి బ్యారేజీ వైపుకు వచ్చే వాహనాలను కనకదుర్గ వారధి వైపు నుండి మళ్ళించనున్నట్లు తెలిపారు.
- గుంటూరు వారధి వైపు నుండి భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్ళాల్సిన వాహనదారులు కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా మళ్ళించనున్నామన్నారు.
- జగ్గయ్యపేట వైపు నుండి భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్ళాల్సిన వాహనదారులను గద్దబొమ్మ సెంటర్ మీదుగా, కాళేశ్వరరావు మార్కెట్, పంజా సెంటర్, విజి చౌక్, చిట్టినగర్, స్వరంగం మీదుగా మళ్ళించనున్నామన్నారు.
- పున్నమిఘాట్, కుమ్మరిపాలెం వైపు నుండి నగరంలోకి వచ్చే వాహనాలను గుప్తా సెంటర్ మీదుగా సితార జంక్షన్, సొరంగం, చిట్టినగర్, ఎర్రకట్ట, బిఆర్టీఎస్ వైపుగా మళ్ళించనున్నట్లు ప్రకటించారు.
- ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై జంక్షన్ మీదుగా సితార జంక్షన్, సివిఆర్ ఫ్లై ఓవర్, పైపుల రోడ్డు, సింగ్‌నగర్ వైపుకు మళ్ళించనున్నామన్నారు.
- విజయవాడ సిటీ నుండి ఆర్టీసి ఇన్‌గేట్ వైపు నుండి రాష్ట్ర సచివాలయానికి హైకోర్టు, రాజధాని అమరావతి వైపుకు వెళ్ళే వాహనదారులు కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా భవానీపురం, గొల్లపూడి వద్ద బైపాస్ రోడ్డు మీదుగా కాని కనకదుర్గ వారధి, తాడేపల్లి మీదుగా కాని వాహనాలను మళ్ళించనున్నామన్నారు.
- హైదరాబాద్, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వైపు నుండి వచ్చే వాహనాలను బబ్బూరి గ్రౌండ్, పున్నమిఘాట్, భవానీపురం లారీస్టాండ్, టీటీడీ ఖాళీ స్థల ప్రదేశం, ఆర్టీసి వర్క్‌షాపు రోడ్‌ల నుండి వచ్చే పెద్ద వాహనాలైన బస్సులకు సోమవారి ఖాళీస్థలంను పార్కింగ్ ప్రదేశాలుగా గుర్తించామన్నారు.
- గద్ద బొమ్మ వరకు వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను కాళేశ్వరరావు మార్కెట్ సెల్లార్, గాంధీ మున్సిపల్ హైస్కూలు రోడ్డులను పార్కింగ్ ప్రదేశాలుగా గుర్తించామన్నారు.
- విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు వైపు నుండి వచ్చే వాహనాలకు వెస్ట్ బైపాస్ మీదుటా సితార జంక్షన్ వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశాన్ని గుర్తించామన్నారు.
- గుంటూరు, అవనిగడ్డ, మచిలీపట్నం వైపు నుండి వచ్చే వాహనాలను బిఆర్టీఎస్ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలన్నారు.
- గుంటూరు, అవనిగడ్డ, మచిటీపట్నం వైపు నుండి వచ్చే వాహనాలకు బిఆర్టీసి రోడ్డులో పార్కింగ్ చేయాలని తెలిపారు.

కావున దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, విజయవాడ పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు పై పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని ఆయన కోరారు. విజయవాడ నగరవాసులు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసించే స్థానిక ప్రజలు మూలా నక్షత్రం సందర్భంగా అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా ఉండేందుకు పైన తెలిపిన డైవర్షన్ మార్గాల వైపు నుండి ప్రయాణించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# ఆర్డీటిని రక్షించుకుంటాం

## మరో పొలికేకతో ఆందోళనకు ప్రజా సంఘాలు సన్నద్ధం

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆర్డీటికి ఎఫ్‌సిఆర్ఎ లైసెన్సీ ఇప్పించే విషయంలో విఫలమవుతోందని ఆర్డీటి పరిరక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో పొలికేక పేరుతో జనాన్ని సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో ఆందోళనకు సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్‌ని కలిసి ఆర్డీటి సమస్యను విన్నవించాలని ఆర్డీటి పరీక్షల కమిటీ నేతలు సన్నాహాల్లో ఉన్నారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తగు రీతిలో స్పందించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఆర్డీటి పరిరక్షణ కమిటీ ప్రత్యేకంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆర్డీటి పరిరక్షణ కోసం కూటమి పెద్దలు మాట్లాడుతున్న మాటలను ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు విశ్వసించడం లేదు. గత ఆరు నెలలుగా చెప్పిన మాటలే చెబుతున్నారు గాని సమస్య మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్నది. ఆర్డీటి పరిరక్షణ కమిటీ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణకు జిల్లా ప్రజలు, అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాలలో దసరా పండుగను సైతం బహిష్కరించినా పండుగ పట్ల ప్రజలలో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదనే సదుద్దేశంతో పండుగ తర్వాతనే ఉద్యమంలోకి వెళ్లాలని నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం నిర్వహించ తలపెట్టిన "కేంద్ర కార్యాలయాల ముట్టడి" కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఆ కార్యక్రమం స్థానంలో సోమవారం జిల్లాకు కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలిసి అర్డీటీ పరిరక్షణ కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేయాలని నిర్ణయించారు. అన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆదివారంనాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్డీటి వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎక్కడో పుట్టి ఇక్కడికి వచ్చి పేదలను అక్కున చేర్చుకున్న ఆర్డీటి వ్యవస్థాపకులు ఫెర్రర్ గారు ఫాదర్(తండ్రి) అయితే ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన ప్రభుత్వ పెద్దలు ఆర్డీటిని నిలుపుకోలేక చతికిలపడి, దోషి (నేరస్తుడు)గా నిలబడ్డారని, దీనిని బట్టి ఎక్కడ పుట్టారు అన్నది ముఖ్యం కాదని, పుట్టిన తరువాత జన్మభూమికి ఏమి చేశారన్నదే ప్రధానం. అందుకే ఆర్డీటి పరిరక్షణ జరగకపోతే జిల్లా ప్రజలు ఏ త్యాగాలకైనా సిద్ధపడతారని నాయకులు హెచ్చరించారు. ఆర్డీటిని పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని, పాలక ప్రభుత్వాల దిగివచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి పరిరక్షణ కమిటీ కన్వీనర్ సాకే హరి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రమణ, ఐఎఫ్టియు డి సురేష్, ఐఎంఎం భాష, బహుజన యువసేన చంద్రాచర్ల హరి, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి తరుపున హరినాథ్ రెడ్డి, లక్ష్మీదేవి, బేడ బుడగ జంగం అంజి, ఎంఆర్పిఎస్ చిన్న ఆంజనేయులు, బడికి రాజు, సామాజిక ఐక్యవేదిక శంకర, కుళ్ళాయప్ప, కళాకారులు ఎర్రిస్వామి, ఈశ్వర్, రామకృష్ణ, సూర్యనారాయణ, సంజీవ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డిటి వ్యవస్థాపకులు పాదాలు విన్సెంట్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఆందోళనకారులు



సౌర విద్యుత్ గ్రామంగా

# కొండారెడ్డిపల్లి

రూ.10.50 కోట్లతో ఏర్పాటు ● దేశంలో రెండోది తెలంగాణ సిఎం స్వగ్రామం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** దేశంలో రెండో గ్రామం, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామం సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి గుర్తింపు పొందనుంది. ఈ మేరకు పౌరసంబంధాల శాఖ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న కొండారెడ్డిపల్లిలో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. రాష్ట్ర రెడ్కో ద్వారా రూ.10.53 కోట్లతో 514 ఇండ్లతో, పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి ఇంటికి 3 కెడబ్ల్యూ స్థాపిత సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కెడబ్ల్యూ సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థం 1,500 కెడబ్ల్యూగా ఉంది. మట్టి గోడలతో ఉన్న 34 ఇండ్ల కుటుంబాలు కూడా సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, ఇండ్ల పైన సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు రెడ్కో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ కె.మనోహర్‌రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.10.53 కోట్లు కాగా, అందులో రూ.7.96 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు కేటాయించారు. సౌర విద్యుత్ నిమిత్తం కేంద్రం సబ్సిడీ కింద రూ.3.56 కోట్లు, ప్రైవేటు కంపెనీ నుండి కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా రూ4.092 కోట్లు భరించాయి. మరో రూ.2.59 కోట్లను మౌలిక వసతుల అభివృద్ధికి ఖర్చు చేశారు. కాగా ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి (రోజుకు 120 యూనిట్లు) అవుతుంది. ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇంటి వినియోగానికి పోగా, మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అనుసంధానం చేశారు. గ్రిడ్‌కు పంపే విద్యుత్ యూనిట్‌కు రూ.5.25 చొప్పున చెల్లించుటకు లబ్దిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ నెలలో విద్యుత్ గ్రిడ్‌కు గ్రామం నుండి సుమారు లక్ష యూనిట్ల విద్యుత్ ఎగుమతి అయింది. తద్వారా రూ.5 లక్షలు ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించినట్లు పౌరసంబంధాల శాఖ వెల్లడించింది.

# నాకు పదేళ్లు పవరిస్తే.. న్యూయార్క్‌లా 'ఫ్యూచర్ సిటీ'



● పదేళ్లలో మరో మహా నగరాన్ని నిర్మిస్తా
● 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువుదీరుతాయి
● యేడాదిలోగా అద్భుతమైన సింగరేణి కార్యాలయం
● బుల్లెట్ రైలుకు అనుమతించిన కేంద్రం
● ప్రపంచ దేశాలను తలదన్నేలా నిర్మాణాలు
● కొత్త సిటీకి భూమి పూజ చేసిన టి సిఎం రేవంత్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని, పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే నగరాన్ని నిర్మిస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కందుకూర్ మండలం మీర్‌ఖాన్‌పేటలో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాలను తలదన్నే విధంగా మన భారత ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు కొనసాగుతాయని అందుకనుగుణంగా మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన అంతర్జాతీయ విమానాశ్రయం, సారవంతమైన భూములు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు ఈ సిటీకి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాడు 436 సంవత్సరాల క్రితం కులీ కుతుబ్ షా ఎంతో అద్భుతంగా మన హైదరాబాద్ నగరానికి శ్రీరాకం చుట్టారని గుర్తుచేశారు. సికింద్రాబాద్ ను నాటి 220 సంవత్సరాల క్రితం నిజాం నవాబ్ నిర్మించిన విషయాలన్ని ఆయన గుర్తుచేశారు. నవాబ్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌లను నిర్మిస్తే నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిలు సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్ ఔటర్ రింగు రోడ్డుల నిర్మాణంతో మన హైదరాబాద్ కు ఒక గుర్తింపును తీసుకువచ్చారని, అందులో బాగంగానే భవిష్యత్ కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం భారత ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని నాలుగు కోట్ల జనాభాలో అనేక మంది ఇతర దేశాల అద్భుతాలు, ఆ నగరాల మౌలిక సదుపాయాలను గుర్తుచేస్తూ అమ్మో... అయ్యో , దేవుడా అంటూ సింగాపూర్, దుబాయ్, జపాన్ ను జర్మని ఇలా అనేక దేశాల గురించి వర్ణించడం చూస్తున్నామని భవిష్యత్ లో మన ఫ్యూచర్ సిటీని ప్రపంచ దేశాలలోని అందరు కూడా మన ఫ్యూచర్ సిటీ అద్భుతాలను, అందమైన రోడ్లను, మౌలిక సదుపాయాలను వర్ణించే విధంగా తీర్చిదిద్దేందుకు మరో 10 సంవత్సరాలు అవకాశమివ్వాలని రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ గొప్ప నగరానికి అన్ని హంగులతో కూడిన రహదారులు, విద్యుత్, మెట్రో రైళ్లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రధాన జంక్షన్ నుండి బెంగుళూర్ వరకు రోడ్డు నిర్మాణంతో పాటు బుల్లెట్ రైలు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, అమరావతి ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి అక్కడి నుండి మద్రాస్ నుంచి మరో బుల్లెట్ రైలును అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. దక్షి ణ భారత దేశంలో పోర్టు అందుబాటులో లేని రాష్ట్రం ఒక తెలంగాణానే ఉందని, ఇక్కడి నుంచి ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడానికి ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి మీదుగా మచిలీ పట్నం పోర్టు వరకు రైలు మార్గాన్ని సైతం ఏర్పాటు చేయడానికి కేంద్రం నుండి అనుమతులు వచ్చాయని తెలిపారు.

### 70 ఏళ్ల తర్వాత కూడా మన గురించి ప్రపంచం మాట్లాడుకునే పనులు చేయొద్దా?

భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ? అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్(వయా అమరావతి)కి కేంద్రం ఒప్పుకొంది. ఇక్కడ 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది నా స్వప్నం. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్ కంపెనీలే ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటాం. ఈ విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడవద్దు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటాం. దక్షి ణ భారతంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నాం. ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ వర్సిటీలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలు ఎఫ్సీడీఏ నుంచే చేపడతాం. సింగరేణికి పదెకరాల భూమి ఫ్యూచర్ సిటీలో కేటాయిస్తాం. ఏడాది తిరిగే లోగా సింగరేణి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీ డవలప్‌మెంట్ ఆదారిటీ భవనాన్ని డిసెంబర్‌లోగా ప్రారంభిస్తామని, తాను నెలకు రెండు లేదా మూడు సార్లు ఇక్కడి భవనం నుంచి రాష్ట్ర పాలన వ్యవహారాలను కొనసాగిస్తానని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబులు పూచర్ సిటీ వ్యవహారాలను పరిశీలిస్తుంటారని ఆయన రేవంత్ రెడ్డి తెలిపారు. ఇక్కడ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సముచిత న్యాయం కల్పిస్తామని, వారికి ప్లాట్లు ఇతర నష్టపరిహారాన్ని అందించడానికి మహేశ్వరం ఇంచార్జ్ కెఎల్ఆర్, ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్థానికంగా ఫ్యూచర్ సిటీ రైతుల సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని, వారికి అందుబాటులో ఉంటూ వారికి చేయూతనివ్వాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో భూములను కల్పోయిన రైతులకు పట్టాలు, ప్లాట్లు పంపిణీ చేయడం జరిగిందని, వారికి ఇందిరమ్మ పథకం క్రింద ఇండ్లు నిర్మించేందుకు సైతం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, కార్పోరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, రాంరెడ్డి, మాజీ శాసన సభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఫ్యూచర్ సిటీ డవలప్‌మెంట్ కమిషనర్ శశాంక, టీజీపీసీ చైర్ పర్సన్ నిర్మల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఫ్యూచర్ సిటీ నా కోసం కాదు భవిష్యత్ తరాల కోసమే.**

తనకు ఇక్కడ భూములున్నందు వల్లే ఫ్యూచర్ సిటీ కడుతున్నారని అంటున్నారని పేర్కొన్నారు. తన కోసం కాదు.. భవిష్యత్తు తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని వివరించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీరాఖాన్ పేటలో ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ(ఎఫ్సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. చంద్రబాబు, వైఎస్ఆర్ ముందు తరాల కోసం ఆలోచించారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయి. గత పాలకుల నుంచి మంచి ఉంటే నేర్చుకోవాలి. చాలా మంది విదేశాలకు వెళ్లి వచ్చి అద్భుతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నాళ్లు న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ గురించి చెప్పుకొంటాం.. మనం కూడా అలా తయారు కావాలి కదా. నాకు పదేళ్లు సమయం ఇవ్వండి.. న్యూయార్క్ మరిపించే నగరం కడతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు.

# పోస్టులు: 783 ఎంపిక: 782

● గ్రూప్-2 ఫలితాలు విడుదల
● ఒక పోస్టును నిలిపేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ఆదివారం ప్రకటించింది. ఫలితాలను టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఆదివారం కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. మొత్తం 18 ప్రభుత్వ శాఖల్లోని 783 పోస్టులకు సంబంధించి.. ఎంపికైన 782 మంది జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఛైర్మన్ తెలిపారు. 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించిన కమిషననఒక వెకెన్సీని విత్ హెల్డ్‌లో పెట్టినట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండోసారి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను 2022లో విడుదల చేయగా, 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించారు. సుమారు 5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో పరీక్షకు 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థులకు సంబంధించిన మార్కులు, జనరల్ ర్యాంక్ లిస్టును ఈ ఏడాది మార్చి 11న టీజీపీఎస్సీ విడుదల చేయగా.. వివిధ కోర్టు కేసుల అనంతరం ఆదివారం గ్రూప్-2 తుది ఫలితాలను టీజీపిఎస్‌సీ ప్రకటించింది.

# జూబ్లీహిల్స్ బైపోల్‌కు సెంట్రల్ అబ్జర్వర్ నియామకం

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, తెలంగాణతో పాటు ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారం నాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బిహార్‌లోని నియోజక వర్గాలతోపాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్), ఘాట్‌సిలా (జార్ఖాండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), డంపా (జార్ఖండ్), నువాపడా (ఒడిశా)లో పని చేయనున్నారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల్లో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది. కాగా, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో బై ఎలక్షన్ అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ స్థానానికి బిఆర్ఎస్ నుంచి గోపినాథ్ సతీమణి సునీత పోటీ చేయనుండగా ఇతర పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది.

# విహెచ్ పేరుతో బతుకమ్మ కుంట



● తన జీవితాశయంగా పోరాటం చేశారు
● అగ్గువకు వస్తుందని ప్రభుత్వ భూములు కొనొద్దు
● మూసీ పునరుజ్జీవనానికి అతీతంగా కలిసిరావాలి
● బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ఆడబిడ్డలను మన సంతోషంలో భాగస్వాములను చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిండుదనం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం.. చెరువులో బతుకమ్మలు వదిలి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎంపీ వి.హనుమంతరావు తన జీవితాశయంగా బతుకమ్మ కుంట కోసం పోరాడారని కొనియాడారు. హైడ్రా ఏర్పాటు చేసినప్పుడు కొంతమందికి దాని ఉద్దేశం అర్థం కాలేదని.. మరికొందరు అర్థమైనా కబ్జాలను కాపాడుకునే ప్రయత్నం చేశారని తమ ప్రభుత్వంపై చాలా విమర్శలు వచ్చినప్పటికీ ఒడిదుడుకులను సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లామన్నారు. ఒకప్పుడు జీవధారగా ఉన్న మూసీ నది ఇప్పుడు మురికి కూపంగా మారిందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "రాజకీయాలకు అతీతంగా మూసీ పునరుజ్జీవానికి అందరూ కలిసి రావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. వర్షం వస్తే గంటలో మూసీ పరివాహక కాలనీలు జలమయం అవుతున్నాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

29-09pg10fB 12 ONG_29-09pg10fB.qxd 9/28/2025 11:15 PM Page 1






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps